సంవుటం 12 సంచిక 207

రిజిస్టర్డ్ నం, H 45; స్థాపితము 1925

గోలకొండపత్రిక

2-12-1959 హైద్రాబాదు. బుధవారం

సంపాదకుడు: ఎన్.నరోత్తమరెడ్డిఎం.ఏ

6 పేజీలు 7 నయాపైసలు

101070

కాకినాడలో విద్యార్థి వర్గాలమధ్య ఘర్షణ

8 మంది అరెస్టు, నలుగురికి గాయాలు

హైద్రాబాద్, డిసెం 1

గత ఆదివారం కాకినాడ ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్‌కు 40 మంది పూర్వవిద్యార్థులు వెళ్ళి అందరి విద్యార్థులపై దాడిచేశారని ఇక్కడికివార్త అందినది. ఈ ఘర్షణలో నల్గురికి గాయాలు తగిలాయట. పోలీసులు ఎనమిది మందిని అరెస్టు చేశారు.

ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు కొందరు మరో కళాశాల విద్యార్థుల కొట్టారని దానిపై ఈ ఘర్షణ జరిగినదని భావించబడుచున్నది.

DIRECT. OF ARCHIVES, ANDHRA PRADESH, HYDERABAD.
MERGED PAPER RECORDS
FILE COPY

కాంగ్రెస్ విప్ అమలు

హైద్రాబాద్, డిసెం 1

రాష్ట్రంలోని ఇరువది జిల్లా పరిషత్తుల అధ్యక్ష స్థానాలను కాంగ్రెస్ గెలచినది.

జిల్లా పరిషత్తులు జిల్లా బోర్డులస్థానే ఏర్పడినట్టివి. శ్రీకాకుళం, కృష్ణా జిల్లాలలో కాంగ్రెస్ అభ్యర్థులు స్వతంత్ర పార్టీ నామినీల 2 మరియు 5 ఓట్ల తేడాతో ఓడించగలిగారు.

వరంగల్, నల్లగొండ జిల్లాలలో కమ్యూనిస్టు నామినీలు కాంగ్రెస్ చేతుల్లో ఓడింపబడినారు.

కాంగ్రెస్ విప్ ధిక్కరించ బడినట్లు జె. వి. ఒప్పుకోలు

అయితే యీ వ్యవహారంలో తన ప్రమేయం లేదంటూ, క్రమశిక్షణను ఉల్లంఘించినవారిని విమర్శిస్తూ పబ్లిక్ వర్క్సు మంత్రి ప్రకటన

హైద్రాబాద్, డిసెం 1

పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ జె. వి. నర్సింగరావు ఒక ప్రకటనలో యిలా పేర్కొన్నారు:

"ఆదిలాబాద్‌కు చెందిన కొందరు కాంగ్రెసువాదులు నా ప్రయత్నంపై లేక నా అనుమతిపై కాంగ్రెసు విప్‌ను ధిక్కరించారని ఆరోపిస్తూ కొన్ని పత్రికలలో పడిన వార్తలు సత్యదూరమైనవి. నేనుఆదిలాబాద్‌లో ఉండగా జిల్లా పరిషత్తు ఎన్నికల సందర్భంగా ఎక్కువ సమయాన్ని వినియోగించాననే ఆరోపణలో కూడ నిజం లేదు. జిల్లా పరిషత్తు ఎన్నికల తేదీ నిర్ణయానికి చాలముందుగానే ఆదిలాబాద్‌లో నా అధికార పర్యటన కార్యక్రమం నిర్ణయించబడింది. ఆ పర్యటనలో జిల్లా కేంద్రానికి చాలదూరానగల ప్రదేశాలు చేరిఉన్నవి. నేను నిర్మల్‌లో ఉండగా కాంగ్రెసువాదులకు ఒక విప్ జారీచేయబడిందని విన్నాను. ఇటీవల కాంగ్రెసులో చేరిన సోషలిస్టులు మరికొందరి జోక్యంవలన ఏర్పడిన అనవసర ఉద్రిక్తత దృష్ట్యా ఆ విప్‌ను తు. చ. తప్పకుండా పాటించాలనేదే నాసంకల్పం.

"ఆదిలాబాద్ కాంగ్రెసు రాజకీయాల విషయమై- ముఖ్యంగా సోషలిస్టులు కాంగ్రెసుతో చేరిన తరువాత- కలవరమైన వార్తల్ని కొంతకాలంగా వింటున్నాను. సంస్థలోనూ, జిల్లా పరిషత్తు ఎన్నికలలోనూ కూడ సామరస్య పూర్వకమైన పరిష్కారాన్ని సాధించడానికి ఎల్లప్పుడూ కృషిచేస్తూనే ఉన్నాను. కాని కాంగ్రెసులోని ఒక వర్గంవారు రెండో వర్గంవారితో అక్రమంగా వ్యవహరిస్తున్నట్లు చెప్పడానికి విచారిస్తున్నాను.

నేను నిర్మల్ నుండి నవంబర్ 28వ తేదీన తిరిగిరాగానే విప్‌కు అనుకూలముగా ఎన్నిక జరిగేటట్లుచూడాలని కాంగ్రెసు వాదులందరికీ చెప్ప ప్రయత్నించాను. నేను కాంగ్రెసు సభ్యుల్ని కలుసుకోవడానికి వీలు కల్గించడానికిగాను ఎన్నిక ఒక గంట సేపు వాయిదా పడిందంటే నా నిజాయితీ, ప్రయత్నానికి అదే నిదర్శనం. విప్‌ను ధిక్కరించటం దురదృష్టకరం. ఈ సంఘటనకు గల కారణాలన్నిటినీ తెలుసుకోవడానికి సత్వరమే, తీవ్రమైన విచారణ జరగడం అవసరం. ఈ సంఘటన మంచి చెడ్డల్ని గురించి మరేమీ చెప్పగోరడం లేదు. ఈ దురదృష్టకరమైన సంఘటనలో నేను భాగస్వామినని చేయబడిన ఆరోపణలన్నిటినీ ఖండిస్తున్నాను."

కరీంనగరం ఎన్నికలలో జె.వి. విఫల యత్నం

కరీంనగరం, డిసెంబర్ 1. కరీంనగరము జిల్లా పరిషత్తుకు నల్గురు సభ్యుల్ని కోఆప్టు చేసుకొనడానికి జరిగిన ఎన్నిక ఓటింగ్ వివరాల్ని పరిశీలిస్తే సుమారు ఎనిమిది లేక తొమ్మిది మంది కాంగ్రెసు సభ్యులు అధికార కాంగ్రెసు అభ్యర్థికి వ్యతిరేకముగా ఓటుచేశారని స్పష్టపడుతుంది. వీరింత ద్రోహము చేసినా అదృష్ట వశాత్తూ కాంగ్రెసు అభ్యర్థులు పరాజయము చెందలేదు.

40మంది సభ్యులుగల జిల్లా పరిషత్తులో కాంగ్రెసు పార్టీబలం 26. వీరు గాక సోషలిస్టు సభ్యులు నల్గురు కాంగ్రెసులో చేరడానికి నిర్ణయించుకొన్నారు. వారితోకలసి కాంగ్రెసు బలం 30 కు పెరిగింది. కాని కోఆప్షనుకు నిలబడిన అధికార కాంగ్రెసు అభ్యర్థులలో స్త్రీలకు 22 చొప్పున, హరిజనులకు 21 చొప్పున మాత్రమే ఓట్లు వచ్చినవి. సోషలిస్టుసభ్యులు నలుగురు బలపర్చకపోతే శ్రీ జె వి. నర్సింగరావు వర్గంవారిద్రోహం వలన కాంగ్రెసు అభ్యర్థులు ఓడిపోయి ఉండేవారు.

పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష పదవులకు ఓటింగ్ జరిగిన సమయంలోకూడ శ్రీ జె. వి. నర్సింగరావు సహకారంతో శ్రీ రామచంద్రరావువారి సహచరులు పార్టీ లో చీలికను తేవడానికి విఫల ప్రయత్నం చేశారని తెలుస్తున్నది.

పార్టీలో క్రమశిక్షణా రాహిత్యాన్ని అంతమొందించడానికి గట్టి చర్యల్ని గైకొనవలసిందని కోరుతూ కరీంనగరంజిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు శ్రీ జె. రమాపతిరావు ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షునికి ఫిర్యాదు చేసినట్లు తెలుస్తున్నది. ఈ విషయమై విచారణ జరిపించి, క్రమశిక్షణను ఉల్లంఘించిన వారిపై చర్యతీసుకోవలసిందని కూడ ఆయన కాంగ్రెసు అధ్యక్షునికి విజ్ఞప్తి చేశారు.

పరిపాలనా నిర్వహణకు తగిన వ్యక్తులకు శిక్షణ

చాల అవసరమని ఐక్యరాజ్య సమితి 10 రోజుల గోష్ఠిని ప్రారంభిస్తూ ప్రధాని నెహ్రూ

న్యూఢిల్లీ, డిసెం 1

ఆసియా, దూర ప్రాచ్య దేశాల పబ్లిక్ పారిశ్రామిక సంస్థల మేనేజిమెంటు వారి 10 రోజుల సమావేశాల్ని ప్రారంభిస్తూ ప్రభుత్వ సంస్థల పరిపాలనా నిర్వహణకు వ్యక్తులకు శిక్షణ యిచ్చి తయారు చేయడం చాల అవసరమన్నారు. ఈ విధమైన సంస్థలు భవిష్యత్తులో చాల ఎక్కువ కాగలవన్నారు.

ఐక్యరాజ్యసమితి, భారత ప్రభుత్వం ఏర్పాటు చేసిన యీ గోష్ఠికి 12 ఆసియా దూరప్రాచ్య దేశాల ప్రతినిధులు, యింకా బ్రిటన్, రష్యా దేశాల ప్రతినిధులు, సమితి ప్రతినిధులుకూడ హాజరైనారు.

సివిల్ సర్వీసులు ప్రయివేటువర్గాల వారు యీ విధమైన వ్యక్తుల్ని తయారు చేయగలరని శ్రీ నెహ్రూ అన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు, ప్రయివేటు ఉద్యోగాలకు ఒకే రకమైన వ్యక్తులు పనికిరారని, ఏ సంస్థకు ఎలాంటి వారు కావాలో శిక్షణ యివ్వడం అవసరమని శ్రీ నెహ్రూ అన్నారు.

జమూరియా బజార్ ప్రేలుడులో మృతుల సంఖ్య 42కు పెరుగుదల

విచారణ జరిపిస్తున్నట్లు డా॥ బి.సి. రాయ్ ప్రకటన

కలకత్తా, డిసెంబరు 1

అసన్సోల్ వద్ద జమూరియాబజార్ ప్రాంతంలో జరిగిన ప్రేలుడు ప్రమాదములోమృతులసంఖ్య 42కు పెరిగింది.

నిన్న రాష్ట్ర శాసనసభలో ప్రసంగిస్తూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి డా॥ బి.సి.రాయ్ యీప్రమాదాన్ని గూర్చి ప్రభుత్వం విచారణను ప్రారంభించినట్లు ప్రకటించారు. ఈ ప్రకటన అనంతరం ప్రతిపక్షాలవారి వాయిదా తీర్మానాన్ని డిప్యూటీ స్పీకర్ శ్రీఆశుతోష్ మల్లిక్ తోసివేశారు.

కలింపాంగ్ ప్రాంతంలో జాగ్రత్తా చర్యలు

డా॥ బి.సి.రాయ్ శాసనసభలో ఒక ప్రశ్నకు జవాబిస్తూ కలింపాంగ్ ప్రాంతంలో భారతవ్యతిరేక చైనా అనుకూల కార్యక్రమాలను గూర్చి రాష్ట్ర ప్రభుత్వం జాగ్రత్తా చర్యలు తీసుకుంటున్నదన్నారు. ప్రస్తుతానికి విదేశీ సాహిత్యం అమ్మకాలపై సూత్రీకరణ ఎట్టి నిషేధమూ లేదన్నారు.

'నేఫా' ప్రాంతంపై విదేశీ విమానాలు

సెప్టెంబరు మూడోవారంలో ఎగిరినవార్త నిజమేనని వివరణ

న్యూఢిల్లీ, డిసెం 1

సెప్టెంబర్ మూడవ వారములో "నేఫా" ప్రాంతంపై కొన్ని విమానాలు ఎగిరినవనీ అయితే అవి ఎవరివో తెలుసుకోలేక పోయామనీ విదేశాంగ శాఖ ఉపమంత్రిణి శ్రీమతి లక్ష్మీమీనన్ నేడు రాజ్యసభలో శ్రీ అమలోక్ చంద్ ప్రశ్నకు జవాబిస్తూ అన్నారు. అవి టిబెట్ వైపువెళ్ళడంగాని టిబెట్ నుండి రావడంగాని జరిగిందన్నారు.

ప్రధాని నెహ్రూ కొన్ని అనుబంధ ప్రశ్నలకు జవాబిస్తూ మనసరిహద్దుపై ఎగిరే విమానాల్ని కూలగొట్టాలనే సూచనను నిరాకరిస్తూ ఒకదేశంయుద్ధములోఉంటేతప్ప సాధారణంగాఅలా జరగదన్నారు.

విమానాల్ని గుర్తుపట్టడానికి వీలయిగించే పద్ధతుల్ని వెల్లడించడం క్షేమం కాదన్నారు. విమానాలుచాల ఎత్తునుండి పోయినా, చాలవేగముగా పోయినా గుర్తుపట్టడం కొంతకష్టమని అన్నారు.

రాజ్యాంగపు 8 వ సవరణబిల్లు ఆమోదం

తగినన్ని ఓట్లురాక రెండవ క్లాజు మాత్రం ఓటమి

కొత్త ఢిల్లీ, డిసెం 1

నేడు లోకసభలో రాజ్యాంగపు ఎనమిదవ సవరణ బిల్లులోని రెండవక్లాజు ఓటమి చెందినది. ఈ క్లాజు మినహా బిల్లు ఆమోదింపబడినది. అనుకూలంగా 285 ఓట్లు, ప్రతికూలంగా నాల్గుఓట్లు వచ్చాయి.

ఇక 2వ క్లాజుకు 117 అనుకూలంగా 248 ఓట్లు, వ్యతిరేకంగా 24 ఓట్లు మాత్రమే వచ్చాయి ఈ క్లాజు సభ ఆమోదం పొందలేదు కావున ఇది బిల్లులోని భాగంగా ఉండలేదని స్పీకర్ ప్రకటించారు. ఇది సభ ఆమోదాన్నిపొందుటకు 253 ఓట్లు అనుకూలముగా రావాల్సి వుండెను.

ఈ బిల్లులోని రెండవక్లాజు పశ్చిమ బెంగాల్ శాసన సభకు ఆంగ్లో ఇండియన్‌ల నామినేషన్‌ను రెండు స్థానాలకు ఇతర రాష్ట్రాలకు ఒక స్థానానికి పరిమితము చేస్తున్నది. ఇప్పుడు ఈ క్లాజు ఆమోదింప బడలేదు కావున ఆయా రాష్ట్రాల గవర్నర్లు ఆంగ్లో ఇండియన్ వర్గ ప్రతినిధుల తమకు తోచినంత మందిని నామినేట్ చేయుటకు అవకాశం ఏర్పడినది.

రాజ్యాంగపు 8 వ సవరణ బిల్లు షెడ్యూల్డుకులాలు తెగలవారికి మరో పది ఏండ్లవరకు పార్లమెంటు మరియు శాసనసభలో సీట్ల రిజర్వేషన్‌ను పొడిగిస్తున్నది.

అఫ్జల్ గంజ్ మండల కాంగ్రెసు కమిటీ

వివిధ బస్తీలనుండి ప్రతినిధుల ఎన్నిక

హైద్రాబాద్, డిసెం 1

అఫ్జల్ గంజ్ మండల కాంగ్రెసు కమిటీ యానిట్ల ఎన్నికలు జరిగి ఈ దిగువ ప్రతినిధులు ఎన్నుకోబడినారు:

ఉస్మాన్ షాహి:- పి. మల్లప్ప, ఎం. నరసింహ, విఠల్ నగర్:- బి.మహేంద్ర శాస్త్రి, సెల్వేరు లక్ష్మయ్య, గుల్బర్గూడా (ఎ): వి.బాలా రాజగుప్త, టి ఇస్తరి, గుల్బర్గూడా (బి, జి. గండయ్య, ఎస్. సుందర్ సింగ్, మహారాజ్ గంజ్:- జగన్నాథం శ్యామ్ సుందర్ రావు, ఉస్మాన్ గంజ్: తీగెల మల్లప్ప, రాచూరిసోమయ్య. కిషన్ గంజ్: రామయాదయ్య, గౌరిశెట్టి వెన్నయ్య. అశోక్ బజార్ (ఎ): వి. రఘునాథన్, ఆల రాజయ్య. అశోక్ బజార్: (బి) పి. పెంటయ్య, బి. రఘునాథన్.

శ్రీ రాజా మరణానికి రాజ్యసభ సంతాపం

న్యూఢిల్లీ, డిసెంబర్ 1

నిన్న మద్రాసులో చనిపోయిన రాజ్యసభ సభ్యుడు శ్రీ హెచ్. డి. రాజా స్మారకార్థం రాజ్యసభ సభ్యులు నేడు రెండు నిముషాల పాటు నిలబడి స్వర్గీయుని ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

అంతకుముందు - అధ్యక్షుడు డా॥ రాధాకృష్ణన్ శ్రీ రాజా చాలస్నేహపాత్రుడనీ, కొన్ని ప్రత్యేక సమస్యలలో చాలశ్రద్ధ తీసుకొనే వారనీ అన్నారు. "చాల క్రిందినుండి పైకి వచ్చిన వారిలో ఆయనొకరు. ఆయన మృతి నాకు అశనిపాతంవలె వినవచ్చినది" అన్నారు.

ఆయన కుటుంబానికి సభ సానుభూతిని తెలియజేస్తానన్నారు.

'గీతా' ఏనుగు లాస్ ఏంజిల్ ప్రయాణం

బొంబాయి, డిసెం 1

గీతా అను 900 పౌండ్ల ఏనుగు గున్న లండన్‌కు ఎయిర్ ఇండియా కార్గో సర్వీస్‌లో పంపబడినది. భారతీయ నాట్యసంఘ అధ్యక్షురాలు కమలాదేవి ఛట్టోపాధ్యాయ అమెరికన్ టెలివిజన్ కార్యక్రమాల్లో ఉపయోగించేందుకు దీనిని లాస్ ఏంజిల్స్ పిల్లలకై బహూకరించినది. తర్వాత ఇది ఆ పట్టణంలోని జంతు ప్రదర్శన శాలకు పంపబడగలదు.

భారతీయ జట్టుచే ఎవరెస్టు ఆరోహణ

కొత్త ఢిల్లీ, డిసెంబర్ 1

1960 లో ఎవరెస్టు శిఖరారోహణకు భారతీయ పర్వతారోహక బృందం పంపబడుతున్నదని నేడు లోకసభలో సాంస్కృతిక వ్యవహారాల మంత్రి హుమాయూన్ కబీర్ తెలిపారు. ఈ కార్యక్రమానికై రు. 6 లక్షల ప్రభుత్వం మంజూరుచేయ అంగీకరించినదని ఇందురు. 246185 ఈవరకే ఇవ్వబడినవని వీరు సూచించారు.

కాంగ్రెసు అధ్యక్షత

శ్రీ హనుమంతయ్య ఉపసంహరణ

బెంగ్లూర్, డిసెంబర్ 1

పూర్వ మైసూరు రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి హనుమంతయ్య భారత జాతీయ కాంగ్రెసు అధ్యక్షతకు పోటీ చేయనుండడాన్ని విరమించుకున్నారు.

వీరు శ్రీ సంజీవరెడ్డి పోటీలేకుండా ఎన్నికవడమే తమ అభిమతమని పత్రికా ప్రతినిధులకు వ్యక్తం చేశారు. తమనిర్ణయాన్ని ఎ. ఐ. సి. సి.కి తెలిపామన్నారు.

ఆర్మ్‌స్ట్రాంగ్ ఉదంతం

చైనా ప్రకటనకు అమెరికా తిరిగి ఖండన

వాషింగ్టన్, డిసెం 1

అమెరికా కాన్సులేట్ ఉద్యోగులే చైనా కాన్సులేట్ ఉద్యోగిని అపహరించి దౌర్జన్యం జరిపారంటూ నిన్న చైనా విదేశాంగ శాఖాధికారి పెకింగ్ నుండి చేసిన ప్రకటనను తిరిగి అమెరికా ప్రభుత్వ వర్గాలు ఖండించాయి. ఆ ప్రకటన తమ తప్పిదాన్ని దాచిపెట్టుకోడానికి చైనా చేసిన ప్రకటన అని యీవర్గాలు వ్యాఖ్యానించాయి.

నవంబరు 27న అమెరికన్ ఉద్యోగి ఆర్మ్‌స్ట్రాంగ్ చైనా కాన్సులేట్ ఉద్యోగి చాంగ్ చెన్ యూతోపాటుఒక టాక్సీలో చైనీస్ కాంపౌండు వద్దకు రాగా ఆతనిని చుట్టుముట్టి కొంబోయి దౌర్జన్యము జరిపారని అమెరికా ఆరోపించింది.అక్రితంరోజుచాంగ్ చెన్ యూ అమెరికా కాన్సులేట్‌కు వచ్చి శరణు కోరగా ఆర్మ్‌స్ట్రాంగ్ ఆరాత్రి అంతా ఆతనిని కాపాడాడట.

అధికాహారోత్పత్తి సాధన, నిరుద్యోగ సమస్య పరిష్కారం

జిల్లాపరిషత్తు ముఖ్యకర్తవ్యాలు కావాలని హైద్రాబాద్ పరిషత్తును ప్రారంభిస్తూ రెవిన్యూమంత్రి శ్రీ కె.వి.రంగారెడ్డి ఉద్బోధ

హైద్రాబాద్, డిసెంబరు 1

ఆంధ్రప్రదేశ్ రెవిన్యూమంత్రి శ్రీకొండా వెంకటరంగారెడ్డి నేటి ఉదయం యిక్కడి జిల్లా కలక్టర్ కార్యాలయంవద్ద హైద్రాబాదు జిల్లా పరిషత్తుకు ప్రారంభోత్సవంచేస్తూ ప్రజాస్వామ్య అధికార వికేంద్రీకరణ పద్ధతిక్రింద నెలకొల్పబడిన ప్రజాసంస్థలు జిల్లా పరిషత్తులు, పంచాయతీ సమితులు దేశ ఆహారోత్పత్తిని అధికం చేయడంలోనూ, ఉద్యోగావకాశాల్ని ఎక్కువచేయడంలోనూ విజయాన్నిసాధిస్తే వాటినినెలకొల్పిన ఆశయం నెరవేరుతుందన్నారు.

నేడే రాష్ట్రంలోని మరో 10 జిల్లాపరిషత్తులకు కూడా ప్రారంభోత్సవాలు జరిగినవి. రేపు మిగిలిన పరిషత్తులు ప్రారంభించబడుతాయి.

నేడు దేశాన్ని ఎదుర్కొంటున్న రెండు ముఖ్య సమస్యలు ఆహారం, నిరుద్యోగంఅని శ్రీరంగారెడ్డిఅన్నారు. కొత్తగాఏర్పడిన యీసంస్థలు ఆహారోత్పత్తికీ, నిరుద్యోగ నిర్మూలనకూ ప్రాధాన్యం యివ్వాలి,

హైద్రాబాద్‌లో-ముఖ్యంగా జిల్లాలలోని-పరిస్థితులు గత కొద్ది సంవత్సరాలలో చాలా మార్పులకు గురయినట్లు ఆయన చెప్పారు.పోలీసు చర్యకు పూర్వం హైద్రాబాద్ జిల్లాలో ఒక ప్రాథమిక పాఠశాలయినా లేదు. అప్పటి ప్రభుత్వం ప్రయివేటు వర్గాలు ప్రాథమిక పాఠశాలల్ని నెలకొల్పడానికి అనుమతి నిరాకరించేది.

1928 లో నిజాం అప్పటి హైద్రాబాదు రాష్ట్రంలోఉన్న 400 ప్రయివేటు పాఠశాలలనూ మూసివేయాలని ఫర్మానా జారీచేశాడు. హైద్రాబాదుజిల్లా సర్చెఖాస్‌గానూ,జాగీర్దార్ల స్వంత ఆస్తిగానూ ఉండేది నిజాంగాని జాగీర్దార్లుగాని గ్రామీణ ప్రజలకు విద్యాసౌకర్యాల్ని కలిగించడం తమ ధర్మమని భావించలేదు.

అప్పటి సంస్థాన లెజిస్లేటివ్ కౌన్సిలులో జాగీర్ల రద్దును కోరుతూ తాను బిల్లు ప్రతిపాదించగోరగా నిజాం అనుమతించలేదని శ్రీ రంగారెడ్డి వెల్లడించారు. అప్పుడు ముందుగా నిజాం అమోదం పొందని ఏబిల్లునూ కౌన్సిలులో చర్చించ డానికి వీలులేకుండెడిది.

అప్పట్లో గ్రామప్రజలకు సౌకర్యాల్ని కలిగించడానికి వారి యిబ్బందుల్ని తీర్చడానికిగాక పాలకుల కోశాగారాల్ని నింపుకొనడానికే పన్నులు వసూలు చేయబడేవి. గ్రామీణ ప్రాంతాల్ని దారుణంగా నిర్లక్ష్యం చేయడం జరిగింది.

స్వాతంత్ర్యం రావడంతో పరిస్థితులు మారినవి. ప్రజాస్వామ్య విశేంద్రీకరణ క్రింద పంచాయతీ సమితులు, జిల్లాపరిషత్తుల్ని ఏర్పాటు చేయడముతో స్వాతంత్ర్యం సార్థకమైనది. నూతన పద్ధతి ప్రకారం ప్రజలు తమ వాంఛితాలకు అనుగుణంగా తమ జీవితాల్ని రూపొందించుకోవచ్చు. ప్రజాప్రతినిధులకు అధికారాన్ని యివ్వడం కూడ వారి బాధ్యతను హెచ్చించినది. ఏ లోపాలకూ యిక ప్రజలు పరిపాలనాయంత్రాంగాన్ని విమర్శించరాదు.

ఉద్యోగులు ప్రజల ప్రతినిధులకు తోడ్పడడానికి సిద్ధంగా ఉంటారు అధికారులుకూడ కలసి ప్రజలకు, దేశానికి సేవ చేయడం తమకర్తవ్యంగా భావించాలి.

వ్యక్తి ప్రయత్నాలకన్నా సహకార కృషి వాంఛనీయమన్నారు. సంక్షేమ రాజ్యంలో ప్రతిఒక్కరి మంచికొరకూ అంతాకలసి కృషిచేయాలి. సహకార సేద్యం ఆశయం యిదే.

అందువలన జిల్లాపరిషత్తు సభ్యులు రైతులకు అన్నిసౌకర్యాలూ కల్పించి ఆహారోత్పత్తిని అధికం చేయడానికి కృషిచేసి దారిద్ర్య నిర్మూలనకు దోహదం చేయాలని శ్రీ రంగారెడ్డి విజ్ఞప్తి చేశారు.

అంతకుముందు జిల్లాపరిషత్తు అధ్యక్షుడు డా॥ ఎం. ఎన్. లక్ష్మీనర్సయ్య, (ఎం. ఎల్. ఏ.) మంత్రికి స్వాగతం చెబుతూ అధికార వికేంద్రీకరణ కార్యక్రమాన్ని అమలు జరపడంలో ఆంధ్రప్రదేశ్ ముందంజ వేసిందన్నారు. ఇక ప్రజల బాధ్యత పెరిగింది. ప్రజలు ఈ పథకం అమలులో తీసుకొనే శ్రద్ధపైనే దీని విజయం ఆధారపడి ఉంటుంది. గ్రామప్రజల పరిస్థితిని పెంపొందించడానికి యిప్పుడు మంచి అవకాశం లభించినదన్నారు. ఇంతకు ముందు గ్రామీణ ప్రాంతాలు నిర్లక్ష్యం చేయబడినవి.

జిల్లాకలక్టరు శ్రీ బి. ఎఫ్. దిటియా యిప్పుడిక అధికార, అనధికారులు సహకరించి పనిచేయాలన్నారు.స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పరిపాలనలో భాగస్వాములు కావాలని ప్రజలుకోరుతున్నారు. మొదటి చర్యగా కమ్యూనిటీ అభివృద్ధి పథకాలు ప్రవేశపెట్టబడినవి. ఇప్పుడిక జిల్లాపరిషత్తులు ఏర్పడటంతో "ప్రజల కొరకు ప్రజల ప్రభుత్వం" అనే ఆశయం నెరవేరింది. అభివృద్ధిపనులకు అవరోధం కలగకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సంక్షేమ కార్యక్రమాన్ని అమలు జరపడంలో ప్రజాప్రతినిధులకు సహాయం చేయాలి.

శ్రీ గోపాలరావు ఎల్చేటి, ఎం-ఎల్-ఏ. హైద్రాబాదు నగరం, సమీప ప్రాంతాలమధ్య వ్యత్యాసాల్ని తగ్గించాలన్నారు. నగరంలో అన్ని సౌకర్యాలూ ఉన్నవి. అయితే ఆ సమీపంలోని ప్రాంతాలలోని ప్రజలకు ఏ విధమైన సౌకర్యాలూలేవు.

శ్రీ వందేమాతరం రామచంద్రరావు,ఎం-ఎల్-ఏకూడ ప్రసంగించారు.

జిల్లా పరిషత్తు ఉపాధ్యక్షుడు శ్రీ భోజిరెడ్డి ఎం-ఎల్-సి వందన సమర్పణం చేశారు.

అందమైన వ్రాత ప్రతి ఖరీదు!

లండన్, డిసెంబర్ 1

ప్రపంచంలోని అతి సుందరమైన వ్రాత ప్రతిగా భావింపబడే సెయింట్ జాన్ జీవిత చరిత్రి 65 వేల స్టెర్లింగ్ ల (దాదాపు రు. 867 వేలు)కు విక్రయింపబడినది. దీనిని హెచ్. పి. కాస్ అనే వ్యక్తి కొన్నాడు.

మహిళలకు మంచి వార్త

సినిమా తారలవలె కాకుండా పురుషులకు ఆశ్చర్యము కల్గించుటకు మరియు

స్త్రీలకు అసూయ కలిగించు విధముగా వుండుటకు

మా వద్ద ఇప్పుడే వచ్చిన అధునాతన స్టాకు నుండి

మీకు నచ్చిన చీరెల ఎన్నుకోండి!

బనారస్ & డక్కా నూలు చీరెలు

కాశ్మీర్ & బెంగాల్ సిల్క్ అద్దకపు చీరెలు

ఫ్యాషన్స్

పార్కులేన్ (ఫోన్: 6258) సికింద్రాబాద్.

(A. A)

అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనము

హైద్రాబాదు.

1960 జనవరి 1 నుండి, ఫిబ్రవరి 10 వ తేదీవరకు.

ప్రకటన

40 రోజుల ప్రదర్శనకాలమునకు ఎగ్జిబిషన్‌లో శాకాహార, మాంసాహార హోటళ్ళు, తలాన్‌ఘర్స్, ఐస్‌క్రీమ్ మరియు కూల్‌డ్రింక్‌శాలలు, పాన్ షాపులు, సైకిల్‌స్టాండ్‌ల ప్రదేశములు ఎగ్జిబిషన్ కార్యాలయమునందు వేలం వేయబడును.

క్రమ సంఖ్య	ప్రదేశము	డిపాజిట్ పైకం	దరఖాస్తులు పంపుటకు ఆఖరు తేది	వేలం తేది
1.	శాకాహార, మాంసాహార హోటళ్ళు.	రు. 1,500/-	11-12-59 సా॥ 5 గం॥	12-12-59 సా॥ 4 గం॥
2.	తలాన్‌ఘర్ నెం. 1 & 2	రు. 1,000/-	,,	,,
3.	ఇతర తలాన్‌ఘర్స్	రు. 150/-	,,	,,
4.	ఐస్‌క్రీమ్, కూల్‌డ్రింక్ షాపులు	రు. 200/-	,,	13-12-59 సా॥ 4 గం॥
5.	పాన్‌షాప్	రు. 50/-	,,	,,
6.	సైకిల్‌స్టాండ్	రు. 1000/-	,,	,,

1. కోరబడిన డిపాజిట్ పైకము వేలం ప్రారంభమునకు 2 గంటల ముందుగా ఎగ్జిబిషన్ కార్యాలయములో చెల్లించవలెను.

2. గెలుపొందిన పాటదారులు పూర్తి పైకమును వేలం ప్రదేశములో చెల్లించవలెను. లేనియెడల ప్రదేశములు తిరిగి వేలంవేయబడును. తిరిగి వేలములో ఎగ్జిబిషన్ సొసైటీకి వచ్చే నష్టమునకు వారే బాధ్యులగుదురు. వేసే వేలం నిబంధనలు, షరతులను ఎగ్జిబిషన్ సొసైటీనుండి పొందవచ్చును.

గౌరవ కార్యదర్శి.

నేపాల్ కమ్యూనిస్టుపార్టి వంకర చూపు

నెహ్రూ ప్రకటనపై వక్ర భాష్యం

ఖాట్మండు, డిసెం 1

నేపాల్‌పై ఏ దేశమైనా దురాక్రమణకు దిగితే భారతదేశం అదితనపై దురాక్రమణగానే భావించగలదని ప్రధాని నెహ్రూ లోకసభలో చేసిన ప్రకటనకు నేపాల్ కమ్యూనిస్టు పార్టీ వక్రంగా వ్యాఖ్యానించినది.

భారతదేశ రాజ్యవిస్తరణకాంక్షను నెహ్రూ ప్రకటన వ్యక్తపరుస్తున్నదని దురాక్రమణ పేర ఇండియా నేపాల్‌లోనికి సైన్యాల పంపదలుస్తున్నదని నేపాల్ స్వాతంత్ర్యంపై కండ్లుకుట్టి ఇండియా తనకూ చైనాకూ మధ్యగల శీతల యుద్ధంలోకి నేపాల్‌ను లాగడానికి ప్రయత్నిస్తున్నదని నేపాల్ కమ్యూనిస్టుపార్టీ పేర్కొన్నది.

శ్రీ రంగారెడ్డి 70 వ జన్మదినం

హైద్రాబాద్, డిసెంబర్ 1

హైద్రాబాద్ జిల్లా చేగూరు గ్రామంలోని ప్రజాభిప్రాయ సమితి ఈ నెల 11 వ తేదీన తెలంగాణా నాయకులు కొండా వెంకట రంగారెడ్డి 70 వ జన్మదినాన్ని జరుప నిర్ణయించినది.

ఇద్దరు మాజీఉద్యోగుల రిట్ పిటిషన్‌లకొట్టివేత

హైద్రాబాద్, డిసెం 1

తమను సర్వీసు నుండి నిర్బంధంగా రిటైరు చేసినందుకుగాను గోవిందరావు ఖయామ్‌ఖానే, పి.కె. దలాల్ పెట్టుకొన్న రెండు రిట్ పిటీషన్లన్ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు సత్యనారాయణరాజు, అనంతనారాయణ అయ్యర్ కొట్టివేశారు.

ఖయామ్‌ఖానే పూర్వం పర్భని కలక్టర్‌గా ఉండేవారు. 1952 నుండి 54 వరకు డిప్యూటీ జాగీర్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేశారు, ఆ తర్వాత నిర్బంధంగా రిటైరు చేయించబడ్డారు. దలాల్ ఫీఫ్‌మార్కెటింగ్ ఆఫీసర్‌గా పనిచేశారు.

సైకిస్టు మృతి

హైద్రాబాద్, డిసెం 1

ఇబ్రాహీంబాగ్ సమీపంలో నేటి మధ్యాహ్నం ఒక మోటార్ సైకిల్ పోయి మరో సైకిల్‌ను గుద్దుకొనడం వల్ల సైకిస్టు మరణించాడు.

సిద్ధమకరధ్వజంమాత్రలు

నరములకు పటుత్వము, కండపుష్టి, బలముకలుగజేయును

వేంకటేశ్వర ఆయుర్వేద నిలయము

చింతలూరు, అలమూరుపోస్టు, తూ. గో. జిల్లా.

ఆంధ్రదేశమందు ముఖ్యపట్టణములలో35బ్రాంచీలు40ఏజన్సీలుగలవు!

హైదరాబాద్ బ్రాంచ్: 712, పేట్రిల్ బ్యాంక్ బిల్డింగ్స్, సికిందరాబాద్ బ్రాంచ్: 7-2-148, హిస్సమ్‌గంజ్ రోడ్, పాత పోలీస్ స్టేషన్ ఎదుట.

ఇండియాలో అధిక పరిపంట

న్యూఢిల్లీ, డిసెం 1

1958-59 సంవత్సరంలో, రష్యా సాలను మినహాయించగా ప్రపంచంలో మొత్తంమీద ధాన్యపుపంట 4960 లక్షల టన్నుల రికార్డు స్థాయిలోనున్నదని కామన్వెల్తు ఆర్థికసంఘం ఇటీవల ప్రకటించింది. ఈ అంకె, యుద్ధానంతర్వంకంటే నాల్గవవంతు ఎక్కువగా ఉంది. కామన్వెల్తు మొత్తం మీదకూడ ఈ సంవత్సరం ధాన్యపుపంట పెరిగింది. ఆసియా మొత్తంమీద ప్రత్యేకంగా ఇండియాలో ఈ సంవత్సరం పరివంట బాగా అధికంగాఉన్న ధోరణి కనిపించుతున్నది. ఈ పెరుగుదలకు ముఖ్యమైన కారణం మెరుగైన పద్ధతులను ఉపయోగించటమని భావించబడుతున్నది.

టిబెట్ ప్రజల సహాయానికై కమిటీ స్థాపన

కౌలాలంపూర్, డిసెం 1

టిబెట్ ప్రజలు స్వయం నిర్ణయాధికారాన్ని సాధించుకొనుటలో తోడ్పడుటకై పదకొండుగురు సభ్యులుగల చర్యాకమిటీ మొన్న ఇక్కడ మలయా ఫెడరేషన్ లో అధికారమందుగల పార్టీ సమావేశంలో ఏర్పరచబడినది.

Dr. S. M. Luqman

డా. ఎస్. ఎమ్. లుఖ్మాన్

శాస్త్ర సమ్మతమైన, కచ్చితమైన కంటి చికిత్సకు, ఇతర కంటి అవసరాలకు ఆంధ్రప్రదేశ్ లో సుప్రసిద్ధులు.

జనతా ఆప్టీషియన్స్

ప్రొప్రయిటర్: ఎస్. ఎమ్. లుఖ్మాన్, నిజాంపాహిరోడ్, ఫోన్: నెం. 5141 వారితో సంప్రదించండి.

రు. 10000/- విలువగల వాచీలు ఉచితము.

మా హేరాయిల్ నెం. 501 ప్రఖ్యాతిగాంచుటకు రు. 10000/- విలువగల వాచీలను ఉచితముగా యిచ్చుటకు నిర్ణయించుకున్నాము.

బాల్ నం. కాలాతేల్ 501 సహజంగా కేశవృద్ధికి పనికివచ్చు విటమిన్ కలది. బట్టతలను కూడ మాపును. కుదుళ్ళనుండి తెల్లబారిన కేశాలను సహజమైన నలుపురంగుకు మార్చును. కండ్లకు చలువచేయును. సీసా ఖరీదు రు. 2-50; 3 సీసాలు రు. 6-50.

ఈ తలనూనెను ప్రచార మొనర్చు నుద్దేశముతో ఒక సీసా కొన్న వారికి ఒక కొత్త బంగారం ఉంగరము, ఫ్యాన్సీ రిస్టువాచ్; 3 సీసాలు కొంటే 4 ఉంగరాలు, 4 వాచీలు బహుమతి ఇవ్వబడగలవు.

Navjiwan Pharmacy (G. P. H)
Rupnagar, Delhi.

తామర ఎగ్జిమా, గజ్జి, మొదలైన తదితర చర్మ వ్యాధులకు గత 20 ఏండ్ల నుండి ప్రఖ్యాతి గాంచిన అమోఘమైన చికిత్స.

తయారు చేసినది.

జోన్ కెమికల్ కంపెనీ.

88 సి. న్యూ ప్రభాదేవిరోడ్, బొంబాయి- 3.

విశారి సం॥ మార్గశిర శు॥ విదియ ఉ6-34తదియ రా8-7మూలప12 11 ప వ 10-47 మొ: 12-11 వరకు రా వ 8-45 మొ: 10-11 వరకు (శాలివాహన శకము: 11-9-1881) 1959 డిసెంబరు 2 బుధవారము

సజీవ ఆదర్శం

"మన గ్రామము, మన సమాజము శరీరము వలె సజీవముగను, చైతన్యవంతముగనుండవలెను. సమాజమంతటా దుఃఖమును సమానముగ అనుభవించవలెను. ఇట్టి ఆదర్శము గల సమాజమే సజీవముగా నుండగలదు. ఉత్పత్తి అభివృద్ధినందుటతో బాటు కరుణగూడ అభివృద్ధినందవలెను."

--- వినోబా

గోలకొండ పత్రిక

ఫోన్. నెం. 3280

1959 డిసెంబరు 2 బుధవారము

మూడవ పంచవర్ష ప్రణాళిక- ప్రజల ఆరోగ్యము

మూడవ పంచవర్ష ప్రణాళికలో ప్రజల ఆరోగ్యమునుగూర్చి ఇతోధిక శ్రద్ధను వహించవలసిన ఆవశ్యకతను కేంద్రప్రభుత్వ ఆరోగ్య కౌన్సిల్ గుర్తించుట గమనించదగిన విశేషము. ఈ కౌన్సిల్ సమావేశాలు యీవారము క్రొత్తఢిల్లీలో జరిగినవి. ఈ సమావేశములో ప్రజల ఆరోగ్యమునకు సంబంధించిన సమస్యలు చర్చింపబడి కొన్ని నిర్ణయాలు గావించుట జరిగినది. మూడవ పంచవర్ష ప్రణాళికలో నూటడెబ్బదియైదు కోట్ల రూపాయలు, నీటి సరఫరా మరియు నగర పారిశుద్ధ్యమునకు సంబంధించిన కార్యక్రమాలను అమలు చేయుటకొరకును, యేడున్నర కోట్ల రూపాయలు ప్రత్యేకముగా మశూచి నివారణ కార్యక్రమాల కొరకును కేటాయింపబడినవి. ఈవిధముగా మూడవ పంచవర్ష ప్రణాళికలో ఆరోగ్యము కొరకు కేటాయించిన మొత్తము రెండవ పంచవర్ష ప్రణాళికలో కేటాయించిన దానికన్న ఒకటిన్నర రెట్లు హెచ్చుగానున్నది.

మన దేశములో నీటి సరఫరా సమస్య చాల ముఖ్యమైనదిగానున్నది. సరియైన నీటి సదుపాయములేని గ్రామాలు అసంఖ్యాకముగా కలవు. సరియైన శుభ్రమైన నీటి సౌకర్యము లేనందువలన అనేక వ్యాధులు ప్రబలుటకు అవకాశము కలుగుచున్నది. స్వయముగా కేంద్ర ఆరోగ్య మంత్రిగారు యీ సత్యమును గుర్తించి ఉద్ఘాటించినారు. గ్రామాలకు మంచి నీటి సదుపాయమును కలిగించుట వలన అనేక రోగాలను నివారణ చేయవచ్చును. ఈ విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించవలసియున్నది. గ్రామ పంచాయతీలు, బ్లాకు సమితులు, జిల్లా పరిషత్తులు స్థానికముగా యీ సమస్యల పరిష్కారానికి తగు కృషి చేయవలసియుండును.

మన దేశములో మశూచికము ఒక క్రూరమైన వ్యాధిగా నున్నది. కొన్ని సందర్భాలలో యీ వ్యాధి ప్రబలి ప్రాణహానికి గూడ కారణభూతమగుచున్నది. సుందర మూర్తులను కురూపులుగా మార్చి, వికలాంగులనుగాజేయు యీ వ్యాధి మిక్కిలి దుస్సహమైనది. ఈ వ్యాధి సోకకుండునట్లుగా నిరోధక చర్యలను తీసికొనవలసియుండును. టీకాలు అధిక సంఖ్యలో వేయించవలసియుండును. ఇటువంటి నిరోధక చర్యలను దేశవ్యాప్తముగా అమలు చేయుటకు తగు యేర్పాటులు జరుగవలసియుండును. ప్రస్తుతము యిందుకొరకు కేటాయించిన మొత్తము సక్రమముగా వినియోగపరచినచో తగు లాభము జరుగగలదని ఆశించవచ్చును.

స్ఫోటకము వలెనే మన దేశములో ప్రతి సంవత్సరము అనివార్యముగా ప్రబలుచున్న వ్యాధులు మరికొన్ని గలవు. కలరా, ప్లేగు, మలేరియా మొదలైన వ్యాధులు యీ తరగతిలో చేరియున్నవి. ఈ వ్యాధుల చికిత్స కొరకేగాక, యీ వ్యాధులు సోకకుండునట్లుగా నిరోధక చర్యలను అమలు చేయుటకొరకుగూడ ప్రత్యేక శ్రద్ధ వహించవలసియుండును. అయితే పాఖండములోని దేశాలలో యీ వ్యాధుల నివారణ పూర్తిగా జరిగినదని తెలియుచున్నది. అదేవిధముగా మన దేశములోకూడ యీ వ్యాధుల సంపూర్ణ నిరోధము జరుగవలసియుండును.

మన దేశములో వైద్య సౌకర్యాలు తగినంతగా లేవను సత్యము సుప్రసిద్ధమైనది. మూడవ పంచవర్ష ప్రణాళికలో మరొక పదమూడు వైద్యకళాశాలల స్థాపన జరుగగలదనియు, వైద్య కళాశాలలలో ప్రవేశావకాశాలు హెచ్చించుట జరుగగలదనియు తెలియుచున్నది. సరియైన చికిత్స సకాలములో జరుగనందువలన సంభవించుచున్న ప్రాణనష్టము మన దేశీయులందరికిని బాగుగా తెలిసియేయున్నది. గ్రామ ప్రాంతాలలో వైద్య సౌకర్యాలను అభివృద్ధి చేయు విషయమై ప్రత్యేక శ్రద్ధ వహించవలసియుండును. ఆయుర్వేదము, యూనాని, హోమియోపతీ విధానాలను గూడ ప్రోత్సహించి మన దేశ అవసరాల దృష్ట్యా, ప్రజల సదుపాయము దృష్ట్యా వినియోగించుకొనవలసియుండును. ఈ సమస్యనుగూర్చి బాగుగా ఆలోచించి, ఉచితమైన నిర్ణయాలు జరుగవలసియుండును.

ఇథోపియా యువరాణి ధరించే చంద్రహారం మాయం

పోయిన ఆభరణపేటికలో మరో ఐదు ఉంగరాలు కూడా

బొంబాయి, డిసెం 1

ఇథోపియా యువరాజు భారతదేశములో తన రెండు వారాల పర్యటన ముగించుకొని వెళ్ళిపోయారు గాని ఆయనకు, చెందిన ఒక ఆభరణ పేటిక మాత్రం ఎక్కడో పోయినట్లు అధికార వర్గాలు ప్రకటించాయి. ఆ ఆభరణ పేటికలో షాయువరాణి ధరించే చంద్రహారం ఉందట. దాని విలువ లక్షరూపాయలు. ఇంతే కాక ఆ పేటికలో ఐదుబంగారపుటుంగరాలు కూడా ఉన్నాయని తెలుస్తున్నది.

సింగరేణి కాలరీస్ కంపెనీ విరాళం

హైద్రాబాద్, డిసెం 1

ఆంధ్రప్రదేశ్ డిశార్జ్డ్ ఖయిదీల సహాయతా సంఘానికి విడుదలయిన ఖైదీల పునరావాస కృషి నిమిత్తము సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ వారు రు. 500 విరాళం ఇచ్చారు.

ఢిల్లీలో ఐదు దినాల ఐసెన్‌హోవర్ మకాం

9వతేదీన స్వాగతం, 14వతేదీ ఉదయం వీడ్కోలు

న్యూఢిల్లీ, డిసెంబరు 1

అమెరికా ప్రెసిడెంట్ డ్వయట్ డి. ఐసెన్‌హోవర్ సతీ సమేతంగా డిసెంబరు 3 గురువారంనాడువాషింగ్‌టన్‌లోబయలుదేరి తన 11 దినాల పర్యటన సందర్భంగా డిసెంబరు 9 వ తేదీ సాయంత్రం 4-30లకు న్యూఢిల్లీ చేర్తాడు.

పాలం విమానాశ్రయంలో ఆయనకు రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్, ఉపరాష్ట్రపతి డా॥ రాధాకృష్ణన్, ప్రధాని శ్రీ నెహ్రూ స్వాగతమిస్తారు. లాంఛనప్రాయంగా జరిగే ప్రముఖుల పరిచయాల అనంతరం ఐసెన్‌హోవర్ రాష్ట్రపతి భవనానికి వెళ్తాడు. ఇక ఆరోజుకు ఏమీ కార్యక్రమాలుండవు.

డిసెంబరు 10

మరునాడు డిసెంబరు 10 వ తేదీన మధ్యాహ్నంపూట ఐసెన్‌హోవర్ ప్రధాని నెహ్రూను కలిసి ఆయనతో విందు కుడుస్తాడు. అంతకు మునుపే నెహ్రూ ఐక్‌నుకలిసి పరామర్శిస్తారు. ఆ మధ్యాహ్నం ఒక గంటపాటు నెహ్రూ - ఐక్‌లు చర్చించుకుంటారు. ఆ ఉదయమే ఐసెన్‌హోవర్ రాజఘాట్‌కు వెళ్ళి గాంధీజీ సమాధి పుష్పాంజలి సమర్పించి అక్కడొక మొక్క నాటుతాడు. ఆరోజునే ఐక్ పార్లమెంటు సభ్యుల సమావేశములో కూడా ప్రసంగిస్తాడు, రాత్రికిరాష్ట్రపతి కావించే విందులో పాల్గొంటాడు.

డిసెంబరు 11

రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ డిసెంబరు 11 సాయంత్రం ప్రపంచ వ్యావసాయిక ప్రదర్శనానికి ప్రారంభోత్సవం జరుపుతారు. దీనికి ఐసెన్‌హోవర్ హాజరవుతాడు పిమ్మట ఇద్దరు అధ్యక్షులూ ప్రదర్శనంలోని అమెరికన్ శాలకు వెళుతారు. అక్కడ "అమెరికా మేళా"కు లాంఛనప్రాయంగా ఐక్ ప్రారంభోత్సవంచేస్తాడు. ఆనాటి ఉదయం ఐక్ ఢిల్లీ విశ్వవిద్యాలయానికి వెళ్ళి అక్కడ గౌరవపట్టాన్ని స్వీకరిస్తాడు. ఆరోజు నాతడు అమెరికాఛాన్సలరికికూడా వెళుతాడు.

డిసెంబరు 12

ఐసెన్‌హోవర్ డిసెంబరు 12 న విశ్రాంతి తీసుకుంటాడు. రాష్ట్రపతి తనగౌరవార్థం ఆరాత్రి ఇచ్చే విందుకు హాజరవుతాడు, తానుకూడా ప్రధాని నెహ్రూగౌరవార్థం ఒకవిందుచేస్తాడు.

డిసెంబరు 13

పదమూడో తేదీ ఆదివారంనాడు ఐసెన్‌హోవర్ విమానంలో ఆగ్రావెళుతాడు. విమానాశ్రయంనుండి ఆయన 12 మైళ్ళ దూరంలో ఉన్న లారోండా కమ్యూనిటీ అభివృద్ధి బ్లాకును సందర్శిస్తాడు. ఆయన వెంట ఆ బ్లాకులో ఉండికొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న డా॥ స్కూన్‌హోవర్ (లోర్డాండా గ్రామీణ శిక్షణ సంస్థ) ఉంటాడు. తాజ్‌మహల్ నుసందర్శించి సాయంత్రం ఐక్ ఢిల్లీ చేర్తాడు. ఆ సాయంత్రమే రాంలీలా గ్రౌండ్స్‌లో ఆయనకు పౌరసన్మానం జరుగుతుంది. రాత్రికి రాష్ట్రపతి భవన్‌లో ప్రధాని నెహ్రూ ఇచ్చేవిందులోపాల్గొంటాడు.

డిసెంబరు 14

అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్ ఢిల్లీలో ఐదు దినాల పర్యటన ముగించుకొని డిసెంబర్ 14 వ తేదీ ఉదయం 6-40 లకు ఢిల్లీ నుండి వెళుతాడు.

ఢిల్లీలో ఉండగా ఐసెన్‌హోవర్‌కు మధ్యప్రదేశ్ ఆరోగ్య మంత్రిణి రాణి పద్మావతీదేవి రెండు పులిపిల్లని బహూకరిస్తుంది.

కరాచీలో

ఐసెన్‌హోవర్ ఢిల్లీకి వచ్చేముందే రెండురోజులు కరాచీలోగడుపుతాడు. డిసెంబరు 7 సాయంత్రానికాతడు కరాచీచేర్తాడు. ప్రెసిడెంట్ అయూబ్ ఖాన్ ఐక్‌తో కాశ్మీర్ సమస్యతోసహా అనేక ఇండో - పాక్ సమస్యలు చర్చిస్తాడని తెలుస్తున్నది. అయితే ఏసమస్య విషయంలోను ఐక్ మధ్యవర్తిత్వానికి పూనుకోడం ఉండబోదని అమెరికన్ వర్గాలంటున్నాయి.

కాకినాడ, బందరు రేవుల అభివృద్ధి కృషిపట్ల అసంతృప్తి

రాష్ట్రప్రణాళికా సంఘ సభ్యుడు శ్రీ జె. వి. సోమయాజులు ప్రసంగం

విజయవాడ, డిసెంబర్ 1

"మనదేశంలో జనసామాన్యానికి తిండి, గుడ్డా సమృద్ధిగా ఇవ్వగలిగినప్పుడే మనం వేసుకున్న పంచవర్ష ప్రణాళికలు ఫలవంతం అయినట్లుకాగలదు," అని ఆంధ్ర చాంబర్ ఆఫ్ కామర్సు (మద్రాసు) మాజీ అధ్యక్షులు శ్రీ జె.వి. సోమయాజులు నవంబరు 28వ తేదీన జరిగిన విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్సు చతుర్థ వార్షికోత్సవసభను ప్రారంభిస్తూ అన్నారు.

ఈసభకు శాసనసభ్యుడు శ్రీ బెల్లాకుల జాలయ్య అధ్యక్షత వహిస్తూ కాంగ్రెసు ప్రభుత్వాలు ఫర్తక వాణిజ్యాలకు అపకారం చేయవన్నారు. ప్రారంభంలో చేంబరు అధ్యక్షులు శ్రీ బచ్చు వెంకటేశ్వర్లు సభికులకు స్వాగతం చెప్పారు.

"మన ద్వితీయ తృతీయ పంచవర్ష ప్రణాళికలు విజయవంతం కావడానికి మనం ఎక్కువగా పరిశ్రమలు స్థాపించుకోవాలనీ మన రాష్ట్రంలో పంటలకు, ఖనిజాలకు, నదులకు కొరత లేదనీ అయినా మనం అధికంగా ముందుకు పోలేక పోతున్నాం అనీ చెరకు, ప్రత్తి, ఆహార దినుసులు ఎక్కువగా పండించాలనీ శ్రీ జె. వి. సోమయాజులు తెలిపారు. అప్పుడు పంచదారమిల్లులు, గుడ్డలమిల్లులు ఎక్కువగా స్థాపించవచ్చు. మన ప్రభుత్వాలు వాణిజ్య సంస్థల ప్రతినిధుల సహకారం, సలహాలను పొందుతూ వుండాలి. మన ఎగుమతులూ దిగుమతులూ అభివృద్ధి చెందటానికి చౌక రవాణాసాధనాలు ఉపయోగించుకోవడానికి మన రేవు పట్టణాలైన కాకినాడ, బందరు రేవుల అభివృద్ధి జరగాలి. దానికి 28 లక్షల రూపాయలు కేటాయించిన మన ప్రభుత్వం అయిదు లక్షలుకూడా ఖర్చు చేయలేకపోయింది అని ఆయన విమర్శించారు. శ్రీ జె. వి. సోమయాజులు ఇప్పుడు మన రాష్ట్ర ప్రణాళికా సంఘ సభ్యులుకూడా.

తర్వాత డాక్టరు తెన్నేటి వెంకటశేషాచలపతిరావు ప్రసంగిస్తూ మన దేశంలో ప్రణాళికలు చూడటానికి భాగున్నా అనుభవానికి రావడం లేదన్నారు. విద్యావంతు న యువకులు నిరుద్యోగులై రిక్షాలు లాగుతున్నారని ఆయన అన్నారు. ఇటలీ దేశంలో దశవర్ష ప్రణాళిక వేసుకుని పంటల ఉత్పత్తిని సాధించగలిగినా నిరుద్యోగ సమస్య అలాగే వుండిపోయిందన్నారు. పశ్చిమ జర్మనీలో నిరుద్యోగులకు జీవనభృతి ఇస్తున్నారనీ దానివి తీసుకునేందుకు నిరుద్యోగులు కార్లమీద వెళ్తున్నారనీ - మన దేశంలో ప్రజలు ఈ ప్రణాళిక తమదని కృషి చేసి విజయవంతం చేస్తేతప్ప ఈ సమస్యలు పరిష్కరింపబడవనీ అన్నారు. మనదేశంలో నూటికి 11మంది రెండు పూట్లా తింటున్నారు. 29 మంది ఇతర్ల మీద ఆధారపడి తింటున్నారు. తక్కిన 66 గురికి తిండిలేదు. మన ప్రభుత్వం ఈప్రణాళికలో మన రాష్ట్రానికి ఖర్చు చేద్దామని కేటాయించిన 105 కోట్ల రూపాయలూ ఖర్చు కావడంలేదు. బెజవాడలాంటి పట్టణంలో ఈ ప్రణాళికవల్ల సాధించగలిగింది 10 మందికి ట్రైనింగు ఇచ్చే వొర్కర్సు ట్రైనింగ్ సెంటరు, రాజమండ్రిలాంటి పట్టణానికి సీమసున్నం పరిశ్రమ ట్రైనింగ్ సెంటరు స్థాపించారు. అక్కడ కాగితపు మిల్లును అభివృద్ధి చేస్తున్నారు. ఇక్కడ పెద్దామనుకున్న పాడి పరిశ్రమ, సైకిల్ విడిభాగాల పరిశ్రమ విదేశీ ద్రవ్యమారకం దొరకనందున అలాగే ఉన్నాయి. మంత్రులు వచ్చినప్పుడల్లా చాంబర్ వారు విందులుచేసి, విజ్ఞప్తులు సమర్పిస్తున్నారు. కొన్నింటిని మంత్రులు తర్వాతి ప్రణాళికలలో చూస్తాం అంటున్నారు. మరి కొన్నింటిని వీలులేదు అంటున్నారు. ఇలాగే ఓర్మితో చాంబరు తన కృషిని కొనసాగించాలి. అని ఆయన అన్నారు.

శ్రీ నార్ల వెంకటేశ్వరరావు ప్రసంగిస్తూ వర్తకులు నలుగురూ బాగుంటేనే తమ బాగు అని పనిచేయాలన్నారు.

తర్వాత శ్రీయుతులు వెంపటిపురు పోత్తం, యేలేటి శేషగిరిరావు, సుంకర వీరబ్రహ్మం, ప్రభృతులు ప్రసంగించారు.

కార్యదర్శి శ్రీ సోమరాజు అంజనేయులు వందనములు అభినందనలు తెలిపారు. (స్వ. వి)

నల్లగొండజిల్లాలో పొదుపు ఉద్యమం

కలక్టరు శ్రావణకుమార్ కృషి

నల్లగొండ, డిసెంబరు 1

నల్లగొండజిల్లా కలక్టరు శ్రీ శ్రావణకుమార్ జిల్లాలోని ఉద్యోగులందరి ద్వారా చిన్న మొత్తాల పొదుపు ఉద్యమాన్ని జయప్రదం చేయడానికి ఒక కార్యక్రమాన్ని రూపొందించారు. అందుకుగాను గ్రామీణ ఉద్యమం డిసెంబరు 15వ తేదీన ప్రారంభమై 1960 జనవరి 15వ తేదీన ముగుస్తుంది.

ఈనెల రోజులలో ఉద్యోగులు విస్తృతంగా ఆయాప్రాంతాలలో పర్యటించి జాతీయ పొదుపు ఆవశ్యకతను ప్రజలకు నచ్చజెపుతారు. ఈఉద్యోగుల వెంట అక్కడ కక్కడ సేవింగ్స్ సర్టిఫికెట్లను జారీచేసే నిమిత్తం తపాలాశాఖ గుమస్తా ఒకరుంటారు.

ఈఉద్యమానికై సుమారు వెయ్యి గ్రామాలు ఎంపిక చేయబడినవి. బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు, తాసీల్దార్లు, డిప్యూటీ తాసీల్దార్లకు యీ సేకరణ పని అప్పగించబడింది.

జిల్లాబోర్డు ఆఖరి సమావేశం

నల్లగొండ జిల్లాబోర్డు ఆఖరి సమావేశం నవంబర్ 24వ తేదీన జరిగింది. జిల్లాకలక్టరు శ్రీ శ్రావణకుమార్ అధ్యక్షత వహించారు. పంచాయతీ సమితి, జిల్లాపరిషత్తుల చట్టం అమలు జరగడంతో జిల్లాబోర్డు రద్దయింది

జిల్లాబోర్డు గత సమావేశంలో రోడ్లు, పాఠశాల భవనాలు, హాస్టల్సు మున్నగువాటిని నిర్మించే విషయమై వివిధ పథకాల్ని మంజూరి చేసింది.

నారాయణపురంలో ఒక హాస్టల్‌ను నిర్మించాలని నిర్ణయించబడింది రామగిరిలోని బాలమందిరానికి రు. 1000 గ్రాంటు చేయబడింది.

వివిధ రంగాలలో తగినంత అభివృద్ధిని సాధించడానికి దోహదం చేసిన సభ్యులందరికీ కలక్టరు శ్రీ శ్రావణకుమార్ కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాది శ్రీ పి. వి. రంగారావు అనధికార సభ్యుల తరఫున కలక్టరుకు యితర అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

పరిషత్తుకు కోఆప్షన్

నల్లగొండజిల్లా పరిషత్తు సమావేశం జిల్లాబోర్డు కార్యాలయంలో జిల్లాకలక్టరు శ్రీశ్రావణకుమార్ అధ్యక్షతలో జరిగినప్పుడు నల్గురు సభ్యులు కోఆప్టు చేసుకోబడినారు

శ్రీ కె. రామకృష్ణారెడ్డి కుమారి కమలమ్మ, శ్రీమతి టి. యోజనగంధి పేర్లను, శ్రీ సి. వెంకటరెడ్డి శ్రీమతి సుశీలా, శ్రీమతి పద్మపేర్లను ప్రతిపాదించారు. మొత్తం ఓట్లలో 28 ఓట్లు వచ్చిన కుమారి కమలమ్మ, శ్రీమతి టి. యోజనగంధీ ఎన్నికైనట్లు ప్రకటించబడింది

శ్రీ కె. రామకృష్ణారెడ్డి ప్రతిపాదించిన హరిజన అభ్యర్థులు శ్రీయుతులు వి. కాశీరాం, నామా వెంకయ్య కూడ ఎన్నుకోబడినారు.

నల్లగొండజిల్లాపరిషత్తులో 48గురు సభ్యులున్నారు. అందులో ఒకరు రాజ్యసభ సభ్యులు, యిద్దరు లోకసభ సభ్యులు, 9 మంది ఎం. ఎల్. సి లు 12 మంది ఎం. ఎల్. ఏ. లు 10 మంది పంచాయతీ సమితి అధ్యక్షులు, 9 మంది నాన్ బ్లాక్ ప్రాంతాల ప్రతినిధులు, నలుగురు కోఆప్టు అయిన సభ్యులు, కలక్టరు ఉన్నారు.

సాధుజీకి లక్ష రూపాయల సర్వోదయ కానుక

ఆంధ్రి ప్రజలకు ప్రముఖుల విజ్ఞప్తి ప్రకటన

హైదరాబాద్, డిసెం 1

ఆంధ్రిప్రదేశ్ ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అల్లూరి సత్యనారాయణరాజు, రాష్ట్ర శాసన సభాధ్యక్షులు అయ్యదేవర కాళేశ్వరరావు, కేంద్ర పౌరవ్యయశాఖ మంత్రి బెజవాడ గోపాలరెడ్డి, కేంద్ర రక్షణ శాఖ ఉపమంత్రి కొత్తపల్లి రఘురామయ్య, రాష్ట్ర హోం మంత్రి మందుముల నర్సింగరావు, ఆర్థిక మంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి, విద్యామంత్రి పట్టాభిరామారావు, పి-డబ్ల్యు-డి మంత్రి జె. వి. నర్సింగరావు, పరిశ్రమలమంత్రి అనగాని భగవంతరావు, వ్యవసాయ మంత్రి పి. తిమ్మారెడ్డి, స్థానిక పరిపాలనా మంత్రి డి. సంజీవయ్య, ప్రదేశ్ కాంగ్రెసు అధ్యక్షుడు పిడికిలి రంగారెడ్డి, యార్లగడ్డ శివరామప్రసాద్ (చల్లపల్లిరాజా), యం. ఆర్. అప్పారావు (పుయ్యూరు కుమార్ రాజా), గొట్టిపాటి బ్రహ్మయ్య, ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండలి సంయోజకులు ప్రభాకర్‌జీ, సర్వోదయ మండలి సభ్యులు ఉమ్మెత్తల కేశవరావు, చింతలపాటి వరప్రసాదమూర్తి రాజు, తిమ్మయశెట్టి, స్టేటు ఖాదీబోర్డు ఉపాధ్యక్షులు నూతి రాధాకృష్ణయ్య, గెడ్డం సన్యాసిరావు, ఖాదీగ్రామోద్యోగ కమీషన్ జోనల్ డైరెక్టరు పి. వి. రాఘవన్, ఎర్నేని లక్ష్మీనారాయణ, యేనుగు పట్టాభిరామరెడ్డి, అడుసుమల్లి వెంకటసుబ్బారావు, లోకర్స్‌లాల్ కపాడియాలు ఈ క్రింది సంయుక్త ప్రకటన చేస్తున్నారు:

"గాంధీమహాత్మునిముఖ్యానుచరులు దండి సత్యాగ్రహయోధులు నిర్మాణ కార్యదీక్షాపరులు, సర్వోదయసిద్ధాంత ప్రచారకులు అయిన శ్రీ సాధు సుబ్రహ్మణ్యంగారికి నవంబరు 15వ తేదీకి సరియైన వికారినామ సంవత్సర కార్తీక శుద్ధ 15న షష్టిపూర్తి అయినది. వారు గాంధీమహాత్ముని సన్నిధిని పెక్కు సంవత్సరములుండి దండిసత్యాగ్రహమునందు ఆంధ్రులు ఏకైక ప్రతినిధిగ పాల్గొని సత్యాగ్రహ యోధులుగా ప్రఖ్యాతిగాంచిరి. నాటినుండి నేటి వరకు ఆంధ్రిదేశపు జాతీయోద్యమచరిత్రలో అత్యంతప్రధానపాత్రి వహించి నిర్మాణ కార్యక్రమమును నిరంతర దీక్షతో కొనసాగించుచున్నారు. మహర్షి వినోబాభావేకు సన్నిహితులై ఆంధ్రిదేశమునందు భూదాన ఉద్యమమునందు తీవ్రముగ కృషిసల్పుచున్నారు. సర్వోదయ ప్రచారము అనవరతము ప్రచారము చేయుచున్నారు. ఇట్టి మహనీయుని షష్టిపూర్తి మహోత్సవము ఆంధ్రిదేశమున జయప్రదముగ జరుపుటకు పలువురు పెద్దలతో ఒక సంఘము నేర్పడినది. ఈ సంఘమువారు కనీసము లక్ష రూపాయలు వసూలుచేసి ఆంధ్రిదేశమున గ్రామస్వరాజ్య స్థాపనకు సర్వోదయ, నవనిర్మాణ కార్యక్రమ అభివృద్ధికి ఖర్చుచేయుటకుగాను శ్రీ సుబ్రహ్మణ్యంగారికి కానుకగా సమర్పించుటకు నిశ్చయించివున్నారు. కనీసం 60 గ్రామములలో షష్టిపూర్తి మహోత్సవములు జరుపుటకు సన్నాహములు కావింపబడుచున్నవి. ఈ సందర్భమున శ్రీ సుబ్రహ్మణ్యంగారితో పరిచయము గల నాయకుల, పండిత ప్రకాండుల వద్దనుండి పద్య పద్యరూపమున సంపుటిని సేకరించి సన్మాన సంచిక ప్రకటించి శ్రీ సాధుజీకి సమర్పించుటకు ఈ సంఘము తలపెట్టినది. కనుక దేశభక్తులు, ఉదార హృదయములు, దాతలు, భూరి విరాళములిచ్చి ఈషష్టిపూర్తి మహోత్సవమును అత్యంత జయప్రదము గావింప ఆంధ్రిమహాజనులకు యీ విజ్ఞప్తి అందజేయుచున్నాము."

కృష్ణాజిల్లా పరిషత్తుకు శ్రీకాకాని పరాజయం

కాంగ్రెసు అభ్యర్థి శ్రీచల్లపల్లిరాజా గెల్పు: ఉపాధ్యక్షుడుగామాత్రం స్వతంత్ర అభ్యర్థి

బందరు, డిసెంబరు 1

కృష్ణాజిల్లా పరిషత్తు అధ్యక్షుడుగా నిన్న జరిగిన ఎన్నికల్లో కాంగ్రెసు అభ్యర్థి శ్రీయార్లగడ్డ శివరామప్రసాద్ (చల్లపల్లిరాజా) గెలుపొందారు.

వీరితోపోటీ చేసిన శ్రీకాకాని వెంకటరత్నం ఓడిపోయారు. శ్రీ కాకాని వెంకటరత్నాన్ని గెలిపించాలని చాలా శక్తులు విశ్వప్రయత్నంచేసినా ఫలించలేదు. శ్రీ వెంకటరత్నానికి 24 ఓట్లు రాగా శ్రీ శివరామప్రసాద్‌కు 29ఓట్లు వచ్చాయి. అయితే శ్రీ వెంకటరత్నం పక్షంవాళ్ళు కావించిన ప్రయత్నాలు ఉపాధ్యక్ష ఎన్నిక సందర్భంలో ఫలించాయి.

ఉపాధ్యక్షుడుగా శ్రీమండలి వెంకటస్వామి (స్వ) కాంగ్రెసు అభ్యర్థి శ్రీ ఎన్.వి.ఆర్.జి. నరసింహారావునుఓడించారు. స్వతంత్ర అభ్యర్థిని శ్రీ అడుసుమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు ప్రతిపాదిస్తే శ్రీగుత్తరాజారావు బలపరిచారు, కాంగ్రెసు అధికార అభ్యర్థిని శ్రీగొట్టిపాటి బ్రహ్మయ్యప్రతిపాదిస్తే శ్రీమేకా రంగయ్యప్పారావు బలపరిచారు. శ్రీ వెంకటస్వామికి 28 ఓట్లు శ్రీనరసింహారావుకు 24 ఓట్లు వచ్చాయి. ఒక ఓటు చెల్లలేదు.

ఈపరిషత్ అధ్యక్ష ఎన్నికకు జిల్లా కలెక్టరు శ్రీగంగోపాధ్యాయఅధ్యక్షత వహించారు. కాని ఆయన తన ఓటు హక్కు వినియోగించుకొనలేదు.

శాసనసభ స్పీకర్ శ్రీఅయ్యదేవర కాళేశ్వరరావు ఓటుహక్కు వినియోగించుకోవచ్చునా రాదా అన్న వివాదం బయలుదేరింది. ఆయన ఓటుచేయరాదని శ్రీపిల్లలమర్రి వెంకటేశ్వర్లు శ్రీ పుచ్చలపల్లి సుందరయ్య వాదించారు. అధ్యక్షులు అభ్యంతరాన్ని త్రోసివుచ్చి స్పీకర్‌గా కాకుండా శాసనసభ్యుని హోదాలోశ్రీకాళేశ్వరరావు ఓటుచేయవచ్చునన్నారు.

తూర్పు గోదావరిజిల్లా పరిషత్తు

తూర్పుగోదావరి జిల్లా పరిషత్తు అధ్యక్షుడుగా శ్రీ తోటరామస్వామి (డి.సి.సి. అధ్యక్షులు) ఉపాధ్యక్షుడుగా శ్రీఉండవల్లి సత్యనారాయణమూర్తి ఎన్నికయ్యారు. శ్రీరామస్వామితో పోటీచేసిన స్వతంత్ర అభ్యర్థి శ్రీ ఎం. వి. శాస్త్రి 7 ఓట్లువచ్చి (శ్రీ రామస్వామికి 41 ఓట్లు) ఓడిపోయారు.

శ్రీకాకుళం పరిషత్తు

శ్రీకాకుళం జిల్లాపరిషత్తుకు కాంగ్రెసు అభ్యర్థి శ్రీ బెండి కూర్మన్న (29 ఓట్లు వచ్చి) ప్రత్యర్థి శ్రీ ఆర్.

గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో దిక్కులేని పరిస్థితి

"హంపీ శిథిలాలకు దీటుగాఉందని" ఒక కథనం

(మా విలేఖరి)

గద్వాల, డిసెం 1

గద్వాల ప్రభుత్వ హాస్పిటాలు పరిస్థితులు దినదినము మహావైన్యంగా తయారగుచున్నవి. ఈ హాస్పిటాలు వెనుకటిస్థితిచూచిన వారు యీనాడు మళ్ళీ చూచిన యెడల హంపీ శిథిలాలకు దీటుగావున్నదని చెప్పకపోరు. జిల్లామొత్తంలో యింతటి ప్రశస్తమైన హాస్పిటాలు భవనములు యింకొక చోటలేవు. జిల్లాలోని ప్రభుత్వహాస్పిటాలులన్నిటిలోకి జిల్లా కేంద్రం తరువాత యిచటి హాస్పిటాలును రెండవ శ్రేణి హాస్పిటాలుగా ప్రభుత్వం ధ్రువపరచినది. సంస్థానం హయాంలో యీ హాస్పిటాలు కట్టింపబడినది. దీనికి అనుబంధంగా ప్రసూతి హాస్పిటాలు వెనుకటి గద్వాల మహారాణీ ఆది లక్ష్మి దేవమ్మగారు తమకూతురు కీ.శే. శ్రీమతి రాణీవరలక్ష్మి దేవమ్మగారి (ప్రస్తుత గద్వాల పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీయుత కృష్ణరాం భూపాలుగారి తల్లిగారు) స్మారకార్థంగా నెలకొల్పబడినది. ఈ హాస్పిటాలులోచేరి ప్రసవించిన బాలెంతలు యిళ్ళకుపోవు నాడు సంస్థాన ప్రభుత్వం తమపు కుంకుమ చీర రవికలిచ్చి పంపెడి ఆచారముండెడిది. ఈ హాస్పిటాలుకు దాదాపు 50 వేల రూపాయల ప్రభుత్వ గ్రాంటున్నది. ఇచటి జనరల్ హాస్పిటాలుకు అనుబంధంగా దాదాపు పది పడ్డహైదు మంచాలకు సరిపడే సకల సౌకర్యములతోడి భవనమును ఆ రోజుల్లోనే శ్రీ కీ. శే. అయిజ పుల్లయ్యగారు కట్టించి యిచ్చినారు. సామాన్య రోగులకు అందుబాటులో యీ హాస్పిటాలు లేకున్నందున నగర గర్భంలో శేషమ్మ అనునామె డిస్పెన్సరీకి భవనము కట్టించి యిచ్చినది.

ఈ హాస్పిటాలులకు ఇద్దరు డాక్టర్లు (లేడీడాక్టరు-డాక్టరు) యిద్దరు కాంపౌండర్లు తదితర సిబ్బంది అనేకులున్నారు. యీ డాక్టర్ల నివాసభవనములునూ హాస్పిటాలుకు అనుకొనే కట్టించబడినవి.

ఇటీవల మంత్రి శ్రీ జె. వి. నర్సింగరావు గద్వాల అయిజ రోడ్డు ప్రారంభోత్సవమునకు గద్వాలకు వచ్చిన సందర్భంలో యీ హాస్పిటాలులను దర్శించినారు. భవనములను చూచి మెచ్చుకొని, లోపల రోగులే కానరాకపోయినందులకు ఆశ్చర్యం ప్రకటించి డాక్టర్లను అడిగినారు. వెంట వున్న గద్వాల మండల కాంగ్రెసు అధికారులు వున్న విషయాలు- జరుగుతున్న చరిత్రను అక్కడనే మంత్రిగారికి నివేదించినారు. డాక్టర్లూ, మిగతా స్థానిక అధికారులూ నగరమునకు దూరంగా వున్నందున రోగులు రావడంలేదన్నారు. కాని మంత్రి విశ్వసించినట్లు కానరాలేదు.

ఆసుపత్రి పరిస్థితులు అదటవున్న రోగులను విచారించగా వారు చెప్పిన వివరాలు హృదయవిదారకంగా వున్నవి. 8 మంచాలుండే హాలులో మూడు మంచాలమీద రోగులున్నారు. ఒక మందం ఖాళీగా (వట్టి మంచం) పడివున్నది. మిగతా నాలుగు మంచాలు లేనేలేవు. ఇంకొక నాల్గు మంచాల గదిలో మంచాలు లేకపోవడమేకాక, వెకాలెత్తు దుమ్ము, బూజుతో నిండివున్నది. ఇంకొక నాలుగు మంచాల గదిలో ఒక ఆడమనిషి కాళ్లమధ్యగా పండుకొని వున్నది. మంచం ప్రక్కనే రోగి బంధువులు వంట సామానూ, కట్టెలూ, చెదారము పెట్టుకొనివున్నారు. మంచాలుకూడా చాల అపరిశుభ్రముగా ఉన్నవి. రోగుల మంచాలవద్ద రోగ నిర్ణయపు చార్టులు అసలే లేవు. విచారించుటకు హాస్పిటాలుకు సంబంధించినవారు ఒక్కరూ కానరాలేదు.

రోగుల వద్ద ఉండిన పెన్సిలిన్, కాల్షియం శాంపూజు, ఇంజక్షనులూ, డిస్టిల్డు వాటరు బ్యాబులూ వినారించగా రోగులే స్వయముగా వాని నన్నిటినీ కొని తెచ్చుకున్నామని అన్నారు. ఇటీవల ఒక రోగి ఇంజక్షన్ నిమిత్తం ఇంజక్షన్ పిరంజి కూడ స్వయంగా కొని తెచ్చుకొని చికిత్స పొందినట్లు అక్కడి కొందరు వివరించినారు, ఈ హాస్పిటాలుకు క్షయ రోగముల మందులూ, ఇంజక్షనులుకూడ సర్కారు సప్లయివున్నది.

మా విలేఖరి అడిగిన ప్రశ్నలు—రోగుల సమాధానములు యథాతథముగా ఇలా ఉన్నవి:

ప్రశ్న: మీకు హాస్పిటాలువాళ్ళు యేమేమి సప్లయి చేస్తున్నారు?

జవాబు, ఏమీ చేయడం లేదు.

ప్రశ్న: మందులు ఇస్తున్నారా?

జవాబు: ఇంజక్షన్‌లు మమ్ములనే తెచ్చుకొమ్మన్నారు. తెచ్చి యిచ్చుకుంటున్నాము (ఇంజక్షనుల ట్యూబులూ, అంగళ్ళవారి బిల్లులు వగైరా చూపించారు).

ప్రశ్న: ఆహారము యిస్తున్నారా?

జవాబు: ఆహారం మేమే స్వయముగా చేసుకుంటున్నాము. డాక్టర్లు చెప్పిన పథ్యం మేమే తెప్పించుకుంటున్నాము.

ప్రశ్న: ఇది సర్కారు దవాఖానా అని తెలుసునా?

జవాబు: అందుకుగానే దరిద్రులమై ఇక్కడ చేరినాము.

ప్రశ్న: ఈ హాస్పిటాలులో రోగులకు ఉచిత చికిత్స జరుగాలనీ, యిది ప్రభుత్వ హాస్పిటాలైనందున ప్రభుత్వము దీనికి కొన్ని వేల రూపాయల గ్రాంటు యిస్తున్నదనీ తెలుసునా?

జవాబు: తెలీదు బాబూ ఆ వివరాలు. బీదలకు దయం చేస్తారని విన్నాము. వచ్చి చేరినాము. డాక్టర్లను అడిగితే, అన్నీ మీరే తెచ్చుకోవాలని అన్నారు.

ప్రశ్న: డాక్టర్లు రోజూ వచ్చి మిమ్ములను విచారిస్తున్నారా?

జవాబు: (ఒక విద్యార్థి రోగి బంధువు) చేర్చబడినది పోలీసుల ద్వారా. మావానిని చేర్చినవాడు చాలాసేపు వరకు చూచిన దిక్కే లేదు. శనివారం చేర్చినాము. ఆదివారాలలో యిచట దిక్కే వుండదు.

(ఇంకొక రోగి) యిక్కడి శాసనసభ్యులతో ఆ విద్యార్థి బంధువులు మొరపెట్టుకొన్నందున (24_11_59) డాక్టరుగారు వచ్చి రెండుసార్లు ఇంజక్షనులు యిచ్చి వెళ్ళినారు.

ప్రశ్న: రాత్రిళ్ళు యిక్కడ దీపముంటుందా? పరుపుల బట్టలు మార్చరా?

జవాబు: సామాన్యంగా నూనె లేని లాంట్రిన్‌లే వుంటవి. పరుపుల బట్టలు చూస్తే మీకే తెలుస్తుంది.

ప్రశ్న: ఇంకేమైనా విశేషాలు తెలుపరాదా?

జవాబు: బాబూ వాళ్ళ చేతుల్లో వున్నాము. ఏమని చెప్పమంటారు? మీరే ఆలోచించండి.

భద్రాద్రి రాముని ఆభరణాలు కరిగించరాదు

హైదరాబాద్, డిసెం 1

సేలకొండపల్లి గ్రామంనుండి పండిత శ్రీ చంద్రశేఖర శాస్త్రి, శ్రీ కంకిపాటి జగన్మోహనరావు, తదితరులు ఇలా వ్రాస్తున్నారు:

భద్రాద్రిరాముని ఆభరణములను కరిగించి క్రొత్తవి చేయించదురన్న వార్త చాలా బాధ కలిగించినది. పూర్వకాలములో సేలకొండపల్లి వాస్తవ్యుడగు కంచర్ల గోపన్నగారు రామచంద్ర చరణ భక్తిప్రవాహంలో మునిగి రామదాసు అను పేరు గాంచి, నిరంతర రామపాదసేవా దురంధరుడై సర్వాంతర్యామి యగు రామచంద్రునియొక్క ప్రేరణచేత తానీషా ప్రభు ద్రవ్యముతో రచించి పచ్చల పతకము మొదలగు ఆభరణములను సమర్పించిన తరువాత తానీషా ప్రభువునకు బాకీపడిన ద్రవ్యమును యివ్వలేక యిక్కట్లనుభవించి, మాతృరూపముగ దయచేసిన రామలక్ష్మణుల చేత ఋణవిముక్తికొంది పరమపదమునకేగిరన్న చరిత్ర మెల్లరకు విశదమే. ఈ వస్తువులు రామదాసుగారి భక్తిని స్మరింపజేయును. వీటి స్వరూపమును మార్చి మరొక రూపము నొందించుట యమూల్యమగు భక్తిభావమును భంగపరచును. కొలది రోజులక్రిందట పచ్చల పతకమునమ్ముటకై ప్రయత్నింపగా రామభక్తాగ్రేసరుండగు తక్కెళ్ళపాడు గ్రామ వాస్తవ్యుడైన గెంటేల నారాయణరావుగారు వచ్చి రామదాసుగారు రామకైంకర్యార్థము సమర్పించుకొన్న యీ పచ్చల పతకము విక్రయార్హముగాదు, యియ్యది గురు విక్రయతుల్యమని తలంచి దాని విలువ లక్ష రూప్యములనిచ్చి దానిని విడిపింపజేసిరి.

ప్రస్తుతం చింతాకు పతకము మొదలగు యాభరణములకు విలువ కట్టుట భక్తులకు బాధాకరము. భక్తులకీకృత్యము వ్యవహార దృష్టిగ తోచునుగాని, పరమార్థ దృష్టిగ తోచదు.

బూర్గంపాడు తహశీల్‌దారుగారు యే ఆధారములతో చింతాకు పతకము ఆనాటిది కాదని యన్నారో? ఆనాటి కాళ్ళ వస్తువున కీనాడు వెల కట్టి, యప్పటి వెల కానందున యీ వస్తువును కొంతకాలముక్రింద మార్చి యుందురని ఊహగానముజేసిరి. సాధారణముగ కాళ్ళ వస్తువుల విలువ చేయిమన పుడెక్కువగానే యుండును. అదే వస్తువును తిరిగి వెల కట్టిన, సగమునకు సగమైనను కాజాలదు. మీరుమిక్కిలి వందల సంవత్సరములకు పూర్వం చేయించిన యీ ఆభరణములకు ఆనాటి వెల కానవలయునన్న యెట్లు వచ్చును, ఏది యేమైనను భక్తులకు నిజ వస్తుస్వరూప సందర్శనమే మహా శ్రేయోదాయకము; భక్త్యభివర్ధకము. భక్తులందరు కోరినది నిజ వస్తుస్వరూప నాశకముగాక, నూత్న వస్తుసేకరణ. కాబట్టి, భద్రాచలము దేవస్థానమువారును, ప్రభుత్వమువారును పునరాలోచన చేయవలయునని మనవి. రామదాసు స్వగ్రామ నివాసులగు మా బాధను, భక్తాగ్రేసరుల బాధను గుర్తెఱిగి తుది నిర్ణయముజేసెదరని ఆశించుచున్నాము.

దేశవాళీ గోధుమకు కంపోస్టు ఎరువు

ప్రయోజనాత్మక మేమికాదని శ్రీ దేశ్‌ముఖ్

న్యూఢిల్లీ, డిసెం 1

దేశవాళీ గోధుమ పైర్లకు సహాయానికి ఎరువులు వేయడంకంటే కంపోస్టు ఎరువువేస్తే ఎక్కువగా పంట పండుతుందని చెప్పడానికి ప్రయోగాత్మకంగా ఆధారం ఏమీలేదని వ్యవసాయ మంత్రి డాక్టర్ పి. ఎస్. దేశముఖ్ లోకసభలో చెప్పారు. పట్టణ ప్రాంతాలలోను, పెద్ద పెద్ద పంచాయతీలలోను కూడా మల మూత్రాదులతో కంపోస్టు ఎరువు తయారు చేయించడానికి కృషి జరుగుతోందనీ, పట్టణ ప్రాంతాలలో మల మూత్రాదులు నగరంలోని చెత్తదారం కలిపి కంపోస్టు ఎరువును తయారు చేయించే పథకం 1944 నుంచి అమలులో ఉందనీ, ఇంతవరకు సుమారు 2,250 కేంద్రాలలో కంపోస్టు ఎరువు ఉత్పత్తి ప్రారంభం అయిందనీ, శ్రీ పంగార్కర్ ప్రశ్నకు లిఖితంగా జవాబిస్తూ మంత్రి చెల్లడించారు.

పెద్ద తరహా పంచాయతీలలో మలమూత్రాదులను ఉపయోగించి కంపోస్టు ఎరువును ఉత్పత్తి చేసే పథకం 1957-58 లో ప్రారంభించబడిందనీ, 665 పంచాయతీలలో ఈ పని సాగుతోందనీ, చెప్పారు.

కుంటి, గ్రుడ్డివారి సహాయానికి పథకం

లండన్, డిసెం 1

బ్రిటన్ ఎలెక్ట్రికల్ ఇంజినీర్ల సంస్థలోని ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్సు విభాగం లండన్‌లో వచ్చే సంవత్సరం జులై 21 నుంచి 27 వరకు "మెడికల్ ఎలెక్ట్రానిక్స్" మీద తృతీయ అంతర్జాతీయ మహాసభను ఏర్పాటు చేస్తున్నది. అంతరిక్ష పరిశోధనకు పూర్తిగా చెలిపివారి సహాయోపకరణాలకోసం కృత్రిమ అంగాల "ఆటోమేటిక్ కంట్రోలు"కు మెడికల్ ఎలెక్ట్రానిక్స్‌ను వర్తింపజేయటం మొదలైన విషయాలమీద యీ మహాసభలో చర్చ జరుగుతుంది.

రఘుపతిపేట దంగాడు నియ్యం సంఘ పరిస్థితి

రఘుపతిపేట, డిసెం 1

రఘుపతిపేట గ్రామము కల్వకుర్తి తాలూకాలో చేరినది. గృహ సంఖ్య 8 వందలు, జనాభా రెండు వేలు కలదు. ఇచ్చట రెండు సంవత్సరముల నుండి కృషి చేయుచున్న దంపుడు బియ్యం సంఘ స్థితి రోజురోజుకు దిగజారిపోవుచున్నది. దీనికి కారణము సంఘముయొక్క జరిందిన వ్యవహారాలలో అధ్యక్షులు అధికముగా జోక్యము కలిగించుకొని తనకు అనుకూల వాతావరణము సిద్ధపరచుకొనుచున్నారని తెలుస్తున్నది. సంఘ కార్యదర్శి లోగడ ఆయన ఉన్నప్పుడే విషయం ప్రస్తావించగా కార్యదర్శినుండి రాజీనామాను కోరారని కూడా తెలుస్తున్నది.

కుటుంబ నియంత్రణ కృషి

ఫోర్డ్ ఫౌండేషను గ్రాంటు

న్యూఢిల్లీ, డిసెం 1

భారత ప్రభుత్వం ప్రారంభించిన కుటుంబ నియంత్రణ కార్యక్రమంలో శాస్త్రపరిశోధనలు సాగించేందుకుగాను దాదాపు అయిదు సంవత్సరాల కాలానికి ఫోర్డు ఫౌండేషను సంస్థ 3,30,000 డాలర్ల సహాయాన్ని మంజూరు చేసింది.

నాయి బ్రాహ్మణ సంఘ సమావేశం

దుబ్బాక, డిసెం 1

శ్రీరాం రాజయ్య దుబ్బాక సమితిలో నాయి బ్రాహ్మణసంఘ సారంభోత్సవము నవంబరు ఆఖరు వారంలో జరిపారు. శ్రీ శంకరరావు (బి.డి.ఒ) పతాకవందనోత్సవముచేసిరి. శ్రీజనకీరాములు (ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ సంఘాధ్యక్షులు) అధ్యక్షత సమావేశముజరిగినది. ఆంధ్రప్రదేశ్ సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ రామయ్య, వీరానంద్, కృష్ణయ్య, చంద్రయ్య సిద్దిపేట తాలూకా కార్యదర్శులు ఉపన్యసించారు.

అధ్యక్షులు శ్రీ నర్సయ్య, ఉపాధ్యక్షులు శ్రీ రాజయ్య, కార్యదర్శి శ్రీ ఆర్. విఠల్, సహాయ కార్యదర్శి శ్రీ నర్సయ్య, కోశాధికారి శ్రీ మల్లయ్య, సమితియొక్క ప్రతి గ్రామమునుండి ఒక సభ్యుడు చొప్పున కార్యవర్గము యెన్నుకోబడినది.

వాషింగ్టన్ జాతీయ సాంస్కృతిక కేంద్రం

వాషింగ్టన్, డిసెం 1

న్యూఢిల్లీలో అమెరికా రాయబార కార్యాలయ భవనం సమీపాన సుమారు పాతికెకరాల విస్తీర్ణంలో అమెరికన్ వాస్తు శిల్ప ఎడ్వర్డ్ స్టోన్ వాషింగ్‌టన్ జాతీయ సాంస్కృతిక కేంద్రానికి కూడా సమీపాన రూపొందించి అది 2,500 సంవత్సరాల సంస్కృతిని ప్రతిబింబిస్తుందనున్నాడు.

వాషింగ్టన్ సాంస్కృతిక కేంద్రం వర్తులాకారంలో వాషింగ్టన్ సాంప్రదాయక వాస్తు కళకు అనుగుణంగా ఉంటుందట. దీనిని పొటామాక్ నదీతీరాన 10 ఎకరాల పార్కులో నిర్మిస్తున్నారు. ఈ స్థలాన్ని అమెరికా ప్రభుత్వం ప్రదానం చేసింది. దీని నిర్మాణానికి అయ్యే 610లక్షల డాలర్ల ధనం స్వచ్ఛంద విరాళాలద్వారా సేకరిస్తున్నారు. ఈ కేంద్రంలో మధ్యన ఒక పెద్ద రిసెప్షన్ హాలు ఉంటుంది. అంతస్తులేని భవనం ఇది. దీనిలో ఒక ఒపేరా మందిరం, ఒక థియేటర్ ఒక సంగీత సమ్మేళన మందిరం, ఒక సభామందిరం 10,000 మందికి వీలుగా ఉంటుంది. కొన్ని వేల కార్లు నిలుపుకోటానికి భూగర్భములో ఏర్పాటు చేస్తారు.

అస్సాంలో బ్రహ్మపుత్రానదిపై వంతెన

ప్రధానితో జనవరి 9 న శంకుస్థాపన

న్యూఢిల్లీ, డిసెం 1

అస్సాంలో 10 కోట్ల ఖర్చుతో నిర్మించదలచిన బ్రహ్మపుత్రనదిపై రోడ్డు బ్రిడ్జి ప్రాజెక్టుకు ప్రధానమంత్రి శ్రీ జవహర్‌లాల్ నెహ్రూ వచ్చే ఏడు జనవరి 9 న తేదీన శంకుస్థాపన చేస్తారని తెలుస్తున్నది.

ప్రాజెక్టు 1962 లో పూర్తికాగలదని అనుకుంటున్నారు.

ఇటీవల నిర్మించిన పెద్దరకం బ్రిడ్జి ప్రాజెక్టులలో ఇది ఒకటి. బ్రహ్మపుత్ర బ్రిడ్జిని పూర్తిగా భారతీయ ఇంజనీర్లే నిర్మిస్తారు. చీఫ్ ఇంజినీరు శ్రీ టి. పి. గయరీ నిర్మాణ కార్యకలాపాలకు సహాయకత్వం వహిస్తున్నారు. అసలు నిర్మాణం 1958 అక్టోబరులోనే ప్రారంభం అయింది. సిబ్బందికి వసతులు, మర్కాపాళ్ళు, ఇతర భవనాల నిర్మాణం యింకమీదట పూర్తికావచ్చింది. బ్రిడ్జిస్తంభాల నిర్మాణ కార్యక్రమంకూడా ప్రారంభమైంది.

కర్నూలులో ఒలింపియా ఫుట్‌బాల్ టోర్నమెంటు

కర్నూలు, డిసెం 1

కర్నూలు పట్టణంలో ఒలింపియా ఫుట్‌బాల్ టోర్నమెంటు (ఆలిండియా) డిసెంబరు 20 తేదీనుండి ప్రారంభమగునని కార్యదర్శి శ్రీ నవాబ్ పన్నీఖాన్ తెల్పుతున్నారు. గత రెండు సంవత్సరాలనుండి ఈ పట్టణంలో జరుపుకున్న ఈ పోటీలలో భారతదేశములోని అన్ని టీములు పాల్గొనవచ్చును. పోటీలలో పాల్గొనువారు క్రింది చిరునామాకు తెల్పాలి. కార్యదర్శి; ఒలింపియా ఫుట్‌బాల్ టోర్నమెంటు; కర్నూలు. (ఆంధ్రప్రదేశ్).

మహబూబనగర్ జిల్లా ఉపాధ్యాయ సహకార సంఘం

మహబూబ్‌నగర్, డిసెం 1

మహబూబ్‌నగర్ జిల్లా ఉపాధ్యాయ సహకార సంఘం సభ్యులు ఐదుగురు ఇలా వ్రాస్తున్నారు:

మహబూబనగర జిల్లా ఉపాధ్యాయ సహకార సంఘమునకు సంబంధించిన వార్త ఆ సంఘమునకు చెడ్డపేరు తెచ్చుటకు ఉద్దేశించి విఫల ప్రయత్నము చేయుటకు పంపినట్లుగా భావిస్తున్నాము. కార్య నిర్వాహక సభ్యులు సర్వసభ్య సమావేశమునందు ఓటింగ్ ద్వారా ఎన్నుకొనబడుదురే కాని కార్యదర్శియే నియమించుకొనుటకు యీ సంఘమున అధికారము లేదు. ప్రస్తుతము కార్యదర్శి ఈ పదవిపై వచ్చినప్పటినుండి కష్టపడి సంఘాభివృద్ధికి పాటుబడుచున్నారు. మొత్తము సహకార సంఘములలోకెల్ల యీ సంఘం ఉత్తమ స్థాయిలో నడుచుచున్నది.

ఈ సంఘమునందలి ఒక సభ్యుడు తమ బంధువుద్వారా ఆ వార్త పంపినట్లు భావిస్తున్నాము. కొందరు సభ్యులు వ్యక్తిగత మనస్పర్థలచే ఆపన్నపు వార్తలను మరింపజేసి అపకీర్తిపాలుచేయ విఫల ప్రయత్నము చేయుచున్నందుకు ఎంతో విచారము కల్గుచున్నది.

---

* బాతాఖానీ *

"నిర్మొహమాటంగా మీ అభిప్రాయం చెప్పండి, ఏ ర్యాటే రు" అని ఏ రచయితగారు అడిగాడో మనం ఇబ్బందిలో పడ్డామన్నమాటే. నిర్మొహమాటమన్న పదానికి రకరకాలు నిఘంటువులో (ఈ వ్యాకరణ వ్యతిరిక్త వ్యావహారిక పదం చేరుకున్నట్లయితే) కనిపించే అర్థానికీ, వైదిక సాహిత్య రంగంలో కనిపించే అర్థానికీ ఎంతో తేడా ఉంటుంది.

"నిర్మొహమాటంగా నా అభిప్రాయాలు తీసుకున్నవాళ్లు ఇప్పటి వరకూ నన్ను మాస్తే మొహం మాడ్చుకుంటూనే ఉంటారు, లేకపోతే లేని నవ్వు తెచ్చుకొని పెదిమలమీద నుంచైనా పలకరిస్తారు" అని ఓకానొక వాజమ్మ ప్రారంభించాడు. నిర్మొహమాటమంటే రచయితల పరిభాషలో "ఏదో కాస్త అనుకూలముగా ప్రశంసాపూర్వకంగా" అని అర్థమట. పొరబాటున నిర్మొహమాటానికి నిజమైన అర్థంలో నువ్వు అభిప్రాయము ఇచ్చావో ఆ రచయిత యిహ నీకు జన్మజన్మాలా స్నేహితుడు కాలేడనుకో. ఇది సాహిత్య స్నేహ సూత్రంలా హితుడా అంటూ వాజమ్మ సిద్ధాంతం చెప్పాడు.

రాజకీయ రంగం ఎంతెంత సంక్షుభితమైపోతున్నదో సాహిత్యరంగము కూడా అంతేనట. (ఎందుకంటే- ఈమధ్య ప్రధాని నెహ్రూ ఒక ఉపన్యాసంలో దేశం అన్ని రంగాలలోనూ అభివృద్ధి చెందాలిగాని, ఒక్క ఆర్థిక రంగంలో అభివృద్ధి చెంది సాహిత్యరంగంలో దిగవాసిల్లడము ఏమంత మంచి సూచన కాదని అన్నారు. ఇలా ప్రధాన మంత్రి ముందెన్నడో అనబోతారని త్రికాలజ్ఞులైన రచయితలకు తెలిసే ఉంటుందనీ, అందుకే రాజకీయాల వలెనే సాహిత్యాన్నిగూడా అభివృద్ధికి తేవడానికి రచయితలు పూనుకున్నారనీ మా వాజమ్మ అంటాడు. వైగా వర్గాలకు, విభేదాలకు, విద్వేషాలకు "అభివృద్ధి"అనేది సంకేత నామంగా వ్యవహరించబడుతున్నదని వాజమ్మ సూక్ష్మీకరించాడు)

సాధ్యమైనంత ఎక్కువమందినుండి ప్రశంసల్ని పొందాలన్న ఏకాశయంతోనే యీనాడు రచయితలు కృషి చేస్తున్నారూ అంటాడు వాజమ్మ. (మరి మన ప్రధాని ప్రజలకోసం రచనలు చేయుచున్నారట కదా!) ఎంతమంది ఎక్కువ ప్రశంసిస్తే అంతమంది కున్నారు. రచయితలు తెప్పుకొస్తున్నారనడం దేశాన్ని ప్రమాదకర పరిస్థితికి నెట్టుతుంది. ఇతరుల ప్రశంసలను చూచి గొప్పపడం ద్వారా ఆత్మసంతృప్తిని పొందడమే ఆ ప్రయోజన వాదపు పరాకాష్ఠ అన్నట్లు వాజమ్మ చెబుతుంటాడు.

వాజమ్మను ఎవడో అడిగాడట! అయ్యా ప్రశంసించేవారు దొరకనప్పుడు ఏం చెయ్యాలి? అని సాధారణంగా కొన్ని వర్గాలలో ఎవరైనా చనిపోతే ఆ చనిపోయిన వ్యక్తిపట్ల ఎంతో మంచి అభిమానంవుందని అందరూ తెలుసుకోడంకోసమని ఏడ్చేవాళ్ళనుకూడా అద్దెకు తీసుకువస్తారు. అలాగే ప్రశంసలు కురిపించేవాళ్ళను అద్దెకు తెచ్చుకో అని వాజమ్మ ఉపదేశించేసరికి ఆ రచయిత కాస్త మొహం మాడ్చుకున్నాడటకూడా.

అదికాదు కానీండి, ప్రశంసల వర్గం అంటూ ఒకటి తయారైతే మన సాహిత్యానికి ఎంతో బలం ఏర్పడుతుందన్నమాట నిజం. విమర్శ అన్న పదానికి "రంధ్రాన్వేషణ" అనే అర్థం రూఢిమైపోతున్నందున ప్రశంసల వర్గం ఒకటి కావాలి అని రచయితలంతా కలిసి ఒక తీర్మానం చేస్తే బాగుంటుందని ఒకచోట వాజమ్మ ప్రసంగము చేసే సరికి సమావేశకర్తలంతా సమావేశమై వాజమ్మను ఇక ప్రసంగాలకు పిలవరాదనికూడా తీర్మానం చేశారట. బాగుపడేసూచనలు చేస్తే ఒప్పుకొనే వాళ్లెవరూ లేరేమిటండీ అని వాజమ్మ తలలోతానే విస్తుపోయాడు. ఈవాడం ప్రబలిన వాతావరణాన్ని గమనించినవారై విమర్శకులు కూడా జాగ్రత్తపడుతున్నారట.

ఆస్థాన కవులంటూ కొందరుంటారు తెలుసుగా. అలాగే ఒకొక్కకవి వర్గానికి (లేదా రచయితృవర్గానికి) ఒక్కక్క ఆస్థాన విమర్శకుడు తయారుకావడం ఆ ఆస్థాన విమర్శకుడు "నిర్మొహమాటంగా" (అంటే ప్రశంసాపూర్వకంగా) విమర్శిస్తూ ఆ రచయితలకు సాహిత్యపట్టం కట్టడం అలవాటు చేసుకుంటున్నారని ఇది సాహిత్యరంగంలో ఏర్పడుతున్న వైపరీత్యమనీ వాజమ్మ అంటుంటాడు.

అసలు నవ్యాంధ్రసాహిత్యంలో మరో పరిణామమేమిటంటే రచయితల కన్న విమర్శకుల సంఖ్య పెరిగిపోతుండడం. (ఎందుకంటే ప్రతివిమర్శకూడా కూడా రచయితకన్న ఘనుడు అనే ఒక గౌరవాన్ని ఆపాదించుకోడం లోనే యీపరిణామం జరుపుతున్నదట) ఒక్క రచయిత ఉంటే అతని భజనపరులంతా విమర్శకులూ లేదా రచయితలు అవుతుంటారు. సినిమాల్లో దర్శకులసంఖ్య ఎక్కువవుతూ నటీనటుల సంఖ్య వామనముగా ఉంటున్నట్లే సాహిత్యరంగంలో విమర్శకుల (అనగా ప్రశంసాపరులు) సంఖ్య దినదినాభివృద్ధి కాంచి రచయితలసంఖ్య వామనమై పోతున్నది. ఈ మాట అంటూ వాజమ్మ తనకుతానే ఒక సవరణ తీర్మానాన్ని ప్రతిపాదించుస్థితుల్లోకి నెట్టవచ్చు కనుక రచయితలు మాత్రం తక్కువకావడం లేదనేది జేశకక్షణ సుదృఢంగా ఉన్నంతకాలం నిజమైన అంశం అని తేల్చుతున్నదన్నాడు. రచయితలుతక్కువవుతున్నదీ నిజమేనట, అలాగే రచయితలు అసంఖ్యాకులవుతున్నదీ నిజమేనట. అయితే ఈరెండు విరుద్ధసూత్రాలకు సహజీవన సమన్వయ విధానం ఒకటి వాజమ్మకు గోచరించిందటకూడ. రచయితలకువిమర్శకులకుమధ్య తేడాయే లేదుఅన్నఅంశాన్ని గట్టిగా ప్రస్తుత పరిణామాన్నిబట్టి ప్రచారానికి తేవడం అవసరం అని వాజమ్మ తేల్చాడు. రచయిత కాదలచిన క్షణంలో రచయితగా ఇతరుల రచనల విషయంలో విమర్శకుడుగా మెలగగల సవ్యసాచులు తెలుగు సాహిత్యరంగంలో అభివృద్ధి చెందుతున్నట్లు వాజమ్మ కనిపెట్టాడట.

అయితే ఇంత కలగాపులగపు సాహిత్యం తయారవుతున్నప్పటికీ "యాచకోయాచక శ్శత్రుః" అన్న సిద్ధాంతాన్ని ఆధారంచేసుకొని వర్గభేదాలు, విద్వేషాలూ తప్పనిసరి అవుతున్నాయనీ కీర్తికోసం దుష్పెత్తిపోసుకొనే తత్వంతో సాహిత్యం "విభూతి ప్రాయ"మై పోతున్నదనీ వాజమ్మ తనలో తాను ఒకసారి ఉపన్యసించుకున్నాడు.

మనలోమాట సుమా ఇది. వాజమ్మ వినారాదు, చూడారాదు. వాజమ్మకు కూడా అందరికీ ఉన్నంత కీర్తికాంక్ష లేదంటారా? (లేదని మనం నమ్మరాదు. అలానమ్మితే వాజమ్మకు ఒక విశిష్ట స్థానం [illegible] అధికుడు [illegible] వాజమ్మ కలవరిస్తూ [illegible] వినాను. సాక్షిసంపుటాలు- జంధ్యాల శాస్త్రి ఉపన్యాసాలూ అంటూ ఏవేవో మాటలు అస్పష్టంగానూ స్పష్టంగానూ అనడం ప్రారంభించాడు. దాన్నిబట్టి తానొక జంధ్యాలశాస్త్రి కావాలని వాజమ్మ అనుకుంటున్నాడని మనం తీర్మానించుకుందాం, ఏమంటారు?

ఢిల్లీలో ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనం

ఆంధ్రప్రదేశ్‌నుండి 1000 మంది రైతులకు సందర్శన అవకాశం

న్యూఢిల్లీ, డిసెం 1

న్యూఢిల్లీలో డిసెంబరు 15 నుంచి 1960 ఫిబ్రవరి 14 తేదీ వరకూ నిర్వహించబడే ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనం, సమాజ వికాస కార్యక్రమ ప్రాంతాలలోని అభ్యుదయ రైతులూ, కార్యకర్తలు సుమారు 20,000 మంది హాజరు కాగలరు.

వ్యవసాయ ప్రదర్శనాలను రైతులు చూడడానికి ఏర్పాట్లు చేయాలని భారత ప్రధానమంత్రి, క్రింది కేంద్ర ఇండియా 1958 ప్రదర్శనాన్ని చూచినప్పుడు ఒక సూచన చేశారు. కేంద్ర సమాజవికాస సహకార మంత్రిత్వశాఖ వారు రైల్వే బోర్డుతోనూ, ప్రపంచ వ్యవసాయ ప్రదర్శన నిర్వాహకులతోనూ సంప్రతించి ఒక్కొక్క రాష్ట్రంనుంచి ఎంతమంది రైతులు ఏ ఏ తేదీలలో ఆ ప్రదర్శనను ప్రదర్శించవలసిందీ రాష్ట్రాలకు సూచించారు.

వివరాలు ఇవి:- ఢిల్లీ 50, హిమాచల ప్రదేశ్ 150, జమ్ము-కాశ్మీరు 400, పంజాబు 800, మధ్యప్రదేశ్ 1600, బొంబాయి 2400, రాజస్థాన్ 1600, ఉత్తరప్రదేశ్ 3200, బీహారు 2400, ఒరిస్సా 800, అస్సాం 600, ఈశాన్య సరిహద్దు ప్రాంతం 50, త్రిపురా 50, మణిపూర్ 50, పశ్చిమబెంగాలు 800, మద్రాసు, పుదుచ్చేరి 1600, ఆంధ్రప్రదేశ్ 1600, మైసూరు 1000, కేరళ 600.

రైతులు 600 నుంచి 1000 మంది కలిసి జట్టుగా యీ సంతేను సందర్శిస్తారు. వారితోపాటు గ్రామస్థాయి కార్యకర్తలూ, ప్లాను ఉద్యోగులూ, వ్యవసాయ విస్తరణ ఉద్యోగులూ కూడా వస్తారు.



పై ఫోటోలో చెట్టూరు అనకట్టకు జల్వాయరు నిర్మాణానికి [illegible] నిర్మించబడింది. ఈ అనకట్ట కాలేరు నదిపై మచర్లపల్లి వద్ద నిర్మితమై సుమారు 200 మైళ్ళదూరంలో నిర్మించబడింది. ప్రపంచంలోని పెద్ద రాతి అనకట్టలలో ఇది ఒకటి. దీని నిడివి 5,300 అడుగులు, యెత్తు 176 అడుగులు. జలాశయంలో దాదాపు 100,000 మిలియన్ల ఘనపుటడుగుల నీరు నిల్వ ఉంటుంది. చెట్టూరు జలవిద్యుత్కేంద్రం సామర్థ్యం 40,000 కిలోవాట్లు, కనీసం 17,000 కి.వా. ఉత్పత్తి చేస్తుంది. ఈప్రాజెక్టు రూ. 1.93 కోట్ల వ్యయంతో నిర్మించబడింది.

దేశార్థిక చరిత్రలో 1959 ప్రాధాన్యం

ఉక్కు కర్మాగారాలకృషి విశేషాలు వివరిస్తూ సర్దార్ స్వర్ణసింగ్

న్యూఢిల్లీ, డిసెం 1

1959 లో ప్రభుత్వ రంగంలోని ఉక్కు కర్మాగారాలలో అనేక భాగాలు ఉత్పత్తి ప్రారంభించడంతో 1959 వ సంవత్సరం దేశ ఆర్థికాభివృద్ధి చరిత్రలో ప్రధానఘట్టంగా గణుతికెక్కగలదని ఉక్కు గనులు, ఇంధనం మంత్రి సర్దార్ స్వర్ణసింగ్ తన మంత్రిత్వశాఖ తాలూకు పార్లమెంటు ఇష్టాగోష్ఠి సంప్రతింపుల సంఘం సమావేశంలో పేర్కొన్నారు.

ఈ సంవత్సరంలో భిలాయ్‌లో ఒకటి, రూర్కెలాలో ఒకటి మొత్తం రెండు యంత్రపు కొలుములు పని ప్రారంభించాయనీ, దుర్గ్ ఇనుమును తగినంత ప్రమాణంలో అవి అప్పుడే ఉత్పత్తి చేస్తున్నాయనీ చెప్పారు.

"దుర్గాపూర్‌లోని మొదటి యంత్రపు కొలిమి ఈ సంవత్సరం డిసెంబరులో పనిప్రారంభిస్తుంది. రూర్కెలా ఉక్కు కర్మాగారంలోని మొదటి రెండు "బయలు కొలుములు" పని ప్రారంభించాయి. అవి అప్పుడే ఉక్కును ఉత్పత్తి చేస్తున్నాయి. మరో రెండు "బయలు కొలుములు" ఎల్. డి. కన్వర్టర్లతోపాటు ఈ సంవత్సరాంతంలో పని ప్రారంభిస్తాయి. బ్లూమింగు మిల్లులు, స్లాచింగు మిల్లులు కూడా ఈ సంవత్సరం డిసెంబరు మధ్యనాటికి పని ప్రారంభించగలవని అనుకుంటున్నాము. భిలాయ్ లో మొదటి "బయలు కొలిమి" క్రిందటి నెలలోను, బ్లూమింగు మిల్లు ఈనెల మధ్యలోను పని ప్రారంభించాయి. ఈ సంవత్సరాంతంలోగా మరో రెండు "బయలు కొలుములు" ఒక కన్టిన్యువస్ బిలెటు మిల్లు" పని ప్రారంభించగలవు. 1960 జూన్ నాటికి ప్రభుత్వ రంగంలోని మూడు ఉక్కు కర్మాగారాలలోను, సిద్ధంగా వాడుకొడానికి అనువైన ఉక్కు ఉత్పత్తి ప్రారంభం అవుతుంది. ఈ విధంగా భారత జాతియొక్క ఆశయాలు సఫలం అవుతాయి.

తాతా ఇండియన్ ఐరన్ కంపెనీల విస్తరణ కార్యక్రమాలు కూడా పూర్తి అయినాయి. రెండో ప్రణాళిక పూర్తిఅయేలోగానే ఈ కంపెనీలు తమ ఉత్పత్తి లక్ష్యాలను సాధించగల్గుతాయి.

రూర్కెలాలో దుర్గ్ ఇనుము అనుకున్న దానికంటే తక్కువగా ఉత్పత్తి అవుతోందనీ, చిక్కులేమైనా వుంటే వాటిని త్వరలో చక్కదిద్ది యంత్రపు కొలిమిద్వారా నిర్ణీతమైన ఉత్పత్తి జరిగేటట్టు చూడగలరని ఆశిస్తున్నామనీ, కొందరు సభ్యులు అన్నారు.

రూర్కెలావద్ద ఆక్సిజన్ కర్మాగారాన్ని నెలకొల్పడం సంగతి ప్రస్తావిస్తూ ఈ కర్మాగారంలోని మొదటి భాగం ఈ సంవత్సరం డిసెంబరులో పూర్తికాగలదని అనుకుంటున్నామనీ, రెండవభాగం 1960 మార్చిలోను మూడవభాగం 1960లోమేనూ పూర్తి కాగలవనీ మంత్రి చెప్పారు. ఆస్లజని కర్మాగారం తాలూకు మొదటి విభాగంలోని "ఏర్‌కంప్రెసర్", "ఏర్ సెపరేషన్ యూనిట్ల"ను యీనెల 10 వ తేదీన పరీక్షచేయడం ప్రారంభించారనీ, కర్మాగారంలోని మొదటి విభాగం ఈ సంవత్సరాంతంలోగా పనిచేయడం ప్రారంభించగలదని అనుకుంటున్నామనీ మంత్రి వెల్లడించారు.

రూర్కెలా ఉక్కు యంత్రాగారానికి ఆస్లజని అవసరం అనీ, అందువల్లనే ఈ ఆస్లజని కర్మాగారాన్ని స్థాపించడం అవసరంఅయిందనీ రూర్కెలా ఉక్కు యంత్రాగారం ఎల్. డి. పద్ధతిని 75,000 టన్నుల ఉక్కును ఉత్పత్తిచేయగలదనీ ఎల్.డి పద్ధతిలో కరగిన లోహంలోకి ఆస్లజని వాయువును ఎక్కించవలసి ఉంటుందనీ చెప్పారు. మెస్సర్స్ బ్రిటిష్ ఆక్సిజన్ లిండె అనే ఆంగ్లో జర్మన్ కంపెనీ ఒకటి ఆస్లజని కర్మాగారాన్ని నిర్మిస్తోంది.

భారతీయ భూగర్భ శాఖవారు భారతీయ గనుల సంస్థవారు ఇనుము మున్నగు లోహాలకోసం సాగిస్తున్న అన్వేషణ ఎంతవరకు వచ్చిందీ గనులు, చమురు మంత్రి శ్రీ కె. డి. మాలవీయ సభ్యులకు వివరించారు.

పర్గితాలూకా ప్రజల కష్టనిష్ఠురాలు

అయినాపురం, డిసెం 1

పర్గి తాలూకా జెందిన అయినాపురం గ్రామస్థులు పలువురు ఈక్రింది విధంగా వ్రాస్తున్నారు:

"హైద్రాబాదు జిల్లాలోని పర్గి తాలూకాను ప్రజల పరిస్థితిచాల శోచనీయంగా ఉంది.

ఆంధ్రప్రదేశ్ లోనిఅన్ని తాలూకాల్లో పర్గి చాలా వెనుకబడిఉన్నదంటే అతిశయోక్తికాదు.

పర్గి తాలూకా కేంద్రముగా ఉండదగిన ప్రదేశముకాదు. పర్గినుండి ఉత్తరానికి కేవలం రెండు మైళ్ళు దక్షిణమునకు 26 మైళ్ళవరకు గ్రామములున్నాయి. దక్షిణ గ్రామములనుండి తాలూకాకు నేరుగా ఏలాంటి రోడ్డు రవాణా సౌకర్యములు లేవు. ప్రభుత్వ కార్యాలయములకు సంబంధించిన వ్యవహారములుగలవారుతప్ప మిగితాప్రజలు పర్గిని సరిగా గుర్తింపరు. ఉత్తరమున సరిహద్దును ఆనుకొని తూర్పు పడమర పర్గి- కోడంగల్లు మార్గము దక్షిణ సరిహద్దు నానుకొని మహబూబ్‌నగర్ కోస్గి రోడుమార్గమూ వున్నాయి. ఈరెండు దిక్కుల మధ్యన నున్నవారికి ఏదిక్కు మార్గములేదు.

వెనుకబడిన ప్రాంతములతో అభివృద్ధి బ్లాకులు కేంద్రములను సృష్టించి కొన్ని సౌకర్యాలు ఏర్పరస్తున్నారు. అయితే యీకార్యక్రమాలకు కూడా పర్గి తాలూకా నోచుకొనలేదు.

ఈలాంటి అభివృద్ధి కార్యక్రమ విషయాలు తాలూకా ప్రజలలో చాలా మందికి తెలియవు. ఇక్కడికి ప్రభుత్వ ప్రతినిధులు రారు. ప్రజలకు పనికివచ్చు నాయకులులేరు.

ఈ తాలూకాలో రాజకీయపార్టీలు కూడా ఎక్కువగా లేవు, ఉన్నది కేవలం కాంగ్రెసు మాత్రమే, ఇందులో పొందులేదు.

నవంబరు 5వతేదీన పర్గిలో మార్కెటింగు సొసైటీ కార్యనిర్వాహకవర్గం ఎన్నికలు జరిగాయి.

అయితే ఇంతకుపూర్వం రు. 92000 మూలధనముతో స్థాపించబడిన తాలూకా ఎగ్రికల్చరల్ కోఆపరేటివ్ అసోసియేషన్ అధోగతికి కారకులైనవారే యీ మార్కెటింగ్ సొసైటీ కార్యవర్గంలోకూడా చేరగలిగారు. ప్రజాపనాల్ని గమనించి పనిచేసేవారుకాక తదితరులు ఇలాంటి సంఘాల్లో చేరడం ఆ పార్టీ ప్రతిష్ఠకే కళంకంగా ఉండడం అటుంచి ప్రజలకుకూడా నష్టకారి అవుతుంది. ఈ విషయంలో స్థానిక సంఘాల్లోని కాంగ్రెసువాదుల కృషివిధానాలపట్ల ప్రదేశ్ కాంగ్రెసు నాయకులు తగుశ్రద్ధ వహించి పర్గి ప్రజలకు మేలుచేకూర్చాలని కోరుతున్నాము."

భూగర్భంలో జలాశయాలు

ఆల్మాఆటా, డిసెం 1

ఎండలధికమైన కజకస్థాన్ ప్రాంతాల్లో జలాశయాలను భూగర్భంలో నిర్మించడానికి భూగర్భ జలశాస్త్రజ్ఞులు ఒక కొత్తపద్ధతిని రూపొందించారు.

ఈజలాశయాలు భూమిలో పైనాక్రిందా ఒండుమట్టి పొరలు ఉండే ఇసుక ప్రాంతంలో యేర్పాటు చేయబడుతాయి.

వర్షాలవల్ల లభించే నీరు ప్రత్యేకంగా త్రవ్వబడిన గుంటలలో భద్రపర్చబడుతుంది. ఆ గుంటలలోనే ఇంకా లోతుగా రంధ్రాలు యిసుక పొరవరకూ వేయబడుతాయి. గుంటలోని నీరు యీ రంధ్రాలగుండా యిసుక పొరలోకి ప్రవేశిస్తుంది. అవసరమైనప్పుడు యీనీరు మళ్ళీ పైకి పంపులద్వారా తోడుకోవచ్చును.

ఇటువంటి జలాశయం ఒకటి మిచురిన్స్క్ ప్రభుత్వ వ్యవసాయక్షేత్రంఉన్నచోట నిర్మింపబడింది. ఈవిధంగా 20 మీటర్ల లోతున 1,000 ఘనపు మీటర్ల మంచి నీరు నిలువ చేయబడుతున్నది.

భారతదేశంలో చమురుకోసం అన్వేషణ

విదేశీ నిపుణులకు ఆహ్వానం: మాలవ్యాప్రకటన

న్యూఢిల్లీ, డిసెం 1

భారతదేశంలోచమురుకోసం అన్వేషణ జరిపేందుకు విదేశీ నిపుణులను ఆహ్వానించాలని భారతప్రభుత్వం నిర్ణయించిందనీ, షరతులు ఉభయపక్షాలకూ ఆమోదయోగ్యంగా వుండేటట్లు చూడడమవుతుందనీ,ఇందుకోసం జరిపే ఏర్పాట్లు భారతపారిశ్రామిక విధానం పరిమితులకు లోబడి వుంటాయనీ కేంద్ర గనులూ, చమురుశాఖామంత్రి, శ్రీ కె. డి. మాలవీయ మొన్న లోకసభలో ఒక ప్రకటన చేస్తూ తెలియజేశారు. రాజ్యసభలో కూడా ఇలాంటిదే ఒక ప్రకటన చేయబడింది.

1947లో దేశంలో 20 లక్షల టన్నుల పెట్రోలియం ఉత్పత్తులు వాడుక చేయబడగా, ఇప్పుడు అది దాదాపు 60 లక్షల టన్నులకు పెరిగిందనీ, దీనిని బట్టి దేశంలో పారిశ్రామికాభివృద్ధికృషి ఎంత త్వరితంగా సాగుతోందో తెలియగలదనీ, 1966 నాటికి ఒక కోటీ 40 లక్షలటన్నుల క్రూడ్-ఆయిలూ, అదేరేటున 1971 నాటికి 2 కోట్ల 50 లక్షల టన్నుల క్రూడ్ ఆయిలూ అవసరం కాగలదని అంచనా వేయబడిందనీ శ్రీ మాలవీయ అన్నారు.

పెట్రోలియం ఉత్పత్తులను దిగుమతి చేసుకునేందుకుగాను(తీరప్రాంతాలలో వున్న మూడు శుద్ధి కర్మాగారాలకూ అవసరమయ్యే క్రూడ్ ఆయిలుతోసహా) సాలీనా 100 కోట్ల రు.ల విలువైన విదేశ మారక ద్రవ్యం వ్యయమవుతోందనీ, దీనిని ఆదాచేసేందుకుగాను ద్వితీయప్రణాళికలోఉక్కుకర్మాగారాలకు ప్రాధాన్యం ఇచ్చినట్లే, తృతీయప్రణాళికలో చమురు అన్వేషణ, చమురు ఉత్పత్తి కార్యక్రమాలకు అత్యధిక ప్రాధాన్యమివ్వబడుతుందనీ మంత్రి వెల్లడించారు.

"స్వదేశంలో ప్రస్తుతం 5 లక్షల టన్నుల క్రూడాయిలు కూడా ఉత్పత్తి కావడం లేదు. కాని, అదృష్టవశాత్తు, యీమధ్య జరిగిన కృషి ఫలితంగా మన దేశంలో అస్సాం, త్రిపురా, మణిపూర్, పశ్చిమబెంగాలు, గంగాలోయ పంజాబు, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ, కాశ్మీర్, రాజస్థాన్, కాంబే, కచ్, తూర్పు పశ్చిమ తీరప్రాంతాలు (మద్రాసు, ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, కేరళ), అండమాన్, నికోబార్ దీవులలో మొత్తం 4 లక్షల చదరపుమైళ్ళ విస్తీర్ణంలో చమురు దొరుకుతుందని తెలియవచ్చింది. 1956 ఆగస్టులో ప్రభుత్వం చమురు, సహజవాయు విషయాల సంస్థను (పార్లమెంట్ చట్టం మేరకు అది యీఏడాది అక్టోబరులో చట్టబద్ధమైన సంస్థగా మారింది) నెలకొల్పింది. మారుమూలప్రాంతాలలో సహితంఆసంస్థ చమురుకోసం భూగర్భ పరిశోధనలు జరుపుతోంది. చాలాప్రదేశాలలో చమురు దొరకగలదన్న సూచనలు కనిపించాయి. ఈసంస్థచేత త్వరితంగా పనిని సాగించాలని ప్రభుత్వం నిర్ణయించింది" అన్నారు శ్రీ కె.డి. మాలవీయ.

1966 నాటికి దాదాపు 1కోటి 40 లక్షల క్రూడాయిలును ఉత్పత్తిచేయాలంటే, అతిస్వల్పకాలంలో ఎక్కువ విదేశమారక ద్రవ్యాన్ని వెచ్చిస్తూభారీ ఎత్తున చమురు అన్వేషణ కార్యక్రమాలను కొనసాగించాలి. అందువల్ల,భారత పారిశ్రామిక విధానానికి భిన్నంగాలేని ఏర్పాట్లక్రింద ఉభయపక్షాలకూఆమోదయోగ్యమైన షరతులపై, చమురుకోసం అన్వేషణ జరిపేందుకు విదేశీ నిపుణులను ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ప్రభుత్వం కొత్త నియమాలనుఖాయపరిచింది. అవి రెండు భాగాలుగా వుంటాయి. అవి తక్షణమే ప్రచురించబడుతున్నాయి. అని శ్రీ మాలవీయ లేన ప్రకటనలో వివరించారు.

సంగల్ ఎరువుల ఫ్యాక్టరీ పురోగతి

భాక్రా విద్యుత్కేంద్రానికిజరిగిన ప్రమాదంవల్ల, సంగల్ ఎరువులఫ్యాక్టరీ పురోగతిలో ఆలస్యంఉండబోదనీ,ఇదివరకు అనుకున్నట్లే 1960 సెప్టెంబరు నాటికి అది ఉత్పత్తి ప్రారంభిస్తుందనీ కేంద్ర వాణిజ్య పారిశ్రామికశాఖ ఉపమంత్రి శ్రీ సతీశ్ చంద్ర ఇటీవల లోకసభలో శ్రీ బసుమతారీ ప్రశ్నతులడిగిన ప్రశ్నకు జవాబు చెప్పారు.

సంగల్ వద్ద ఎరువుల ఫ్యాక్టరీని స్థాపించడంలో ఇంతవరకూ సాధించబడిన అభివృద్ధిని వివరిస్తూ శ్రీ సతీశ్ చంద్ర ఒక ప్రకటన చేశారు. హెవీ వాటర్ యంత్రాగారానికనుమానాలు నికరపరచబడుతున్నాయనీ, దాని కాంట్రాక్టును ఒక పశ్చిమ జర్మనీవ్యాపార సంస్థకు ఇవ్వడమైందనీఆయనఅన్నారు.

దేశంలో కుటుంబ నియంత్రణం

న్యూఢిల్లీ, డిసెం 1

దినదినాభివృద్ధి చెందుతున్న జనాభా సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తేనే తప్ప, లేకపోతే, దేశం ఆర్థికాభివృద్ధి పథకాలు కుంటుపడతాయనే విషయం యీనాడుసర్వేసర్వత్రా అంగీకరించబడింది.

ఒక ముఖ్య విషయం ఏమిటంటే, గడచిన కొలది దశాబ్దాలలో దేశంలో జనాభా పెరుగుదలరేటు భారీగాపెరిగిపోయింది. 1921వ సంవత్సరపు జనాభా లెక్కల తర్వాత గతించిన మూడు దశాబ్దాలలో జనాభా నూటికిపరుసగా 11.0, 13.5, 14.1 వంతుల చొప్పున పెరిగిపోయింది.

కుటుంబ నియంత్రణంద్వారా జనాభా పెరుగుదల రేటును బాగా అరికడితేనో లేదా ఆహార సరఫరా పరిమితం అవడంవల్ల మరణాల రేటు బాగా పెరిగిపోతేనో తప్ప లేకపోతే భారతదేశం జనాభా 1951లో 360 మిలియనులనుండి 1981లో 520 మిలియన్లకు పెరిగిపోగలదని, వెనుకటి సెన్సస్సు కమిషనరు, శ్రీ ఆర్. ఏ. గోపాలస్వామి అంచనా వేశారు.

తొలి ప్రణాళిక చివరి భాగంలో అధికారరీత్యా ప్రారంభించిన కుటుంబ నియంత్రణ కార్యక్రమం క్రమంగా వడి అందుకొని వేగంగా సాగిపోతోంది.

కుటుంబ నియంత్రణ విషయంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రధానకార్యకలాపాలు నాలుగు. అవి: సర్వీసు, శిక్షణ, విద్య, పరిశోధన.

పంచవర్షప్రణాళికలో యిందుకోసం రూ. 65 లక్షలు కేటాయించారు. ఈ కాలంలో 21 గ్రామీణ చికిత్సా కేంద్రాలను 126 పట్టణ చికిత్సాకేంద్రాలను ఏర్పాటుచేశారు.

రెండో ప్రణాళికలో కేంద్రానికి రూ. 400 లక్షలు, రాష్ట్రాలకు రూ.97 లక్షలు వెరసి రూ. 497 లక్షలు. ఈ కార్యక్రమంకోసం కేటాయించారు.ఈ కాలంలో పట్టణ ప్రాంతాలలో 500 చికిత్సా కేంద్రాలు, గ్రామీణప్రాంతాలలో 2000 చికిత్సా కేంద్రాలుప్రారంభించవలెచారు.

పట్టణప్రాంతంలోని చికిత్సాకేంద్రం 50,000 మంది ప్రజలకు, గ్రామప్రాంతంలోని చికిత్సాకేంద్రం 66,000 మంది ప్రజలకు కుటుంబ నియంత్రణ చికిత్సా సౌకర్యాలు కల్పిస్తాయి.

గర్భధారణ, మరణాల రేట్లను గురించి సరియైన అంచనాలు తయారు చేయడా నికీ,జనాభాపై, కుటుంబ నియంత్రణ కార్యక్రమంవల్ల కలిగే దీర్ఘకాలిక ఫలితాలను పరిశీలించడానికీ, సమాజంలో జనన మరణ వ్యాధి స్థితిగతుల పరిశీలన కార్యక్రమం ఒకటి నిర్వహిస్తున్నారు. దోరాబ్జీ తాతా ధర్మనిధి సహాయంతోభారతప్రభుత్వం బొంబాయిలో జనాభా సమస్యల పరిశోధనా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈకేంద్రం యునైటెడ్ నేషన్స్ సహకారంతో ప్రాంతీయ వ్యవస్థగాకూడా పనిచేస్తూ, ఇతర ఆసియా దేశాలకు కూడా తోడ్పడుతోంది. మరోజనాభా సమస్యల పరిశోధన కేంద్రాన్ని ఢిల్లీ ఆర్థిక పాఠశాలలో ప్రారంభించారు.

కుటుంబ నియంత్రణ కార్యక్రమం ప్రగతిని సమీక్షించడానికీ, తృతీయ ప్రణాళికలో చేర్చదగు కార్యక్రమాలను సూచించడానికి, శ్రీమతి ధన్వంతి రామారావు అధ్యక్షతన యిటీవల ఒక సంఘాన్ని నియమించారు.

అజర్‌బైజాన్ భాషలో భారతీయ గ్రంథాలు

బాకు, డిసెం 1

గత మూడు సంవత్సరాల్లో అజర్‌బైజాన్ భాషలో భారతీయ రచయితల గ్రంథాలు 165,000 ప్రతుల్లోప్రచురింపబడ్డాయి.

భారతీయ రచయితల కథలసంపుటి ఒకటి అజర్‌బైజాన్ భాషలో ప్రచురింపబడ్డది. 20,000 ప్రతులలో అచ్చువేయబడిన ఆసంపుటిలో ప్రేమ్‌చంద్, ముల్క్‌రాజ్ ఆనంద్, కృష్ణచంద్ర మొదలైనవారి కథలు ఉన్నాయి.

కృష్ణచంద్ర నవల "మేలర్కొన్న పూలాలు," రవీంద్రనాథ్‌టాగూర్ నవల "నౌకాభంగం," ఖ్వాజా అహమ్మద్ అబ్బాస్ వ్రాసిన మరిరెండు నవలలు యీమధ్య ప్రచురింపబడ్డాయి.

భారతీయ దేవతాకథలసంపుటాలు రెండు అజర్‌బైజాన్ ప్రజలలోబహుళ ప్రచారంలో ఉన్నాయి.

శాశ్వతంగా నిర్మిస్తున్న పట్టణంలో 1467 వసతులను నిర్మించారనీ, నిర్మాణం సాగుతున్నచోట 500 వసతులు ఇదివరకే నిర్మించబడ్డాయని కూడా ఉపమంత్రి తనప్రకటనలోపేర్కొన్నారు.

పశ్చిమజర్మనీ ప్రభుత్వ స్కాలరుషిప్పులు

ఎంచుకోబడిన అభ్యర్థులు

న్యూఢిల్లీ, డిసెం 1

పశ్చిమ జర్మనీలో 1959-60వ సంవత్సరంలో ప్రత్యేక శిక్షణ పొందడానికి భారతీయులకు జర్మన్ ఫెడరలు రిపబ్లిక్ ప్రభుత్వం యివ్వగల స్కాలరు షిప్పులు పొందడానికి ఎంచుకున్న 48 మంది అభ్యర్థుల పేర్లు ప్రకటించబడినవనీ మిగిలిన ఇద్దరిపేర్లూ తద్వారా ప్రకటిస్తారనీ కేంద్ర వైజ్ఞానిక సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వశాఖ ఒక పత్రికా ప్రకటనలో తెలియచేసింది. ప్రకటించబడిన 48 లోనూ యీక్రింది వారున్నారు: శ్రీ కేకపల్లి అచ్యుతరామారావు (స్ట్రక్చరల్ ఇంజినీరింగు), శ్రీ శీతంరాజు సత్యనారాయణరావు (ఎలక్ట్రికల్ ఇంజినీరింగు), శ్రీ తాడేపల్లి నరసింహమూర్తి(ఎలక్ట్రికల్ ఇంజినీరింగు), శ్రీ నిప్పల విశ్వేశ్వర శర్మ (మెకానికల్ ఇంజినీరింగు) శ్రీ వల్లభనేని శ్రీహరిరావు (మెకానికలు ఇంజినీరింగు), శ్రీ ఇనగంటి భుజంగరావు (గనుల శాస్త్రం), శ్రీ కె. యం. రావు (ఎలక్ట్రికల్ ఇంజినీరింగు).

రాయల్ సార్వీజియన్ కౌన్సిలు ఫెలోషిప్పులు

నార్వేలో విజ్ఞాన, ఇంజినీరింగు శాస్త్రాలలో పరిశోధనలు జరపడానికి అవివాహితులకు 10,600 రూపాయలూ, వివాహితులకు 12,000 విలువగల ఫెలోషిప్పులను రాయల్ నార్వీజియన్ వైజ్ఞానిక, పారిశ్రామిక పరిశోధనా మండలి మంజూరు చేయగలదని భారతప్రభుత్వ వైజ్ఞానిక పరిశోధనలు సాంస్కృతిక వ్యవహారాల మంత్రిత్వశాఖ తెలియజేసింది ఈఫెలోషిప్పులు యూరప్‌లోని పరిశోధకులకు మాత్రమే ఉద్దేశించబడినప్పటికీ యూరప్ వెలుపలి దేశముల అభ్యర్థుల దరఖాస్తులుకూడ పరిశీలించబడతాయి. అయితే వారికి ప్రయాణ ఖర్చులు యివ్వబడవు. అభ్యర్థుల వయస్సు 35 సంవత్సరాలలోపు వుండాలి. విజ్ఞాన శాస్త్రం లేక ఇంజినీరింగు శాస్త్రంలో బ్రిటిషు లేక అమెరికన్ విశ్వవిద్యాలయం యిచ్చే పి హెచ్. డి. డిగ్రీకి సమానమైన విద్యార్హతలు కలిగివుండాలి. అభ్యర్థులు తమ దరఖాస్తులను 1960 ఫిబ్రవరిలోగా యీ క్రింది చిరునామాకు పంపాలి. "రాయల్ నార్వీజియన్ కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రిసెర్చి, గావుస్టాడ్‌ల్లీ 30, బ్లాండర్‌స్, ఓస్లో, నార్వే.

ఫ్రాన్సుకు భారత ప్రతినిధి వర్గం ప్రయాణం

మద్రాసులో ఇండో-ఫ్రెంచ్ ప్రోటో టైప్ ఉత్పత్తి, శిక్షణ కేంద్రం స్థాపన విషయమై ఫ్రెంచిప్రభుత్వంతో చర్చించే నిమిత్తంయూనియన్ వాణిజ్య మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి, శ్రీ నాగేంద్ర బహదూర్ నాయకత్వాన ఒక భారత ప్రతినిధి వర్గం, గత వారంలో ఫ్రాన్సుకు బయలుదేరింది. వీరు అక్కడ 15 రోజులపాటు ఉండి ఒకకోటి రూ.ల వ్యయంతో యీకేంద్ర నిర్మాణానికి సంబంధించిన సమగ్ర ప్రణాళికను రూపొందిస్తారు.

ఓఖ్లాలోనూ, రాజకోట్‌లోనూ పశ్చిమజర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాల ఆర్థిక, సాంకేతిక సహాయంతో ఇట్టి సంస్థలు లోగడ నెలకొల్పబడ్డాయి. మద్రాసులో ఇండో-ఫ్రెంచ్ ప్రోటో టైప్ ఉత్పత్తి శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పడానికి తోడ్పడగలమని, 1958 జూన్ లో ఫ్రెంచి ప్రభుత్వం సూచించిన మేరకు యిద్దరు ఫ్రెంచి నిపుణులు 1959 మార్చిలో భారతదేశాన్ని సందర్శించిన ఒకసాంకేతిక నివేదికను అందజేసిన సంగతి పాఠకులకు విదితమే.

శబ్దవేగాన్ని మించిన విమానాలు

లండన్, డిసెం 1

శబ్దానికి రెండింతల వేగంతో ప్రయాణంచేసే బ్రిటిష్ పి-1 లైట్నింగ్ ఫైటర్ విమానం త్వరలోనే సర్వీసులోకి వెళ్లబోతున్నదని బ్రిటన్ విమాన యాన శాఖామంత్రి డన్‌కన్ శాండీస్ కామన్స్ సభలో ఇటీవల చెప్పాడు. ఇంతకంటే ఎక్కువవేగంతో వెళ్ళగల పూర్తిగా ఉక్కుతో నిర్మించబడే పరిశోధక విమానం వచ్చే సంవత్సరం ఎగురుతూండగలదని కూడ ఆయన చెప్పాడు.

మన పంచవర్ష ప్రణాళిక

ఆర్థిక మంత్రి శ్రీ మురార్జీ దేశాయ్ వివరణ

న్యూఢిల్లీ, డిసెంబర్ 1

భారతీయ వాణిజ్య, పారిశ్రామిక మండలుల ఫెడరేషను ప్లానింగ్‌పై యిటీవల యిక్కడ యేర్పాటు చేసిన చర్చాగోష్ఠిలో ఆర్థిక మంత్రి శ్రీ మురార్జీ దేశాయ్ ఇలా ప్రసంగించారు:

"ఈ ప్లానింగు చర్చాగోష్ఠి ప్రారంభించడానికి నన్ను ఆహ్వానించినందుకు ఫెడరేషనుకు చాలా కృతజ్ఞుణ్ణి.

దేశంలో లభ్యమయే ఇరవులను ఒబ్బిడిగా వాడుకొని వాటినుంచి వీలైనంత ఎక్కువగా ఫలితాలను సాధించడం, ఆ ఇరవులనుకూడా వీలైనంత పెంపొందించడం- యివే ప్లానింగుయొక్క లక్ష్యాలు.

దేశాభివృద్ధికి ప్రణాళికలను రూపొందించే కార్యక్రమంలో మనం అనేక సంవత్సరాలుగా నిమగ్నులమై ఉన్నాము. అప్పుడే అనేక విధాల, అనేక ముఖాల మనం పురోగమించామనుకూడా. సరిగా ఎంత అభివృద్ధి సాధించాము అనే విషయం నేను యిప్పుడు ప్రస్తావించదలచలేదు. కాని భారతీయ ఆర్థిక వ్యవస్థ పురోగమిస్తోంది అనేది మాత్రం స్పష్టము. గతంలో మనం సాధించిన విజయాలను సద్వినియోగపరుచుకొని, అభివృద్ధి కార్యక్రమాలు యింకా వడి అందుకొనేట్టు మనం చూడాలి. త్వరలో మనం ద్వితీయ ప్రణాళిక చివరి సంవత్సరంలో ప్రవేశించనున్నాము. అప్పుడే తృతీయ ప్రణాళిక స్వరూప స్వభావాలను గురించి, పరిమాణాన్ని గురించి ఆలోచనలు ప్రారంభించాము. మన ప్రణాళికల లక్ష్యాలు ఏమిటో మనకు తెలిసింది. ఈ లక్ష్యాలను సాధించడంలో కొన్ని చిక్కులుఉన్నమాట వాస్తవం. అభివృద్ధి కార్యక్రమాలు సాగినకొద్దీ, గతములో ఎదుర్కోవలసివచ్చినటువంటి సమస్యలనీ మున్ముందుకూడా మనము ఎదుర్కోవలసిఉంటుంది. మనము కొన్ని సామాజిక లక్ష్యాలనుకూడా సాధించతలపెట్టామనీ, ప్రజల అవసరాలను తీర్చి వారికి న్యాయము చేకూర్చగల సాంఘిక-ఆర్థిక వ్యవస్థను సృష్టించడానికి మనంపాటుపడుతున్నామనీ గుర్తుంచుకోవడం అవసరం. దేశాన్ని త్వరితంగా ఎలా అభివృద్ధిలోకి తేవాలి అనే దే కాకుండా, యీ అభివృద్ధి వల్ల ఒనగూడే ఫలితాలు ఏకాగ్రమందికో కాక, అశేష ప్రజానీకానికి అనుభవంలోకి వచ్చేట్టు చూడడం అవసరం అనే విషయంకూడా యీగోష్ఠి దృష్టిలో పెట్టుకోగలదని ఆశిస్తున్నాను.

ప్రణాళికా రచన ప్రజాస్వామ్య సూత్రబద్ధంగా జరగాలని మనం కోరుతున్నాము. మన ప్రణాళికల గూర్చి పార్లమెంటులోను, పత్రికలలోను, అనేక యితర గోష్ఠులలోను, సమావేశాలలోను విస్తృతంగా చర్చలు జరుగుతున్నాయి. ప్లానింగు కమిషనూ, ప్రభుత్వ సంస్థలూ ప్రణాళికకు ఒక ముసాయిదాను తయారు చేయవలసిఉన్నమాట నిజమే. కాని ఆ ముసాయిదాను అంతిమంగా ప్రజలు ఆమోదించవలసిఉంటుంది. లక్ష్యమిది ప్రజా సహకారంమీద ఆధారపడిఉంటుంది. వ్యాపారస్తులకు, పారిశ్రామికులకు సహజంగా యీ విషయంలో ఒక ప్రత్యేక దృక్పథం ఉన్నప్పటికీ,ప్రణాళికా రచన జాతీయ శ్రేయస్సు దృష్ట్యా జరుగవలసి వుంటుంది. ఈ విషయంపై జరిగే చర్చలు ఫలప్రదం కావాలంటే, దీనిని ఒక ప్రత్యేకవర్గం యొక్క శ్రేయస్సు దృష్ట్యా కాకుండా పైనుదాహరించిన విశాల దృక్పథంతో పరిశీలించవలసి ఉంటుంది.

తృతీయ ప్రణాళికకు అవసరమైన ద్రవ్యం లభించాలంటే ఆంతరంగికంగా వీలైనంత సాధన సంపత్తిని సమకూర్చుకోడానికి మనం సర్వశక్తులా కృషి చేయాలి. అలాకాక, అనవసర ప్రయాసపడకుండా మనకు అందుబాటులోవున్న వనరులను మాత్రమే వినియోగించుకొని తమ ఆశయాలను పరిమితమైన హద్దుల్లో ఉంచుకోనడం మంచిదని కొందరు వాదించవచ్చును. ఇది కేవలం నిరాశావాదం. ఈగోష్ఠిలో ఎవరూ ఈ నిరాశావాదానికి పాల్పడరని విశ్వసిస్తున్నాను. ఈదేశంలోని వ్యాపారస్థులు పారిశ్రామికుల ప్రసంగాలు రచనలనుచూసినా అంతరంగిక వనరుల సేకరణకు మనం సర్వప్రయత్నాలూ చెయ్యవలసి ఉంటుందని వారుకూడా భావిస్తున్నట్లు తోస్తున్నది. ఈ విషయంలో ప్రభుత్వ రంగమూ ప్రైవేటు రంగమూ ఏకీభవిస్తున్నాయి.

ఏ ప్రణాళికకైనా ప్రజలవద్దనుంచి లభించే పెట్టుబడి, ప్రజలు ఎంతగా త్యాగాలు చేయగలరు, ఎంతగా కష్టాలకు ఓర్వుకోగలరు అనేదానినిబట్టి ఉంటుంది. పన్నుల ద్వారానూ, ఋణాలద్వారానూ, చిన్న మొత్తాల పొదుపుద్వారానూ, ప్రభుత్వ సంస్థలు తీసే లాభాలద్వారానూ, సర్వవిధాలా వీలైనంత ధనం సేకరించాలి. ఏ రంగంలో ఎంత డబ్బుసేకరించాలి అనేది వేరే విషయం. ఆధునిక రాజ్యాలలో ప్రజలవద్దనుంచి వసూలుచేసే పన్నులన్నీ వారి శ్రేయస్సుకోసమే వినియోగించబడుతూ ఉంటాయి. ఎవరి వద్దనుంచి పన్నులు వసూలు చేయబడ్డాయో ఆవర్గం వారికోసమే వాటిని వినియోగించకపోవచ్చును. ఆర్థికాభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకూ, విద్యద్వారా, ఇతర సాంఘిక సేవా సౌకర్యాలద్వారా ప్రజానీకంయొక్క ప్రమాణాలను పెంపొందించడానికి ఈ డబ్బును వినియోగిస్తారు. ఇట్టి పరిస్థితులలో పన్నులు వేస్తున్నందుకు ప్రభుత్వాన్ని విమర్శించడం దూరదృష్టిలేని పని. పన్నుల ఎగవేత అంతకంటే గర్హణీయమైనది. సమాజం తన ఆదాయంలో కొంత మొత్తాన్ని ఆదాచేయక తప్పదు. డబ్బును సేకరించడానికి రకరకాల పద్ధతులు కాలానుగుణంగా అవలంబిస్తూ ఉండవలసి ఉంటుంది. దేశం తగినంతగా ముందుకుసాగి, తనంతటతను అభివృద్ధి చెందగల స్థితికి రావాలంటే తృతీయ ప్రణాళికకు గూడా భారీఎత్తున విదేశ సహాయం అవసరం అవుతుంది. ఈసహాయం తగినం

మద్రాసు మేయర్‌గా కజగంఅభ్యర్థిఎన్నిక

మద్రాసు, డిసెం 1

మద్రాసు మేయర్‌గా 1959-60 సంవత్సరానికి (అంటే డిసెంబరు నుండి 1960నవంబరువరకు ద్రవిడమున్నేత్ర కజగం అభ్యర్థి శ్రీ ఎం. అబ్దుల్ ఖాదర్ ఎన్నికయ్యారు.

వాగాయమ్మపేటలో మిడిల్‌స్కూల్ మూసివేత

హైద్రాబాద్, డిసెంబరు 1

తూర్పు గోదావరి జిల్లా వాగాయమ్మపేటలోని ఎస్. ఎం. హెచ్. మిడిల్‌స్కూలును శాశ్వతంగా మూసివేయడానికి విద్యాశాఖ డైరెక్టరు ఆమోదించారు. ఈస్కూలు 1960-61 విద్యాసంవత్సరంనుండి మూతపడుతుంది. తమ పిల్లల విద్యకు ఇతర మార్గాలు చూసుకోవలసిందిగా తలిదండ్రులు కోరబడినారు.

సంయుక్తమహారాష్ట్ర సమితి సభ్యుల వాకౌట్

బొంబాయి, నవంబర్ 30

కాంగ్రెస్‌పార్టీ బొంబాయి రాష్ట్ర విభజన సమస్యపై అనుసరిస్తున్న విధానానికి ఆక్షేపణగా బొంబాయి రాష్ట్ర ఎగువ దిగువ శాసన సభల నుండి సంయుక్త మహారాష్ట్ర సమితి సభ్యులు వాకౌట్ చేశారు.

రేడియో కార్యక్రమము

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై)

3 డిసెంబరు గురువారం

ఉ॥ 6-30 సుప్రభాత్ (ఎ.కె), 6-35 కార్యక్రమ వివరణ 6-40 భక్తిరంజని 7-00 తె.వా, 7-15 తిరుపతి డి. చెంగల్వరాయలు: నాదస్వరం (విజయవాడ నుండి రిలే) 7-45 సంగీత శిక్షణ 8-00 ఆం. వా, 8-15 హిం. వా, 8-30 హిందూస్థానీ సంగీత పాఠం 8-45 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమము, మంచుతెరలు, నాటిక 1-00 స్త్రీల కార్యక్రమము (ఉర్దూ) 1-30 జీనత్ బేగమ్: భజన్ 1-50 తె. వా, 2-00 శాస్త్రీయ సంగీత్ (కె), 2-10 ఉ.వా, 2-20 మాధ్యమిక పాఠశాలలకు (ఉర్దూ) 2-50 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

ప్రసారము 2 (తరువాయి)

3-45 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు, (విజయవాడ నుండి రిలే) 4-15 ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 మరాటీ శ్రోతలకు 7-00 తె.వా, 7-15 ఉర్దూ పద్య పఠనము 7-30 నిమిషం తీరిక ఉంటేనా, నిరుద్యోగి, ప్రసంగం, ఎన్. కేశవస్వామి, 7-40 విరామసంగీతము (కె), 7-45 రాగం, తానం, పల్లవి 8-30 రేడియో న్యూస్ రీల్ 8-40 విరామ సంగీతం (కె), 8-45 సుగమ్ సంగీత్ (ఎ.కె), 9-00 ఆం.వా, 9-15 ఉ. వా, 9-30 ఆంగ్ల కార్యక్రమము 10-00 మారెళ్ళ కేశవరావు: వయోలిన్ 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాదు-బి

42.02మీ (7140 కిలోసై)

ఉ॥ 6-30 హైదరాబాద్ ఎ వలె 8-45 ప్రసార సమాప్తి.

30.86 మీ (9720 కిలోసై)

మ॥ 12-30 హైదరాబాద్ ఎ వలె 1-00 పి. సుందరమ్మ, 1-30 హైదరాబాద్ ఎ వలె 2-10 శాస్త్రీయ సంగీతము (కె), 2-20 పి. సుందరమ్మ 2-50 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

ప్రసారము 2 (తరువాయి)

3-45 హైదరాబాద్ ఎ వలె 4-15 ప్రసార సమాప్తి.

60.14 మీ (4988 కిలోసై)

సా॥ 6-00 హైదరాబాద్ ఎ వలె 6-15 గ్రామస్థులకార్యక్రమము, శతకరత్నావళి:సుమతీశతకం,బహుమతులు మామిడిచెట్లలో, వార్తావాహిని ప్రకటనలు, ధరలు, వాతావరణము 7-00 తె.వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, విశేషాలేమిటి? రైతు కథ, 7-30 హైదరాబాద్ ఎ వలె 9-15 లలిత్ సంగీత్ 9-30 హైదరాబాద్ ఎ వలె 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ

357.1మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 కుళోదయం, ప్రసార విశేషాలు 6-35 వాద్య సంగీతము 6-40 భక్తిరంజని: తూము నరసింహదాసు కీర్తనలు 7-00 తె.వా, 7-15 తిరుపతి డి. చెంగల్వరాయలు నాదస్వరం, 7-45 సంగీత శిక్షణ 8-00 ఆం.వా, 8-15 హిం.వా, 8-30 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కార్మికుల కార్యక్రమము: (హైదరాబాద్ నుండి రిలే) 1-00 ఎమ్. వి. రమణమూర్తి 1-30 లలిత సంగీతం (ఎ. కె), 1-50 తె.వా, 2-00 ప్రసార సమాప్తి.

3-30 క్లారినెట్: నిలయ విద్యార్థులకు 3-45 మాధ్యమిక పాఠశాల విద్యార్థులకు, టాగూర్ కథలు: పోస్టాఫీస్ కథ, విశ్వభారతి, ప్రసంగం, ఈ వారపు కథ: తెలివిగలనక్క, బుద్ధిలేని గాడిద 4-15 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 గ్రామస్థుల కార్యక్రమము 7-00 తె. వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-30 నిమిషం తీరిక ఉంటేనా: నిరుద్యోగి ప్రసంగం (హైదరాబాద్ నుండి రిలే) 7-45 రాగం, తానం, పల్లవి (మద్రాస్ నుండి రిలే) 8-30 (ఢిల్లీ నుండి రిలే) 8-40 విరామ సంగీతం, 8-45 యాత్రిక వారం సందర్భంగా గవర్నర్ సందేశము 9-00 ఆం.వా, 9-15 ఫిల్మ్ సంగీతం (కె), 9-30 ఎమ్. వి. రమణమూర్తి, 10-00 తిరుపతి డి. చెంగల్వరాయలు: నాదస్వరం 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

అగ్ని ప్రమాదంలో రు. 30వేల ఆస్తినష్టం

హైద్రాబాదు, డిసెంబర్ 1

దక్షిణ విశాఖలోని దేశపట్నుని పాలెంలో గత శనివారం జరిగినఅగ్ని ప్రమాదంలో దాదాపు రెండువందల ఇండ్లు ధ్వంసమైనాయి. రెండునెలల శిశువు మంటలలోపడి చనిపోయినది. ఈ ప్రమాదంవల్ల కలిగిన నష్టం రు.30 వేలవరకు ఉంటుందని అంచనా.

హైద్రాబాద్ జిల్లా పరిషత్తు అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన డా॥ ఎం. ఎస్. లక్ష్మీ నరసయ్య (ఎం-ఎల్-ఏ-కాం)

కార్పొరేషన్ శకటాలకై జరిగిన పెట్రోలు ఖర్చు

ఈ యేడు సెప్టెంబరు వరకు రు. 68952 లు.

హైద్రాబాద్, డిసెం 1

కార్పొరేషన్ కార్యక్రమాలలో తిరిగిన శకటాలకు పెట్రోలు తదితర నూనెల నిమిత్తం యీ యేడాది సెప్టెంబరు వరకు పెట్టినఖర్చు రు 68952. ఈ ఖర్చుక్రింద బడ్జెటులో ఉన్న కేటాయింపు మొత్తం రు. 87310.

ఈ సమాచారాన్ని నిన్న మున్సిపల్ కార్పొరేషన్ సమావేశంలో కమిషనర్ శ్రీ సి. ఎన్. శాస్త్రి తెలియజేశారు.

ఉభయవర్గాల మధ్య కొట్లాటలో 5గురిమృతి

అహ్మదాబాదు జిల్లాలో సంఘటన

అహ్మదాబాద్, నవం 1

అహ్మదాబాదు జిల్లా ధోలకా తాలూకా గుండి గ్రామములో నిన్న ఉభయ వర్గాలమధ్య కొట్లాట జరగగా ఐదుగురు చనిపోయారు, 30 మంది గాయపడినారు.

ఈ కొట్లాటలో తుపాకులు, లాఠీలు, తదితర ఆయుధాలు ప్రయోగించబడినవి. పశువులు పంటల్ని పాడుచేసిన కారణంగా యీ కొట్లాట సంభవించినది.

కళాశాలలోని పనివారల ఆందోళన

తమ డిమాండ్ల సాధనకై సంఘ కార్యదర్శి నిరశన వ్రతం

హైద్రాబాదు, డిసెం 1

నగరంలోని కళాశాల లందలి పనివారలు నేడు ఉదయము 10 నుండి 12 గంటలవరకు పనిమానివేత సమ్మె చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయ పనివారల సంఘం ప్రధాన కార్యదర్శి మహాబొర్డ్లిను ఈనెల 28 నుండి యూనివర్సిటీ క్యాంపులో నిరశనదీక్షను ప్రారంభించారు.

కరువుభత్యం హెచ్చింపు తదితర యూనియన్ డిమాండ్ల విశ్వవిద్యాలయ అధికారులు అంగీకరించక పోవడమువల్ల యూనియను ఈ విధముగా అందోళనను ప్రారంభించినది.

కమ్యూనిస్టులతో ఘర్షణ

29 మందికి గాయాలు

అర్రా, డిసెం 1

కమ్యూనిస్టులకు వారి వ్యతిరేకులకు మొన్నసాయంత్రంఇక్కడ జరిగిన ఘర్షణలో 29 మంది గాయపడినారు. ఇందు బాగా గాయపడిన నలుగురు సర్దార్ పటేల్ ఆస్పత్రిలో చికిత్సకై చేర్చబడినారు.

కమ్యూనిస్టులు ఒక బహిరంగ సభను జరుపదలవగా మూడు వేల మంది విద్యార్థులు ఆ సభను జరుగనివ్వలేదు. పైగా వ్యతిరేక కమ్యూనిస్టు వ్యతిరేక నినాదాలచేస్తూ స్థానిక కమ్యూనిస్టుపార్టీ ఆఫీసుపై దాడి చేశారు. వారి పతాకాన్ని తగులపెట్టారు. మాన్‌సిటుంగ్, చౌఎన్‌లేల బొమ్మల తగులపెట్టారు. పోలీసులు త్వరలోనేవచ్చి పరిస్థితులను అదుపు చేశారు.

కేరళలో ఓటర్ల సంఖ్యా వివరాలు

త్రివేంద్రం, డిసెం 1

తయారుచేయబడిన ముసాయిదా ఓటర్ల పట్టికను అనుసరించి కేరళలో ఓటర్లసంఖ్య 80.67 లక్షలు. ఛీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ పి. ఐ. జాకబ్ ఈ విషయాన్ని పత్రికలవారికి తెలిపారు.

త్వరలో ఈ రాష్ట్రమందు జరుపబడే ఎన్నికలకై 8780 పోలింగ్ స్టేషన్‌లు ఏర్పరచ బడుతవి.

ఆంధ్రప్రదేశ్ విద్యార్థి మహాసభలు

విజయవాడ, నవం 28

28 వ ఆంధ్రప్రదేశ్ విద్యార్థి మహాసభలు నేడు శ్రీ కె. వి. రమణారెడ్డి అధ్యక్షతన ఇక్కడ అరండల్ సత్రములో జరిగినవి. ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ కె. ఎస్. ఎస్. ప్రసాద్ స్వాగతం చెప్పారు. ఆంధ్రప్రదేశ్ జిల్లాలనుండి 150మందిదాకా విద్యార్థి ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

శ్రీ రమణారెడ్డి తన అధ్యక్ష ప్రసంగంలో విద్యార్థి ఉద్యమాలతో పరిచయంగల వ్యక్తులకు విశ్వకళా పరిషత్తులలోని సిండికేట్, సెనేట్‌లలో స్థానం లేకపోవడం శోచనీయమన్నారు. విద్యార్హత లేనివారు, రాజకీయ ప్రభావంతో సభ్యులౌతున్నారని ఆయన విమర్శించారు. పాఠ్యగ్రంథాలలోని లోపాలను కూడా ఆయన ఈ సభలో పేర్కొని కొన్ని తరగతులకు కళాశాలలో బోధించేందుకు పుస్తకాలే లేవన్నారు.

శ్రీ రంగం శ్రీనివాసరావు సభను ప్రారంభిస్తూ స్వాతంత్ర్యము, శాంతి అభ్యుదయం భావాలు కల్గిన విద్యార్థి ఉద్యమం తన యొక్క సానుభూతి ఎల్లప్పుడు పొందగలదన్నారు.

కలకత్తాలో అఖిలభారత విద్యార్థి ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ హిరేన్ దాస్ గుప్తా మాట్లాడుతూ విద్యార్థుల గురుతర బాధ్యత నేడు చాలా వున్నదన్నారు. ఇప్పుడు ప్రధాన మంత్రిగావున్న శ్రీ నెహ్రూ- కీర్తిశేషుడు జిన్నాలు ప్రారంభంలో ఆదరణ చూపిన విద్యార్థి ఫెడరేషన్ 1936 వ సంవత్సరంనుంచీ చేస్తున్న కృషిని ఆయన వివరించారు. విద్యార్హతలున్నా ఇంజినీరింగు, వైద్యం చదవడానికి అనేకమందికి నేడు చదువుకొనేందుకు సీట్లు దొరకడం లేదనీ విద్యాభివృద్ధికి ఇంకా ఎక్కువ కృషి జరగాలనీ ఆయన అన్నారు. పదకొండవ తరగతిపెట్టడంవల్ల కొంత లాభం భావిజీవితంలో విద్యార్థికి లభించగలదని ప్రభుత్వం భావించిందే గాని పశ్చిమ బెంగాలులో అన్ని స్కూళ్ళలోనూ ఈ తరగతికి కావలసిన హంగులు లేవన్నారు.

శ్రీ జి. వి. నారాయణరావు సభ జయప్రదం కావాలని శ్రీ రాధాకృష్ణన్, మాడపాటి హనుమంతరావు ప్రభృతులు పంపిన సందేశాలు చదివిరి.

(స్వ.వి.)

ఇండియాకు బ్రిటన్ ఆర్థిక సహాయం

లండన్, డిసెం 1

1949 నాటి ఎగుమతి గ్యారంటీల చట్టంలోని మూడవ సెక్షన్‌కింద ఇండియాకు బ్రిటన్ ఇచ్చిన 190 లక్షల పౌన్లు ఋణాన్ని ఉపయోగంలో పెట్టటానికి సంబంధించిన ఒక ఒప్పందంపై నవంబరు 25 న లండన్‌లో సంతకాలు జరిగినాయి. బ్రిటన్‌లోని ఇండియా అక్టింగ్ హైకమిషనరు, బ్రిటిష్ ప్రభుత్వం పక్షాన ఎగుమతి పరపతుల గ్యారంటీ శాఖ కార్యదర్శి, ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇండియా రెండవ పంచవర్ష ప్రణాళికకు (1956-1961) ధనాన్ని సమకూర్చే సందర్భంగా ఇండియాకిస్తున్న సంయుక్త సహాయ కార్యక్రమంలో, ఈ 190 లక్షల పౌన్లఋణం ఒక భాగంగా ఉంది.

జస్టిస్ అన్సారీకి వీడ్కోలు

హైద్రాబాద్, డిసెం 1

కేరళ హైకోర్టు జడ్జిగా ట్రాన్స్ ఫరయి వెళ్ళుతున్న జస్టిస్ ఎమ్. ఎ. అన్సారీకి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిన్న వీడ్కోలు ఇచ్చినది. అడ్వొకేట్ జనరల్ డి. నర్సరాజు శ్రీ అన్సారీకి కృతజ్ఞతల తెలిపారు, వారి సేవల ప్రస్తుతించారు.

పులివెందల, గుత్తిలో అనాథ మహిళా శిక్షణ కేంద్రాలు

జనవరినుండి ప్రారంభం

కడప, డిసెం 1

కడప జిల్లా పులివెందలలోను, అనంతపురం జిల్లా గుత్తిలోను అనాథ మహిళలకు విద్యా ప్రత్యేక శిక్షణ పాఠశాలలు 1960 జనవరినుండి ఏర్పాటు చేయబడుతాయి. మూడేళ్ళ శిక్షణ ఇస్తారు. మొత్తం 40 మంది చేర్చుకోబడుతారు; శిక్షణసమయంలో నెలకు రు. 30 స్టయిపెండు ఇస్తారు.

నెల్లూరు, అనంతపూర్, కడప, చిత్తూరు జిల్లాలనుండే అభ్యర్థినులు చేర్చుకో బడుతారు.

శ్రీదుర్గానాట్యకళామండలి, (చిక్కడపల్లి) వారు వై. ఎం. సి. ఏ. హాలు (నారాయణగూడ)లో ది. 5 వ తేదీ శనివారము రాత్రి 7 గంటలకు శ్రీ రామాంజనేయ యుద్ధము నాటకమును ప్రదర్శిస్తారు.

గ్రామ వార్తలు

మహబూబ్‌నగర్ జిల్లాపరిషత్తుకు నాన్ బ్లాక్ ప్రాంత ప్రతినిధులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 1

మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్తుకు నాన్ బ్లాక్ ప్రాంతాలనుండి ఈ దిగువ 12మందిప్రతినిధులుగా ఎన్నికయ్యారు: నారాయణాచారి (మక్తల్), రామాచారి (మున్ననూర్), ఎం. గోపాలరెడ్డి (అచ్చంపేట), రాజేశ్వరరెడ్డి (మహబూబ్‌నగర్), వీరభద్రప్ప (కోడంగల్), గంగన్న (ఈజ్), జగన్నాథ రెడ్డి (వనపర్తి), నరసింహారెడ్డి (అర్దకల్లు), సి. నర్సిరెడ్డి (ధన్వాడ), బుచ్చిరెడ్డి (మద్దూరు), కె. వెంకట నరసింహగుప్త, పి. నారాయణ రావు.

వరంగల్ పంచాయత్ సమితి స్థాయీ సంఘాలు

వరంగల్ డిసెం 1

వరంగల్ పంచాయత్ సమితికిగల ఐదు స్థాయీ సంఘాల్లో మూడు సంఘాలకు మైనారిటీ వర్గాలవారు అధ్యక్షులుగా ఎన్నుకోబడ్డారు.

వివరాలు ఇవి:

వ్యవసాయ తకావీ కమిటీ: అబ్దుల్ ఖాదర్, వర్క్స్ కమ్యూనికేషన్ల కమిటీ: ఇమాంపరీఫ్, ఆరోగ్య విద్యా కమిటీ: మొయినుద్దీన్, ఆర్థిక కమిటీ: హెచ్. వాసుదేవరావు, సహకార కమిటీ: రంగారెడ్డి.

ఈ వివిధ స్థాయీ సంఘాలకు సమితి అధ్యక్షుడు శ్రీ ఆర్. సత్యనారాయణ 10 మంది ప్రతిపక్షాల వారిని నామినేట్ చేశారు. సమితిలో మొత్తం 32 గురు కాంగ్రెసువారు 12 గురు ప్రతిపక్షాలవారు ఉన్నారు.

కమ్యూనిస్టుపార్టీనుండి రాజీనామా

పులిమామిడి, డిసెం 1

హైద్రాబాద్ జిల్లా పులిమామిడి గ్రామంనుండి శ్రీ మంగలి జంగయ్య ఇలా వ్రాస్తున్నారు:

"గత రెండు సంవత్సరాల నుండి నేను కమ్యూనిస్టుపార్టీ సభ్యునిగా ఆ పార్టీ కార్యకలాపాలలో పాల్గొనుచుంటిని, కాని కమ్యూనిస్టుపార్టీ నాయకులు పార్టీపేరుతో తమ స్వంత పగలు తీర్చుకొనుటకు పార్టీని,ప్రజలను చట్టవిరుద్ధ చర్యలకు పురికొల్పి ఎన్నో కష్టనిష్టురాలకు ప్రజలను గురిచేశారు. పై దౌర్జన్య చర్యలు సరియైనవికావని అన్నందుకు నాపైకూడ దౌర్జన్యానికి పూనుకున్నారు. వీరికిఆదినుండితమతో ఏకీభవించనివారిపై దౌర్జన్యంజరపడం అలవాటు. ఈలాంటి సంఘ విద్రోహులతో కలిసి వుండటం సరియైనది కాదనే నిర్ణయానికి వచ్చి పార్టీనుండి రాజీనామా యిస్తున్నాను."



5 వ వారము
నగీనా ఫిలిమ్సువారి సట్టా బజార్
తా॥ మీనాకుమారి, బాల్ రాజ్ సహాని, జానీవాకర్,
లిబర్టీ- హైద్రాబాద్.
ఆటలు: 6-30 మరియు 9-30,
ఎస్. బి. పిక్చర్స్ విడుదల.

7 వ మహత్తర వారం
సాహితి ఆర్టు ప్రొడక్షన్స్
బండరాముడు
(తెలుగు)
చిత్రా - సికింద్రాబాదు.
4-12-59 నుండి: భారత్ టాకీస్- మహబూబునగర్.
3-12-59 నుండి: ప్రభాత్- నిజామాబాదు.
తదుపరిమార్పు: సెలక్టు- బొల్లారం. రీగల్- హైద్రాబాద్.
(Nima) పూర్ణ విడుదల

16 వ సంయుక్త వారము
శ్రీ వేంకటరమణా ఫిలిమ్స్ వారి
బాలనాగమ్మ
తా॥ అంజలి, రాజసులోచన, ఎన్. టి. రామారావు, సూర్యకళ, రేలంగి, ఎస్. వి. రంగారావు.
రీగల్- హైద్రాబాదు.
ఆటల సమయములు: 6-00; 9-30 గం॥
శ్రీ కృష్ణాటాకీస్ & రమేష్
సూర్యాపేట్ నిజామాబాదు.

తదుపరిమార్పు:
చిత్రా టాకీస్- సికింద్రాబాద్.
భాస్కర్ ప్రొడక్షన్స్
మనోరమ
(తెలుగు)
తా॥ కృష్ణకుమారి, బాలయ్య, రమణారెడ్డి, సూర్యకాంతం, ఆదోనిలక్ష్మి.
తేదీకై నిరీక్షించండి:
10 వ సంయుక్త వారము
నోబుల్ టాకీస్ - మల్లేపల్లి, (హైద్రాబాద్.)
మరియు
భారత్ టాకీస్- మహబూబ్‌నగర్.
(Nima) ఉదయశ్రీ విడుదల.

4వ సంయుక్త వారము
శ్రీ సారథి స్టూడియోస్ వారి
భాగ్యదేవత

దర్శకుడు:- తాపీచాణక్య.
సంగీతం: వేణు.
(సారథి స్టుడియో హైద్రాబాద్‌లో తయారు చేయబడినది)
తా॥ సావిత్రి, రాజసులోచన, సూర్యకాంతం, జగ్గయ్య, రేలంగి, బాలయ్య.
దీపక్ మహల్
హైద్రాబాద్.
ప్యారడైజ్
(పర్‌కండిషన్డు) సికింద్రాబాద్.
ఆటలు: 6-00, 9-30 గం॥
శ్రీనివాస పిక్చర్ ప్యాలెస్
వరంగల్.
నవయుగ విడుదల.
(Trupix)

శుభవార్త!
కుష్ఠు, బొల్లి వ్యాధిగ్రస్తులు, సంతానము లేనివారు, నపుంసకులు, నవజీవనము, జీవితానందము కొరకు వాల్తేరులోని శ్రీయోగాశ్రమమునకు మరలుడు.
వివరములు కోరువారు 6-12-0 పంపిన ఆశ్రమనివేదిక పంపబడును.

ఛీఫ్ జడ్జి సిటీ సివిల్ కోర్టు, సికింద్రాబాదు
ఒ. పి. నెం. 115 of 1959
వీసంశెట్టి లక్ష్మీనరసయ్య .....వాది.
మరియు
లక్ష్మమ్మ వురఫ్ లలిత.....ప్రతివాది.
శ్రీమతి లక్ష్మమ్మ వురఫ్ లలితకు,
వీసంశెట్టి లక్ష్మీనర్సయ్య భార్య, C/o బుడమనర్సయ్య, భువనగిరి.
వివాహసంబంధపు హక్కుల రద్దుపరచుకొనుటకు నీ పైన పై నెంబరులో కేసు దఖలు పరుచబడియున్నట్టిదానిని 15-12-1959 ఉదయము 11-0 గం॥ విచారణ జరుపబడునని తెలియజేయడమైనది. కావున నీవు స్వయముగాకాని లేక ప్రతినిధిద్వారా లేక అడ్వొకేటుద్వారా హాజరు కావలెను. లేనియెడల కేసు విచారణ జరిపి ఎక్స్‌పార్టీ పేరతీర్మానించబడును.
సికింద్రాబాద్ (ఆ. ప్ర) 26-11-1959 "శ్రీవెంకటవిహార్" 25/ బి. మారేడపల్లి ఈస్టు సికింద్రాబాద్ (ఆ. ప్ర)
కె. ఆర్. కుప్పుస్వామి అయ్యంగార్, బి. ఎ. బి. ఎల్.
కె. ఆర్. నరసింహన్, బి.ఎ.ఎల్ ఎల్.బి. వాది తరపు అడ్వొకేట్లు.

5-12-59 శనివారము 2-30 నుండి విడుదల
ఈ సంవత్సరమునకు ఉత్తమ సాంఘిక చిత్రము.
విశ్వల్ ప్రొడక్షన్సు
పెళ్ళి మీద పెళ్ళి
[తెలుగు]

తా: కృష్ణకుమారి, రమణమూర్తి, రమణారెడ్డి, చలం, మైనాకుమారి, మిక్కిలినేని, ఏ. వి. సుబ్బారావు, పెరుమాళ్లు, రమాదేవి, తదితరులు.
దర్శకత్వం: విజలాచార్య.
సాగర్ హైద్రాబాదు. రాజేశ్వర్ సికింద్రాబాదు.
మరియు మార్కండేయ - వరంగల్.
(Tru ix) ఈస్టు ఇండియా విడుదల.

4-12-59 శుక్రవారము సా॥ 3-30 గం॥ విడుదల
మీనాకుమారి: మీ అభిమానతార నటించిన అద్భుత చిత్రము.
నటనా నైపుణ్యముతో ఇంపైన సంగీతముగల ఉత్తమగాథ.
పి. ఎన్. లరొయ్య సమర్పించు
జాగీర్

తా॥ ప్రేమ్‌నాథ్, ఉల్లాస్, కుల్దీప్ కౌర్, మహమూద్, మినోముంతాజ్.
సంగీతం: మదన్ మోహన్.
దర్శకత్వం: జగ్ మోహన్ మత్తు.
అశోక్ హైద్రాబాద్. మనోహర్ సికింద్రాబాద్, న్యూ మదన్ గుల్బర్గా.
(Trupix) శ్రీరామ్‌పిక్చర్స్ విడుదల.

న్యూయార్కు పత్తి

న్యూయార్క్, డిశంబర్ 1

ప్రారంభం	33.	08
ముగింపు	33	

ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునదేమనగా నా తండ్రియగు శ్రీ కూరనారాయణ, మిట్టపల్లి ప్రస్తుతనివాసం సిద్దిపేట, వయస్సు 75 సంవత్సరములు, ముదుసలియై మతిభ్రమ కలిగి ఎందున ఒకే ఒక కొడుకును ఉండగా నాకు తెలవలసిన స్థిరచరాస్తులను అనగా మిట్టపల్లిలో సర్వే నెం. (210) మామిడితోట 3 ఎకరములు, 16 గుంటలు, (1) దుకాణం, ఒక నెం. (193)గల గుడ్డం యింకా యితర వస్తువులు అమ్ముటకు ప్రయత్నించుచున్నట్లు తెలియుచున్నది. ఇట్టి వానిని గిర్వీ పెట్టుకున్నను, కొనదలచినను వారే నష్టపడుదురని తెల్యచేయుచున్నాను. పైవాని కన్నింటికి హక్కుదారుడను నేను గావున ఇతరుల కెవ్వరికిని జోక్యములేదు.

ఇట్లు

కూర ముత్తేశం,

నివాసం: సిద్దిపేట.

శ్రీయోగాశ్రమము, వాల్తేరు

ఔషధములు, ఆపరేషన్ లులేకుండా

అన్ని వ్యాధులు

నివారింపబడును.

వివరములు కోరు వారు 0-12-0 సంపిన

ఆశ్రమ నివేదిక పంపబడును.

జెమినీ సర్కస్

(పాశ్చాత్యదేశములో ప్రఖ్యాతిగాంచిన ప్రదర్శనము)



గోషామహల్ స్టేడియం

హైదరాబాద్.

నేడు 2 ఆటలు: 6-30 గం॥ & 9-30గం॥

మ్యాటినీలు: శని, ఆదివారాల్లో ప॥ 3-30 లకు

రు. 4-80; రు. 3-37; రు. 2-25 తరగతులకు సర్కస్ ఆవరణములో ఉ॥ 10-00 గం॥ నుండి మధ్యాహ్నం 12-00 గం॥ వరకున్నూ, సా॥ 4-00 గం॥ నుండి 6-00 గం॥ వరకు అడ్వాన్సు బుకింగ్. పర్దా స్త్రీలకు గ్యాలరీలో మాత్రము ప్రత్యేక ఏర్పాట్లుగలవు.

వాణిజ్య వ్యాపారాలు

మెసర్స్ కల్పసూర్యనారాయణ

మర్చంట్ అండ్ కమీషన్ ఏజంట్

ఉస్మాన్‌గంజ్ - హైదరాబాదు

ఫోన్ నెం. 4412

హైదరాబాద్, డిసెం 1

(పల్లా ఒక్కంటికి 120 శేర్లు

దొడ్డు బియ్యం	54-0-0	55-0-0
నెంబర్లు కొ॥	57-0-0	58-0-0
సాంబర్లు పా॥	78-0-0	80-0-0
కొత్తసాంబర్లు	6[illegible]-0-0	67-0-[illegible]
నూకలు	38-0-0	47-0-0
వరంగల్ సాం. పా॥	84-0-0	86-0-0
కందులు పెద్దవి కొ॥	50-0-0	51-0-0
కందులు చిన్నవి కొ॥	43-0-0	44-0-0
మినుములు	48-0-0	51-8-0
సెనగలు	40-0-0	44-0-0
బెల్లం	58-0-0	75-0-0
పెసళ్ళు కొ॥	47-0-0	48-0-0
తెల్లతొన్నలు	51-0-0	52-0-0
పచ్చతొన్నలు	38-0-0	40-0-0
మిరపకాయలు	230-0-0	300-0-0
పసుపు	115-0-0	130-0-0
ఉల్లిగడ్డ	19-0-0	24-0-0
చింతపండు కొ॥	170-0-0	200-0-0
నల్లవులువలు	29-0-0	30-0-0
తెల్లనువ్వులు	97-0-0	100-0-0
నజ్జలు	39-0-0	42-0-0
పెద్ద కందిపప్పు	85-0-0	85-8-0
చిన్న కందిపప్పు	65-0-0	70-0-0
సెనగపప్పు	50-0-0	52-0-0
పెసరపప్పు	68-0-0	70-0-0
మినుప పప్పు	70-0-0	71-0-0
ఆముదాలు	65-0-0	65-8-0
లంకపిండి	53-0-0	53-0-0
ఇలాతికాయ చి॥	45-0-0	60-0-0
యెర్ర నువ్వులు	92-0-0	93-0-0
యెర్ర బొబ్బర్లు (12 శేర్ల మణుగు		
అల్లం	8-0-0	9-0-0
యెల్లిగడ్డ	9-0-0	13-0-0
సల్కునూనె	16-9-0	16-10-0
ఆటుగడ్డలు		

వెండి,బంగారు ధరలు

సముద్రాల రాఘవులుగారి చంద్రయ్య దుకాణం

సిద్దంబర్ బజార్, ఫోన్ నెం. 4890

హైదరాబాద్, డిసెం 1

బంగారం	124-0-0
అశోక్ చిపు	124-4-0
సవరను	80-8-0
వెండి (కు॥ 100 కి)	206-8-0
కు 1 కి రు.	2-1-6

చేర్యాల సమితి ఉపాధ్యాయ సంఘం ప్రారంభోత్సవం

వరంగల్, డిసెంబరు 1

చేర్యాల సమితి ప్రభుత్వోపాధ్యాయ సంఘం ప్రారంభోత్సవాన్ని వరంగల్ పరిషత్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు శ్రీ ఎమ్. సత్యనారాయణరావు చేశారు. ప్రారంభోత్సవము చేర్యాల ప్రభుత్వోన్నత పాఠశాలలో జరిగింది. మద్దూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ మార్కండేయులు, జనగామ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ జె.సత్యన్న, చేర్యాలడిప్యూటీఇనస్పెక్టర్ శ్రీడి.లక్ష్మీనరసింహారావు, బచ్చన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ అప్పారావు యిందు పాల్గొన్నారు. ఉపన్యాసకులు పంచాయతీ రాజ్యస్థాపనను విజయవంతంచేసి, గ్రామాలలో రామరాజ్య స్థాపనకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఉద్బోధించారు.

అంబరు చరఖా విద్యాలయ ప్రారంభోత్సవము

మహబూబునగరము, డిసెం 1

స్థానిక అంబర్ పరిశ్రమాలయములో రెవిన్యూ మంత్రి కొండా వెంకటరంగారెడ్డిచే అంబర్ చరఖా విద్యాలయ ప్రారంభోత్సవము నవంబరు 29న జరుపబడింది. ఈ సందర్భములో జరిగినసభకు పల్లెర్లహనుమంతరావు(యం.పి.) అధ్యక్షతవహించారు. శ్రీ బి.యస్.రావుసభాకార్యక్రమాన్ని ప్రారంభిస్తూ ఈనాడు జరుగుచున్న అధికార వికేంద్రీకరణ సఫలీకృతం కావాలంటే ఆర్థిక సమానత అవసరము కాబట్టి ఖాదీపరిశ్రమవల్ల ఆర్థిక సమానత ఏర్పడు అవకాశము కలదని తెలిపిరి. విద్యాలయ ప్రిన్సిపాల్ నివేదిక చదివినతర్వాత రెవిన్యూ మంత్రి శ్రీ కె. వి. రంగారెడ్డి విద్యాలయానికి ప్రారంభోత్సవము గావిస్తూ ప్రసంగించిరి. దేశము స్వాతంత్ర్యము సాధించినతర్వాత ఎన్నో ప్రజాహిత కార్యక్రమాలు నిర్మాణాత్మకదృక్పథముతో నిర్వహింపబడుచున్నవని అందులో అంబర్ శిక్షణాలయాలు ప్రాంతీయ పరిశ్రమలుకలవు. కాబట్టి పేద ప్రజల ఆర్థికసహకారిగా అంబర్ చరఖా ఉపకరించగలదనీ ముఖ్యముగా స్త్రీలకు మంచి అవకాశములభించినదనీ వారు తెలిపిరి. ప్రభుత్వము ఈ పరిశ్రమకు సబ్సిడీఇచ్చి ప్రోత్సహించిన జాగుండునని వివరిస్తూ తెలంగాణములో మహబూబునగరము జిల్లా ఈఅంబర్ పరిశ్రమకు ప్రాముఖ్యముఇచ్చినందునఆదర్శవంతమైన జిల్లాగా పరిగణింపబడుచున్నదనియు, ఈ విద్యాలయములోని విద్యార్థులు తమతమప్రాంతాలకువెళ్ళి ఖాదీ ఉత్పత్తికి అనుకూల వాతావరణము కల్పించవలయునని ఉపన్యసించిరి. శ్రీహనుమంతరావుమాట్లాడుతూ మహాత్ముని సిద్ధాంతాలను ఆచరణరూపముతో దేశములో వ్యాప్తిగావించుటమనవిధి. కాబట్టి ప్రతివాడు కర్తవ్యనిష్ఠతో ఖాదీ ధరించుట మంచిదని తెలిపిరి. సభానంతరము సర్వోదయ ప్రార్థన తేనీటి విందు గావింపబడినవి.

సగరవార్తలు

"ధన్వంతరి జయంతి"

హైదరాబాదులోని ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో 1959 నవంబరు 29వ తేదీ ఉదయం 8 గంటలకు ధన్వంతరి జయంతి జరుపబడింది. ఆ సాయంత్రం ప్రభుత్వ ఆయుర్వేద ఆయుపత్రిలో ఇండియన్ మెడిసిన్ శాఖ ప్రత్యేకాధికారి అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది. ప్రభుత్వ ఆయుర్వేద కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ అతిథులకు స్వాగతము పలికారు. పండితజి. వాసుదేవశాస్త్రి, పండిత సి. విశ్వనాథశాస్త్రి ప్రభృతులు ప్రసంగించారు. వక్తలు, ధన్వంతరి జయంతి ప్రాశస్త్యాన్ని, ఆయన ఉపదేశాలను విశదీకరించారు.

సభాధ్యక్షుడు తమ ప్రసంగంలో ధన్వంతరి రూపొందిన విధానాలను అనుసరించ వలసిందిగా భారతీయ విద్యా విధానాలలో చికిత్స చేస్తున్నవారికి విజ్ఞప్తిచేశారు. ఆయుర్వేద తదితర వైద్యవిధానాల పునరుద్ధరణ వైద్యుల నిర్వాహజమయిన కృషిపై ఆధారపడివుంది. వారు చరక మొదలయిన భిషగ్వరుల సూత్రాలను అభ్యసించి ఆచరణలో పెట్టడం ద్వారా ఇందుకు పూనుకోవాలని ఆయన అన్నారు.

ప్రముఖ వైద్యులు పంపినసందేశాలను సభలో చదివారు.

ఖిల్లాషాపూరం పంచాయతి బోర్డు

ఖిల్లాషాపురం, డిసెం 1

ఖిల్లాషాపురం పంచాయతి బోర్డు అస్థిత్వములోనికి వచ్చి మూడుసంవత్సరాలయినా సాధింపబడిన ప్రగతి ఏమీ లేదని స్థానిక భారతీయ జనసంఘ సమితి తెల్పుతున్నది.

అధ్యక్షులవారి మకాం జనగామ అని బోర్డు ఏర్పడినప్పటి నుండి వివిధ రూపాలలో నసూలు చేయబడిన డబ్బు ఏయే గ్రామాభివృద్ధి పనులకు వినియోగింపబడినది తెలియదని వీధులలో మురికి పెంటలు తాండవమాడుతుంటాయని హరిజనగూడెంలో మశూచి వ్యాపించి చాలా మందిని బలిగొన్నదని జాఫర్ గూడ నియోజకవర్గ సభ్యుడు ఉద్యోగములోకి వెళ్ళిపోయి మూడు సంవత్సరాలయినా ఆతని బదులు మరొకరు ఎన్నుకోబడలేదని ఈ సమితి చేసిన ప్రకటనలో కలదు.

శ్రీకొంకిమళ్ళ నాగభూషణం

విజయవాడ, డిసెంబరు 1

విజయవాడలో గవర్నమెంటుప్లీడరుగా శ్రీకొంకిమళ్ళ నాగభూషణం నియమించబడ్డారు. ఇంతవరకూ ఈ ఉద్యోగంలోవున్న ఆలీబేగ్ సాహెబ్ నుంచి తయన డిసెంబరు 7 న చార్జి పుచ్చుకుంటారు. శ్రీ నాగభూషణం ఇప్పుడు స్థానిక న్యాయవాద సంఘ అధ్యక్షులు. స్వ.వి.

గ్రంథాలయ ప్రారంభోత్సవం

రామన్నపేట, డిసెం 1

గోకవరం తాలూకా రామన్నపేట గ్రామమున నవంబరు 28 న ఉదయం భారతీయ గ్రంథాలయ ప్రారంభోత్సవము శ్రీ ఆర్. వెంకటేశ్వరరావు ఆధ్వర్యాన జరిగినది. గ్రామయువజన విద్యార్థులు, ఉన్నత విద్యావంతులు యెక్కువ సంఖ్యలో పాల్గొని, తమ తమ ఆదరాభిమానముల వెల్లడించిరి.

సాధువు నిరాహార దీక్ష

నిజామాబాద్, డిసెం 1

నిజామాబాద్‌లో ఒక దేవాలయం ఉన్న స్థలాన్ని తన అధీనం చేయాలని కోరుతూ తన డిమాండును సాధించుకోడానికి గత పదిదినాలుగా శ్రీ సోలాపూర్ సిద్దయ్య అను ఒకసాధువు నిరాహార దీక్ష పూనారు. ఆస్థలం శ్రీ బి. రాజన్న అనువారిదట. కానిసాధువు అందులో చాల కాలంగా ఉంటున్నారట.

రాకపోకలు

కార్మికమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య డిసెంబర్ 4వ తేదీన బయలుదేరి వెళ్ళి చౌటుప్పల్ పంచాయితీ సమితికి ప్రారంభోత్సవంచేస్తారు. అదేరోజున నారాయణపూర్ పంచాయితీ సమితికి ప్రారంభోత్సవం చేసి సాయంత్రం నగరానికి తిరిగి వస్తారు.

గురజాడఅప్పారావు జయంతి

2 వ డిసెంబరు బుధవారం సాయంత్రం గం॥ 5-30 కు శ్రీ బూరుగుమహాదేవ శ్రేష్ఠిగారి హాలులో (కింగ్స్‌వే, సికింద్రాబాదు) శ్రీ తాపి ధర్మారావు అధ్యక్షతన దేశోద్ధారక సమితి ఆధ్వర్యాన జరుగుతుంది. శ్రీ దేవులపల్లి వేంకట కృష్ణ శాస్త్రి శ్రీ డి. రంగాచార్యులు ప్రసంగిస్తారు. శ్రీ దాశరథి శ్రీ కుందుర్తి ఆంజనేయులు, శ్రీ "హనజ", శ్రీ సి. నారాయణ రెడ్డి కావ్యగానం చేస్తారు.

శ్రీ గౌరీశ్వర దివ్యజ్ఞాన సమాజము

విద్యావిషయ దివ్యజ్ఞాన సమాజం వారి నవరాత్రుత్సవములు

చోడవరం, డిసెం 1

నవంబర్ 13 నుండి వారం దినములున్ను నవంబర్ 22 న అజేక యిండ్లలో గంటి భోగయ్యగారి ఆధ్వర్యమున భారత సమాజ పూజ జరుపబడెను. శ్రీ పూసర్ల వెంకటశంకర సూర్యనారాయణ 22వ తేదీఆదివారం పూజానంతరం అల్పాహార విందొసంగించిరి.

13-11-59 తేదీని జిల్లా ముర్సులు శ్రీ రామనారాయణరెడ్డి అధ్యక్షతన సభా ప్రారంభోత్సవము జరిగెను. న్యాయవాది కవి శేఖరులు శ్రీ భమిడిపాటి రామ సోమయాజులు కళా, ఆరాధన అను అంశంపై ఉపన్యసించిరి.

14-111--59 తేదీని మందా సుబ్బారావు పంతులు అర్పణ అను విషయము ప్రసంగించిరి.

15-11-59 తేదీని శ్రీ మద్దుల శ్రీరామమూర్తి సభను ప్రారంభించిరి. శ్రీ గండికోట వెంకట లక్ష్మీనరసింహం పంతులు "తత్వమసి" అను వేదాంతోపన్యాసమునిచ్చిరి. హర్డింజి లాడ్జి కార్యదర్శి సభ్యుల నెరుకపర్చిరి. గంటి భోగయ్యగారు వందన సమర్పణతో నాటి కార్యక్రమము ముగిసెను.

16-11-59 తేదీని శ్రీ కందర్ప రామేశం సభను ప్రారంభించి అశోక చక్ర, ధర్మ విజయము, దివ్య జ్ఞాన సేవా సమితి విషయములపై ప్రసంగములు జరిపిరి. శ్రీ మంథా సుబ్బారావు గంటి భోగయ్య, లాడ్జి కార్యదర్శి శ్రీ కల్లూరు జగన్నాథం కార్యనిర్వహణ కొరకు సమాలోచనలు జరిపిరి.

నవంబర్ 17 న దివ్యజ్ఞాన సమాజ జన్మదినోత్సవములు శ్రీ గంటి భోగయ్య ఆధ్వర్యమున జరిగెను. "పరమార్థ సాధన" అను పుస్తకములు సభికులకు గంటి భోగయ్యగారు పంచిరి.

నవంబర్ 10 న లాడ్జి ప్రసిడెంటు కందర్ప కృష్ణమూర్తి విందొసంగిరి. మధ్యాహ్నం స్త్రీల సమావేశము కాబడి- దివ్య జ్ఞాన విషయములు భక్తి మార్గము గురించి గంటిభోగయ్యగారు, మంథా సుబ్బారావుగారు మాట్లాడిరి. సాయంకాలం శ్రీ కేశవ స్వామి వారి దేవాలయములో, శ్రీ పెంటకోట శ్రీరాములు నాయుడు ఉపన్యాసమునిచ్చిరి.

నవంబర్ 10 న శ్రీ కాకరపర్తి సత్యనారాయణ పంతులు దయచేసి మధ్యాహ్నం స్త్రీల సభావేశములో ఒక సందేశము నిచ్చిరి. సాయంకాలం శ్రీ కేశవస్వామివారి దేవాలయంలో ప్రసంగించిరి. నవంబర్ 20 న స్థానిక న్యాయవాది కవిశేఖర, బ్రహ్మ శ్రీ భమిడిపాటి రామసోమయాజులు షష్టిపూర్తి ఉత్సవ సందర్భములో శ్రీగౌరీశ్వర దివ్యజ్ఞాన సమాజము తరపున రామసోమయాజిగారికి అభినందన పద్యములు సమర్పించుచు రజిత పాత్రను బహూకరింపబడెను. శ్రీ, దూర్వాసుల కామేశ్వరరావు పద్యములు రచించి చదివిరి.

ఫెడరేషను రు. 20 శ్రీమంథాసుబ్బారావు ఫెడరేషన్ తరపున శుభాకాంక్షలు అందచేయుచు ఒక డిలెన్ శాలువను కానుకగా సమర్పించిరి.

21--11-59 తేదీ విశాఖ జిల్లా సమాజముల కార్యదర్శి శ్రీ అయల సోమయాజుల అన్నపూర్ణయ్య, దివ్యజ్ఞాన సమాజ నవరాత్రోత్సవముల గురించి ప్రసంగించిరి.

యీ మహోత్సవ దినములలో శ్రీ సరిపల్లి భవాని శంకరం పంతులు శ్రీ మండ రామనరసింగరావు పంతులు వకీలు ఉభయులు లాడ్జి సభ్యులుగా చేరిరి.

కార్యదర్శి శ్రీ కల్లూరు జగన్నాథం వందనాలర్పించారు.

తల్లి, కూతుళ్ళను హత్య చేసినందుకు మరణశిక్ష

ఆగ్రా, డిసెం 1

స్కూల్‌వర్డన్ లీడర్ కె.ఎం. కామాత్ భార్య ప్రేమ్ కామాత్‌ను, కూతురు రేఖను హత్యచేసిన నేరంపై బోధపురోత్తమ చనయకు ఆగ్రా జిల్లా మరియు సెషన్సు జడ్జి మహేశ్ చంద్ర మరణదండనను విధించారు.

ఈతనిపై ప్రేమ్‌కామాత్‌ను హత్యచేసి మున్సిపల్ మార్కెట్ లోపారవేశాడనీ, ఆమెకూతురుశవాన్ని పాతిపెట్టాడని ఆరోపించబడింది.

కన్నపుదొంగ అరెస్టు

హైదరాబాద్, డిసెం 1

పుల్లీబావులీలోని ఒక గడియారపు దుకాణంలో దొంగతనం జరిపిన నలీ అనే కన్నపు దొంగను పోలీసులు పట్టుకున్నారు. ఇతను ఆ గడియారపు దుకాణంలో పైకప్పు కొంత విప్పి ప్రవేశించాడని రు. వెయ్యి విలువగల గడియారాల దొంగిలించాడని తెలుస్తున్నది.

పార్లమెంటు పరిశీలనకు వస్తున్నవి:

జాతీయ క్రమశిక్షణ పథకం

న్యూఢిల్లీ, డిసెం 1

రాజస్థాన్, బీహారు, బొంబాయి, పంజాబు రాష్ట్రాలలోనూ, ఢిల్లీ కేంద్ర పాలిత ప్రాంతంలోనూ 266 పాఠశాలలకు జాతీయక్రమ శిక్షణ పథకాన్ని 1959-60 లో విస్తృతం చేయాలని తలపెట్టబడింది. అదనంగా దాదాపు 2,60,000 బాలలు యీ పథకం క్రిందికి వస్తారు.

లోకసభలో శ్రీ రామకిషన్ గుప్తా, శ్రీ భక్తదర్శన్‌లు అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వకంగానమాధానంచెబుతూ కేంద్ర విద్యామంత్రి డాక్టరు కె.ఎల్. శ్రీమాలి పైసమాచారం తెలియజేశారు.

ఈ పథకం క్రింద కొత్తగా వచ్చే పాఠశాలల వివరాలిని:-ఢిల్లీ 17, రాజస్థాన్ 32, బీహార్ 17, బొంబాయి 117, పంజాబు 83.

ఈ పథకం క్రింద కొత్తగా శిక్షీదు పొందేబాలలవివరాలిని:-ఢిల్లీదాదాపు 16,250, రాజస్థాన్ 32,500, బీహార్ 16,250, పంజాబు 31,250, బొంబాయి 1,13,750.

ప్రస్తుత జాతీయ క్రమశిక్షణ పథకం క్రింద బొంబాయి, పశ్చిమ బెంగాలు, పంజాబు, జమ్ము-కాశ్మీర్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలలో మొత్తం 635పాఠశాలలలో 2,60,000 మంది విద్యార్థులు శిక్షీదు పొందుతున్నారు. ద్వితీయ ప్రణాళికకు పెట్టుకున్న లక్ష్యాలు అప్పుడే సాధించబడ్డాయి.

కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్

భారతరాష్ట్రపతి అండ్ ఆడిటర్ జనరల్‌కు తన క్రిందఉన్న సంస్థలపై గల అధికారాలను వివరిస్తూ ఆయనకు దత్తంచేయని అధికారాల విషయంలో భారత ప్రభుత్వం యొక్క అనుమతి కావాలనీ కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీ మురార్జీ దేశాయి లోకసభలో శ్రీ హరిశ్ చంద్ర మధూర్ ప్రశ్నకుఇచ్చిన సమాధానములో తెలియజేశారు.

ఆర్థికమంత్రి తమ సమాధానంలో ఇంకా ఇలా తెలియజేశారు: శాశ్వత ఉద్యోగాలకల్పన, ఉద్యోగాల రద్దుల విషయంలో 2,3,4 తరగతుల ఉద్యోగాలు సంబంధించినంతవరకూ కంట్రోలరు అడిటర్ జనరల్‌కు యీ కింది పరతులకు లోబడి పూర్తి అధికారాలు ఉన్నాయి. 1. అదేశాఖలోని అదే రకం ఉద్యోగానికి ఉండే జీతపు రేటు రాష్ట్రపతి ఆమోదము పొందిన రేటు అయిఉండాలి, 2. సిబ్బందీ, పనిప్రమాణాల విషయంలో అందుకు తగిన అధికారులు జారీచేసిన నిబంధనల కనుగుణంగా ఉండాలి. 3. ఆ ఉద్యోగానికి ఇచ్చే జీతము యితరత్రా ఆదాచేసే మొత్తంలోనుంచిగాని లేక బడ్జెటులో అదనపు నిధులు కేటాయించబడిగాని ఉండాలి.

రేడియోలో లలిత సంగీతం

లలిత సంగీతానికి కేంద్ర అడిషన్ బోర్డును నియమించేందుకు నియమావళిని నికరపరిచారు. ఈ నియమాలప్రకారం ఒక కేంద్ర సంఘమూ, ఢిల్లీ, కలకత్తా, బొంబాయి, మద్రాసులో నాలుగు ప్రాంతీయ సంఘాలూ వుంటాయి. పరీక్ష జరిపినమీదట స్థానిక అడిషన్ సంఘాలు సిఫార్సు చేసిన కళాకారుల గ్రేడులను యీ ప్రాంతీయ సంఘాలు నిర్ణయిస్తాయి. స్థానిక భాష తెలిసి, సంగీత జ్ఞానం వున్న అనధికారులు యీ ప్రాంతీయ సంఘాలలో సభ్యులుగా వుంటారు. ఇప్పటి సంగీత అడిషన్ బోర్డు పని చేస్తున్న పద్ధతిలోనే లలిత సంగీత అడిషను బోర్డు కూడా పనిచేస్తుంది.

లోక్ సభలో శ్రీ రామకిషన్ గుప్తా అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వకంగా సమాధానం చెబుతూ కేంద్ర సమాచార, రేడియో శాఖ మంత్రి, డాక్టర్ బి. వి. కేస్కర్, పై సమాచారం తెలియజేశారు.

మహబూబ్ నగరం జిల్లాపరిషత్తు

అధ్యక్షు, ఉపాధ్యక్షులుగా కాంగ్రెసు అభ్యర్థుల ఎన్నిక

మహబూబ్‌నగరం, డిసెం 1

మహబూబునగరం జిల్లా పరిషత్తు అధ్యక్షుడుగా కాంగ్రెసు అభ్యర్థి శ్రీ కె. రామచంద్రారెడ్డి, (ఎం.ఎల్.సి.) ఎన్నుకోబడినారు. ఆ తరువాత శ్రీ కె. రామచంద్రారెడ్డి అధ్యక్షతలో సమావేశము జరిగినప్పుడు ఉపాధ్యక్షుడుగా శ్రీ కె. కె. రెడ్డి ఎన్నుకోబడినారు. హోంమంత్రి శ్రీ మందుముల నర్సింగరావు, తెలంగాణ ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు శ్రీ కె. అచ్యుతారెడ్డి ప్రభృతులుకూడ హాజరయినారు.

శ్రీ గోపాలకృష్ణ మఠం జాతర

హైదరాబాద్, డిసెం 1

ఆదిలాబాదు గోపాలకృష్ణ మఠం జాతర 1959 డిసెంబర్ 4 నుంచి 12వ తేదీ వరకు జరుగుతుంది.

పన్నుల ఎగవేతకు కారణాలు

వివిధ చట్టాలలోని లోపాలతో పాటు ప్రభుత్వశాఖల అసమర్థత కూడా

కొత్తఢిల్లీ, డిసెం 1

పన్నుల ఎగవేతకు కారణం శాసనాలలో ఉండే అవకతవకలతోపాటు ప్రభుత్వపు పన్నుల వసూలు చేసేశాఖలు ఆ శాసనాల నిబంధనల సక్రమంగా అమలు జరుపక పోవడం గూడా నని ప్రత్యక్ష పన్నుల నిర్వహణ వ్యవహారాల విచారణ కమిటీ కేంద్ర ప్రభుత్వానికి నివేదించినది.

నిన్న కేంద్ర ప్రభుత్వానికి ఈ కమిటీ నివేదిక సమర్పింపబడినది. ఈ కమిటీలో మహావీర్ త్యాగి ఎం.పి. (వైస్ మన్), ఆర్.పి. సిన్హా ఎం.పి., బి.ఎమ్. గుప్తే, జి.పి. కపాడియా, కె. సుందర్ రాజన్ (కేంద్ర రెవెన్యూ బోర్డు సభ్యుడు) కలరు.

పన్నుల వసూలు చేసేశాఖలు నిజాయతీ పరుల ప్రోత్సహిస్తూ పన్నుల ఎగవేసే వారిని శిక్షించే ద్వివిధమైన ఉద్దేశంతో పనిచేయాలని ఈ కమిటీ తన నివేదికలో పేర్కొన్నది. ఈ ఆశయంతోనే కమిటీ పన్నుల పకడ్బందీగా వసూలు చేయుటకు తగు సలహాలు ఇచ్చినది తన నివేదికలో.

నవంబర్ 30 వ తేదీన విపరీతమైన జనసమ్మర్ధం, స్థలాభావంచేత మార్చబడిన అభ్యుదయ కళాసమితి

యొక్క మహాకవి గురజాడ జయంతి రెండవనాటి తుదిసమావేశం యథాతథంగా తిరిగి డిసెంబర్ 3 వ తేదీ సాయంత్రం రామకోటి సుల్తాన్ బజారులోని సరోజినీదేవి హాల్‌లో జరుగుతుంది. ప్రముఖ కవి, రచయిత శ్రీ ఆరుద్ర ప్రసంగిస్తారు. "పుత్తడి బొమ్మ పూర్ణమ్మ" బుర్రకథ, "కన్యక" నృత్యం, "శాంతి" నాటిక, ఇతర జానపద సంగీత రూపకాలు ప్రదర్శించబడతాయి. వివిధ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం జరుగుతుంది. ఆహ్వానితులు మాత్రమే ఉత్సవాన్ని తిలకించడానికి వీలున్నది.

హైదరాబాద్ సహకార పాల సరఫరా సంఘం

హైదరాబాద్, డిసెం 1

కర్నల్ ఇబ్రాహిం బేగ్ అధ్యక్షునిగా హైదరాబాద్ సహకార పాలసరఫరా సంఘం ఏర్పడినది. ఇది పాల సరఫరా కేంద్ర సంఘంగా వ్యవహరించగలదు.

అసన్‌సోల్ ప్రమాదంపై కేంద్రం విచారణ

న్యూఢిల్లీ, డిసెం 1

అసన్‌సోల్‌కు సమీపంలో జుమేరియాలో గత ఆదివారం జరిగిన ప్రేలుడు ప్రమాదాన్ని గూర్చి కేంద్రప్రభుత్వము విచారణను జరిపించగలదని నేడు ప్రధాని నెహ్రూ లోకసభలో హామీయిచ్చారు.

మహారాజ్ గంజ్ హమాలీలు

నేడు తమకు ఎక్కువ కూలీలవర్తకులు చెల్లించడము లేనందునచిహ్నపూర్వకమయిన సమ్మె జరుపుతారు.

సిర్‌సిల్కు కార్మికుల మధ్య ఘర్షణ

పదిమందికి గాయాలు

సిర్‌పూర్, డిసెం 1

పదిమంది సిర్‌సిల్కు ఫ్యాక్టరీకార్మికులకు ఇక్కడ కార్మికవర్గాల మధ్య జరిగిన ఘర్షణలో గాయాలు తగిలినవి. ఫ్యాక్టరీలోచేరి ఇతర కార్మికులు పని చేస్తుండటాన్ని యూనియన్ కార్మికులు సహించడంలేదని దానిపై యీ ఘర్షణ జరిగినదని తెలుస్తున్నది.

పరిస్థితి ఉద్రిక్తంగా ఉండటం వలన 144 వ సెక్షన్ మరో పదిరోజులవరకు పొడిగించబడినది.

ఏటా పదిలక్షలమోటారు బండ్ల ఉత్పత్తి

బ్రిటిష్ కారునిర్మాణ సంస్థచే 5 కోట్ల పౌన్ల విస్తరణ పథకం

లండన్, డిసెం 1

సంవత్సరానికి పదిలక్షల మోటారు ఉత్పత్తి బండ్లు అయ్యేట్లుగా ఉత్పత్తిని పెంచటానికని బ్రిటిష్ మోటారు కార్పొరేషను వచ్చే మూడు సంవత్సరాలలోను 5 కోట్ల పౌన్‌లను ఖర్చు చేయటానికి తలపెట్టుతున్నది. ఈ విషయాన్ని కార్పొరేషను అధ్యక్షుడైన నర్ లియొనార్డు లార్డు ఒక ప్రకటనలో చెప్పారు. "ఈ కార్పొరేషను ఉత్పత్తి చేస్తున్న "బేబీ" కార్ల సంఖ్య ఇదివరకే చాలతక్కువగా ఉంది. వారానికి 8000 కార్లు వచ్చేట్లుగా ఈ ఉత్పత్తిని రెట్టింపు చెయ్యటానికై వెంటనే చర్యలు తీసికోబడుతున్నాయి. ప్రస్తుతం అన్ని కార్ల మొత్తం ఉత్పత్తి,సంవత్సరానికి ఏడున్నర లక్షల వంతున ఉంది. వచ్చే రెండు సంవత్సరాలలోను అదనపు సదుపాయంలో అందుబాటులోకి వచ్చినప్పుడు సంవత్సరానికి 10 లక్షల కార్లను ఉత్పత్తిచేసే లక్ష్యానికి చేరువగా వస్తాము. ఉత్పత్తి సదుపాయాలను పెంచడానికయి గత 5 సంవత్సరాలలోను 390 లక్షలపౌన్లు ఖర్చు పెట్టాము." అని ఆయన అన్నారు.

గ్లాస్గోలో ముగిసిన స్కాటిష్ మోటారు ప్రదర్శనలో 20 లక్షల పౌన్‌ల విలువగల మోటారు బండ్లు అమ్మకమయినాయి.

లండన్‌లో ఇటలీప్రధాని

లండన్, డిసెంబర్ 1

ఇటాలియన్ ప్రధాని సిగ్నల్ అంటోనియో సిగ్ని బ్రిటిష్ ప్రధాని మాక్మిలన్‌తో సంప్రదించ డానికయి ఇక్కడికి వచ్చారు. ఇతనితోటి ఇటలీ విదేశాంగ మంత్రి గూడా ఉన్నారు. శిఖరాగ్ర సమావేశము యితర అంశాలగూర్చి వీరు సంప్రదించ గలరు.

సూయజ్ కాల్వ అభివృద్ధి ఋణం

కైరో, డిసెం 1

సూయజ్ కాలువ అభివృద్ధి పథకానికయి ప్రపంచ బ్యాంకు ఐక్య అరబ్ రిపబ్లిక్‌కు 5665 లక్షల డాలర్ల ఋణాన్ని ఇవ్వదలుస్తున్నది.

మహబూబ్ నగర్ ఎలక్ట్రిసిటి కన్యూమర్స్ కోఆపరేటివ్ సొసైటి లిమిటెడ్‌ను స్వాధీనపరచుకొనుట

1-12-1959 నుండి మహబూబ్‌నగర్ ఎలక్ట్రిసిటి కన్యూమర్స్ కోఆపరేటివ్ సొసైటి లిమిటెడ్‌ను స్వాధీన పరచుకోబడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వములో కలిపివేయబడినదని మహబూబ్‌నగర్ ఎలక్ట్రిసిటి కన్యూమర్స్ కోఆపరేటివ్ సొసైటి లిమిటెడ్ యొక్క విద్యుత్ కొనుగోలుదారులకు మరియు ప్రజలకు ఇందుమూలమున తెలియజేయడమైనది.

మహబూబ్‌నగర్ ఎలక్ట్రిసిటి 1-12-1959 నుండి సూపరింటెండింగ్ ఇంజనీర్, కన్‌స్ట్రక్షన్ మరియు ఆపరేషన్ తెలంగాణ, హైదరాబా